
సృజన

ఆధునిక సాహిత్య వేదిక

173

మార్చి, 1990



సృజన
ఆధునిక సాహిత్యవేదిక

173 మాసపత్రిక మార్చి 1990

ఈ సంచికలో

ముఖచిత్రం : గోర్కీ

నిర్వహణ
సాహితీ మిత్రులు

సంవత్సర చందా రు. 40 ఈ సంచిక రు. 4

Edited, Printed and Published by P. Hemalata, Flat 11, Block 2, MIG II, Bagh Lingampalli, Hyderabad 500 044 and Printed at Nagendra Press, Vijayawada - 520 002

Working Editor : VaraVara Rao

ప్రజా ఆగ్రహ ప్రతిఫలనం

సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో సాహసిక పోరాట రూపాలు ప్రవేశ పెట్టిన యోధుడు భగత్‌సింగ్. బ్రిటిష్ ప్రభుత్వ ఉరికంబం, కాంగ్రెస్ నాయకత్వపు కుటిలనీతి కలిసి భగత్ సింగ్‌ను బలి తీసుకుని యాభై తొమ్మిదేళ్ళు గడిచాయి. భగత్ సింగ్ ఇప్పటికీ దేశవ్యాప్తంగా ప్రజాపోరాట కారులందరికీ ప్రేరణగానే ఉన్నాడు. ఆయన స్మృతి పాలక వర్గాలకు ఇప్పటికీ సింహస్వప్నంగానే ఉన్నది. అందుకే భగత్ సింగ్‌ను విగ్రహంగా మార్చడానికీ, మర్యాదస్తుణ్ణి చెయ్యడానికీ పలిన వాదు పడరాని పాట్లు పడుతున్నారు. భారత పీడిత ప్రజా ఉద్యమానికి భగత్‌సింగ్ అందించిన కానుకల్ని తుడిచెయ్యడానికి ప్రభువులు కుటిల యత్నాలు చేస్తున్నారు.

భగత్‌సింగ్‌ను బలిపెట్టిన పాలకులే ఇవాళ ఆయనను పోరాట యోధుడంటున్నారు. ఆయన అనుసరించిన పోరాట రూపాలను సాహస చర్యలుగా అభివర్ణిస్తూనే, అవే ఇవాళ జరిగితే దుందుడుకు చర్యలనీ, హింసోన్మాదమనీ విమర్శిస్తున్నారు. భగత్ సింగ్ వారసుల్ని విధ్వంసకారులంటున్నారు. ఇక్కడి పోరాటకారులను విధ్వంస కారులనీ, పోరాట రూపాలను దుందుడుకు చర్యలనీ అన్న నోటితోనే నెల్సన్ మండేలాకు నీరాజనాలు పలుకుతున్నారు. ఆయన నడిపిన పోరాటాల ఔన్నత్యాన్ని కీర్తిస్తున్నారు.

చూడగానే చిత్రంగా, రెండునాల్కల ధోరణిగా కనబడే ఈ వైఖరి నిజానికి భద్రలోగ్ భావజాలానికి సహజమైనది. తెలియకుండా కూడ ఈ భావజాలానికి లోనయిన వాళ్ళుండవచ్చు. కాని ఈ భావజాలానికి లోనయితే ప్రజాపోరాటాల పట్ల, ప్రజా పోరాట రూపాలపట్ల, ప్రజా పోరాట నాయకుల పట్ల సరైన దృక్పథం ఏర్పరచు కోవడం అసాధ్యమై పోతుంది. పోరాటం గురించి పాలక వర్గపు భాషలో మాట్లాడే దుస్థితి సంభవిస్తుంది. పోరాటంలోని ప్రతి చిన్న లోపమూ భూతద్దంలో కనబడు తుంది. పురోగమన ధారలో తిరోగమన బిందువులుండవచ్చుననే గతితార్కిక దృక్పథం లోపిస్తుంది. పోరాటం పట్ల ఆదర్శవాద అవగాహన తెలియకుండానే పెరిగి పెద్దదయి పోరాట వ్యతిరేకతకు దారితీస్తుంది. ప్రజా పోరాటాన్నీ, టెర్రరిజాన్నీ సమానం చేసి మాట్లాడుతూ పాలక వర్గాలు ఈ దృక్పథాన్నే ప్రచారం చేస్తున్నాయి.

మన దేశ పాలక వర్గాలకు ప్రజాపోరాటం మీద దుష్ప్రచారానికి మంచి సాధనంగా ఈ 'టెర్రరిజం' ఆయుధం దొరుకుతోంది. జాతీయోద్యమ చరిత్ర అంతటిలోనూ క్రియాశీల పోరాట మార్గాన్ని చేపట్టిన వాళ్ళందరికీ ప్రభుత్వం టెర్రరిస్టులని ముద్ర వేసింది. ఆ పోరాట రూపాలతో, ఆ పోరాటకారులతో ఎన్ని విభేదాలున్నప్పటికీ, ఆ పాలక భాష వాడడం తప్పనే సోయిలేని కాంగ్రెస్ నాయకత్వమూ వాళ్ళను టెర్రరిస్టులనే పిలిచింది.

నిజమైన సామ్రాజ్యవాద వ్యతిరేకతతో, భారత పీడిత ప్రజానీకం పట్ల అపారమైన ప్రేమతో, కాంగ్రెస్ సామరస్య రాజకీయాల పట్ల అసంతృప్తితో క్రియాశీల పోరాట మార్గాలు చేపట్టిన ఆ గతకాలపు మహాయోధులు ఈ నిందను తమ మీది నుంచి తొలగించుకునేందుకు సైద్ధాంతికంగానూ, ఆచరణలోనూ గొప్ప ప్రయత్నాలు చేశారు.

"విప్లవాదర్శాన్ని సాధించేందుకు అనుసరించ వలసినవి శాంతియుత పద్ధతులా, ఇతర పద్ధతులా అనే విషయానికి వస్తే, మేం ఏం ఎంచుకోవాలో నిర్ణయించేది ప్రభుత్వమేనని స్పష్టం చేయదలచుకున్నాం. తమ ఉదాత్త ఆదర్శాల కారణంగా విప్లవకారులు శాంతి కాముకులు. ఆ శాంతి న్యాయం మీదా, సమానత్వం మీదా ఆధారపడిన స్వచ్ఛమైన, శాశ్వతమైన శాంతి. పిరికితనం నుంచి ఆవిర్భవించి, తుపాకి సన్నీలతో పరిరక్షించబడే భ్రమా జనిత శాంతి కాదు. విప్లవ కారులు బాంబులు, పిస్తోళ్ళు పట్టుకుంటున్నారంటే అది కేవలం అతి తీవ్రమైన అవసరం వల్ల మాత్రమే, చిట్టచివరి మార్గంగా మాత్రమే.

'మనిషి కోసమే శాంతి భద్రతలుగాని, శాంతి భద్రతల కోసం మనిషి కాదు' అని మేం నమ్ముతాం" అని లాహోర్ కుట్ర కేసు విచారణలో చదివేందుకు తయారు చేసిన ప్రకటనలో భగత్‌సింగ్ అన్నాడు.

ఇవాళ తుపాకి మొనమీద శాంతిని నిలబెడుతున్నవాళ్ళు, 'శాంతిభద్రతల' పేరుమీద భూస్వాముల భద్రతకోసం వందలాదిమంది భగత్‌సింగుల్ని చంపుతున్న వాళ్ళు భగత్‌సింగ్‌ను పొగుడుతున్నారు. పూలమాలలు వేస్తున్నారు. భగత్‌సింగ్ ఆదర్శానికీ, ఆచరణకూ వారసులు తయారు కావద్దని కోరుకుంటున్నారు.

ఈ దృక్పథానికి పోరాటంపట్ల, పోరాట రూపాలపట్ల కూడ విముఖతలేదు. తన కాలంలో ఆ పోరాట రూపాలూ, ఆ పోరాటమూ ఉండకపోతే చాలును. తన కాలంలో కూడ తన నేలమీద కాకపోతే మరెక్కడయినా ఆ పోరాటమూ, అంతకన్న తీవ్రమైన పోరాట రూపాలూ ఉండవచ్చును. అందుకే మననేలమీద జరుగుతున్న పోరాటాలమీద నిప్పులు కురిపించేవాళ్ళే నెల్సన్ మండేలాకు ఎర్రతివాచీ ఆహ్వానాలు పలుకుతారు. పాలక హింసను ఎదిరించే ప్రజా పోరాటం గురించి మండేలా ఏమన్నాడు? "తిరుగుబాటువల్ల ప్రజల్ని నిర్విచక్షణగా ఊచకోత కోసేందుకు ప్రభుత్వానికి అంతులేని అవకాశాలు వస్తాయని మా అనుభవం నేర్పింది. కాని సరిగ్గా అమాయక ఆఫ్రికన్ల రక్తంతో దక్షిణాఫ్రికా నేల తడిసిపోయింది గనుకనే బలప్రయోగానికి వ్యతిరేకంగా మమ్మల్ని మేం బలప్రయోగం ద్వారానే రక్షించుకోవడం మా బాధ్యత అని తెలుసుకున్నాం. యుద్ధమే అనివార్యమయితే, అది మా ప్రజలకు ఎక్కువ అనుకూలమైన షరతులమీద సాగించాలని నిర్ణయించుకున్నాం...."

పాలకులకూ పాలితులకూ మధ్య యుద్ధం కొత్తది కాదు. ఆ యుద్ధం పాలితులకు అనుకూలమైన షరతులమీద జరగాలనే వాంఛా కొత్తదికాదు. కాని ఆ యుద్ధంలో రూపొందే పద్ధతుల గురించి కొత్త వ్యాఖ్యానాలు తయారవుతున్నాయి. పోరాట రూపాల్ని స్థల, కాల నిర్దిష్టంగా కాక, స్థల కాలాతీతంగా ఊహించడం జరుగుతోంది. మన స్థలంలో, మన కాలంలో అనుసరించిన పోరాట రూపాలపట్ల అసహనాన్నీ, వేరే కాలంలో, వేరే స్థలంలో అనుసరించిన అవే పోరాటరూపాలపట్ల ఆదరణనూ ఏకకాలంలో ప్రదర్శించడం జరుగుతోంది. మన కడుపులో చల్ల కదలకుండా ఎక్కడ ఏం జరిగినా ఫరవాలేదనే భద్రలోగ్ నిర్లిప్తత, కోటానుకోట్ల మానవులు నూతన మానవులవుతున్న వేళ నిస్సారపు వాదనే అవుతుందని, నిరర్థక వేదనే అవుతుందని భగత్‌సింగ్ స్మృతీ, మండేలా విజయోత్సవాలు మరొకసారి మనకు గుర్తు చేస్తున్నాయి.

జాతీయ పోలీస్ కమిషన్ అధిపతిగానూ, అటువంటి అనేక పదవులలోనూ పనిచేసిన కె. ఎఫ్. రుస్తుంజీ 'టెర్రరిజంతో వ్యవహరించడం' గురించి ఒక జాతీయ దినపత్రికలో రాశాడు. భగత్‌సింగ్ సంస్మరణ దినం తర్వాత ఆరు రోజులకు అచ్చయిన ఈ వ్యాసంలో ఆయన పాపం భగత్‌సింగ్ ప్రస్తావన తేలేదు. 1947 ఆగస్ట్

15 తర్వాత "జమ్మూ కాశ్మీర్‌లోకి పాక్ ఏజెంట్ల ప్రవేశం" దగ్గరినుంచి, నాగా, మిజో సమస్యల నుంచి, ప్రస్తుత కాశ్మీర్, పంజాబ్ సమస్యలదాకా, అస్సాం, బెంగాల్, బీహార్‌లలో జరిగిన, జరుగుతున్న ప్రత్యేక రాష్ట్ర ఆందోళనల నుంచి నక్సలైట్ సమస్యదాకా అన్ని ఆందోళనలనూ ఆయన టెర్రరిజంగానే నిర్వచించాడు. శాసనోల్లంఘన పెరిగితే ఏర్పడే ఒక రూపమే టెర్రరిజమని, అది మన రాజకీయాల్లో భాగమయి పోయిందని ఆయనన్నాడు. టెర్రరిజాన్ని మన అభివృద్ధి క్రమంలో భాగంగా కూడ అంగీకరించవలసి ఉంటుందేమోనన్నాడు "మార్పు కావాలని పేదలు కోరినప్పుడు మనం వినాలి. లేకపోతే వాళ్ళు తుపాకి అందుకుంటారు" అని అసలు సత్యాన్ని ప్రభుత్వానికి హెచ్చరించాడు.

భగత్‌సింగ్ చేసిన సాండర్స్ హత్యవెనుక, పార్లమెంటుహాలులో విసిరిన బాంబువెనుక, నెల్సన్ మండేలా ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్‌కు చూపిన సాయుధ పోరాట మార్గం వెనుక, ఉంకాంటో విసెజ్వె సామ్రాజ్యవాద నిర్మాణాలపై సాగించిన దాడుల వెనుక, ప్రపంచ వ్యాప్తంగా ప్రజా పోరాటకారులు చేపడుతున్న క్రియాశీల పోరాట రూపాల వెనుక ప్రజలు వందల సంవత్సరాలు మౌనం వహించడం ఉన్నది. పీడకుల మీద ప్రజలు చూపిన సహనం ఉన్నది.

మౌనం ఎల్లకాలం మౌనంగానే ఉండదు. సహనం సర్వకాలాల్లోనూ అణచివేతను సహించదు. ప్రజా ఆగ్రహం కట్టలు తెంచుకున్ననాడు క్రియాశీల పోరాట రూపాలు కేవలం ఆ ఆగ్రహ సాధనాలే. భగత్‌సింగయినా మరెవరయినా ప్రజా ఆగ్రహ ప్రతిఫలనాలే తప్ప విధ్వంసకారులు కారు.

ఏప్రిల్ 1, 90

రెండు పిట్టలు-రెండు పాటలు

శ్రీనివాసమూర్తి

పొద్దుననగా వెళ్ళిన రెండు పిట్టలు
గుండె నిండు వెలుగులతో ఈ సరికి యింటికి చేరవలసింది
పగలంతా బోసిపోయిన ఈ తోట ఈ పాటకి కిలకిలమనవలసింది
ఎప్పటిలా సద్దుమణిగిన పొద్దు ఈ చెట్టుపైన వాలి
పిట్టల సాహసానికి ముచ్చట పడవలసింది
చిన్నారి చెల్లెలందరూ పుస్తకాల్లో దాచుకున్న నెమలీకలతో
పిట్టలకు తురాయి కట్టవలసింది
పొద్దుననగా వెళ్ళిన రెండు పిట్టలు ఈసరికి యింటికి చేరవలసింది

తొలిఝాము దాటినా వెన్నెల యిటువైపు లేదు
దోసిట్లో గింజలతో అమ్మలందరూ గడపలముందే
పొద్దుననగా వెళ్ళిన రెండు పిట్టలు ఏమయ్యాయి
సూర్యాగ్ని గుండంలో స్నానమాడి నక్షత్రాలై వస్తాయని
అందిన వరకూ ఆకాశం చూపుల్ని పరచింది
నీళ్ళలో చేపలై వస్తాయని సముద్రం నెమ్మదైంది
వేడిగా వీస్తున్న గాలిమాత్రం సుళ్ళు తిరుగుతూ వచ్చింది
గింజలు పారిన పంటకాలవల్లో శవాలు ప్రవహిస్తున్నాయనీ
రాకాసి మబ్బు కాపుకాసి రెండు నక్షత్రాల్ని మాయం చేసిందనీ
గాలి గాయపడేవార్త తెచ్చింది
ప్రేమలుకట్టుకున్న గూడు కళ్ళముందే విధ్వంసమైంది
ఎన్ని గూళ్ళు, ఎన్ని గూడేలు
ఎన్ని విధ్వంసాలు, ఎన్ని విషాదాలు
వెక్కి వెక్కి ఏడుస్తున్న ఆకాశాన్ని ఏమని ఓదారుస్తాం
శోకాలై పొర్లుతున్న సముద్రాన్ని ఏమని ఊరడిస్తాం
పెంచిన పిట్టలనుకూడా పోగొట్టుకున్న తల్లులను ఏమని సముదాయిస్తాం
ఆక్రోశం కెరటాలై లేచిన సముద్రం హోరెత్తింది

చెట్టుదిగిన పొద్దు అరుణపతాకాన్నెగరేసి వాలిపోయింది
ఊరడిల్లిన తల్లులు కళ్ళు తుడుచుకొని కొత్తపిట్టలకు కోలాటం నేర్పుతున్నారు

* * *

పొద్దుననగా వెళ్ళిన రెండు పిట్టలు ఏమయ్యాయి
రెండు పాటలై తిరిగి వచ్చాయి
పోరాటంలో కత్తులై మెరిశాయి

పక్షినై వస్తానా...

స్వేచ్ఛాజీవి

తెల్లవారుజామున
కొందరు కోడికూతతో మేలుకుంటారు
మరికొందరు సుప్రభాతంతో మేల్కొంటారు
నేనుకూడా రోజూ అన్‌లాకప్‌బెల్‌తో మేల్కొంటాను
కాని ఈ రోజు మాత్రం అట్లా మేల్కొనలేదు
విప్లవ నినాదాలతో
నిర్బంధ వ్యతిరేక నినాదాలతో మేల్కొన్నాను
ప్రభంజనంలా తరలి వస్తున్న విప్లవ ప్రజానీకం
ప్రభంజనంలా వస్తున్న విప్లవ ప్రజానీకం అని
నేనెట్లంటున్నానంటే
తరంగాలుగా ఇస్తున్న నినాదాలు విని.
విప్లవ నినాదాలతో
ఇక్కడి వాతావరణమే మారిపోయింది
ఇంతకు ఎవరీ జనం?
ఎందుకొస్తున్నారీ జనం?
ఎవరికోసం వస్తున్నారీ జనం?
మరచిపోయావా అంటూ నా మనసు నన్ను ప్రశ్నించింది
ఒక వ్యక్తిని మరొక వ్యక్తి దోపిడి చేయలేని
నూతన సమాజం కోసం

నూతన సంస్కృతి కోసం పోరాడుతున్న
జననాట్యం పదఘట్టనలవి
ఆ గుండెల చప్పుడులో
ఆ గొంతుల విద్యుత్తులో
నేను ఎలుగై వెలుగై
కలసిపోవాలని....
చుట్టు నాలుగ్గోడలు
నాలుగ్గోడల మధ్య మరో నాలుగ్గోడలు
గోడదాటి వద్దామన్నా
పై నుండి కరెంటు తీగెలు
పక్షినై గాలిలో ఎగిరివద్దామన్నా
చుట్టు తుపాకులతో పహారా

పాట సంద్రమై

ఉదయమిత్ర

ఈ మట్టిని తొల్చి
కదనకుతూహలాన్ని పెంచి
నరాల తీగల మీద బాణీల్ని సవరించి
జనం గుండెల మీద తుడుం మోగించి
జైత్రయాత్రను సల్పినపాట
గోదావరి తీరాల్ని ఒరిసినపాట
అడివిమీద వెన్నెల్ని ఆస్వాదించినపాట
బొగ్గుబావుల్లో డైనమేటయి పేలినపాట

* * *

పాటంటే ఉత్త నినాదాల సూత్రంగాదు
భూమి నాభిని పట్టిందది
బిడ్డను కోల్పోయిన
తల్లి కడుపులో ఒదిగింది
అన్నను కోల్పోయిన

చెల్లి కంటిని తుడిచింది
నిస్త్రాణగా వాలిన పిడికిలిలో
అగ్ని పర్వతాన్నే నిలిపింది
రగల్ జెండాగ నిల్చింది

* * *

మా గుండెల్ని పిండేసి
మా గూడేల్ని తట్టి లేపినపాట
మమ్మల్ని కానరాని కాననాలకొదిలి
అనునిత్యం వెదుకులాటకు గుచ్చి
ఎక్కడెక్కడ తిరిగిందో!
ఏఏ పేరున సంచరించిందో!
ఏ రాక్షస మర్రి ఊడల నీడల చిక్కులపడిందో
ఏ రక్త కెరటపు విసుర్లకు
ఏ ఏ దూరతీరాల ఘోషించిందో
పాటా! పాటా! నా ప్రాణమా!
ఉద్యమ వర్షంలో నర్తించే మయూరమా!
గిరిజనుడు ఎక్కుపెట్టిన బాణమా!
నిన్ను స్మరించని రోజులేదు
నీవు వ్యాపించని చోటులేదు
ఎన్నేళ్ళకెన్నేళ్ళ కొచ్చావు?
ఏఏ సముద్రాల్ని దాటి వొచ్చావు?
నిశ్శబ్దం శాపమైన చోట
లేలేత పుష్పాలు
మృత్యు సముద్రంలో ఉనికి గోల్పోయిన చోట
భయం క్రీనీడల కింద
ఉదయాస్తమయాలకి తేడా తెలీని చోట
పాటా! పాటా! నా ప్రాణమా!
నా తల్లి గుండెకోతకు ప్రతిరూపమా!
మా ఇంటి వాకిట వెలిసిన

శ్మశానాల్ని పెళ్ళగించి
మళ్ళీవసంతాల్ని పుష్పింప జేయటానికొచ్చావా ?
పాటా! పాటా! నా వసంత మేఘమా !
శతృవుగుండెలో దద్దరిల్లిన ఆర్తనాదమా!
పీడిత జన రథకేతనమా!
నిల్చిపో!
లోకాల్ని ముంచెత్తే
సముద్రమై, పరిమళమై, సమున్నతమై
నిల్చిపో! నిల్చిపో!
ఈ క్షణంనీది
ఈ యుగం నీది

(విరసం సభలకు స్పందించి)

రాజనీతి

సర్వాధారి

జనం పేరు మీద
రాజనీతి అమలవుతున్నపుడు
నిన్నటి మనిషి
ఇవాళ మృగమవుతాడు

పదాలమీద పెదాలమీద
లాలిత్యం మిగిల్చి
జనపథాల మీద
రాజనీతి
విషం చిమ్ముతుంది

నిన్నటి దాకా
నిండారా ఎర్రగా పూచిందన్న మోదుగు
ఇవాళ పుట్టనే లేదంటే
ఆశ్చర్యపడకు

కళ్ళముందర కనిపించే
బీడు నేల
సస్యశ్యామల సుందర నందనమంటే
నోరు తెరువకు

స్వప్రయోజనాలతో
రాజనీతి
సత్యాన్ని అసత్యంగా
చైతన్యాన్ని బొమ్మగా
తలకిందులు చేస్తుంది

తను పలికిన విషాదాల తీయదనాలలో
తీగ తనే అదృశ్యమవుదామన్నా
రాజనీతి కానివ్వదు
ఆర్ద్రిత ఆర్ద్రిమై ఆర్ద్రిమై
కనిపించనంతగా కరిగిపోదామన్నా
రాజనీతి పోనివ్వదు

రాజనీతి
శక్తిమంతుడ్ని కుటిలుడ్ని చేస్తుంది
ఒకసారి భాష్యం పేరుమీద
ఒకసారి మౌనం పేరుమీద
ఎక్కువసార్లు జనం పేరుమీద
రాజనీతి రక్తనాళిక చాస్తుంది

జనన్యాయం
జీవితమై గమిస్తున్న చోట
నిన్నటి బందిపోటు
రేపటి మానవుడవుతాడు
స్వప్న సైనికుడవుతాడు

బంధించలేని అనుబంధం

—'గౌతమ్'

(విజిటర్స్)

ప్రవహించే నదులేకాదు
ఘనీభవించిన శిలలా దృశ్య విహారాలవుతాయి
తెల్లటి గుడ్డమీద మరకలు పడినట్లుగా
అడుగులు వేస్తారు 'విజిటర్స్'

ఇక్కడి గోడల్ని-ఇనపగేట్లని
ఖైదీల కొట్లని- వాటి ఇనుప కమ్మీలని
చిత్రంగా చూస్తారు—
అంతే చిత్రంగా ఇక్కడి మనుషుల్నీ....
ఆ చూపు మనిషిని చూసినట్లుకాదు
మరేదో చూసినట్లే—

యివన్నీ ప్రవహించే నదులే
గడ్డిపరకలమీద ఉత్తకాళ్ళతో నడిచి
గట్టు తగవుల్లో 'పెద్ద'లతో కలబడి
యిక్కడ ఘనీభవించి శిలలైనాయి—
ఈ శిలల వెనుక అజంతా శిల్పాలు లేవు
నదిగా మారాలనే తపనతప్ప—

o o o

(ఇంటర్వ్యూ)

ఎన్నడో మరిచిన ఒక స్పర్శని వొళ్ళోవేసుకొని
ఇనపతెరలైన కనురెప్పల్ని ఎత్తి
తనలో సగమైన జీవితంతో
జీవితాన్ని పంచుకోవాల్సిన ఆమెతో
ముప్పై నిముషాల రేషన్ని పంచుకుంటారు
అప్పుడు చూడాల్సింది పెదాల్ని కాదు
కిరణాలయే చూపుల్ని—
ఆ చూపులు పూల హారాలనే వేస్తాయో
జ్ఞాపకాల మాలల్నే కడతాయో !—
జీవితాన్ని ముప్పై నిముషాల్లో పంచుకుంటారు

o o o

(రొటీన్)

ఒక్క రోజునే
వందల రోజులు గడుపుతారు
కాలానికి జీవితం బందీ అయిపోతుంది
ప్రతి రోజూ అన్‌లాకప్‌తోనే
తలకింద దాచుకున్న ముఖాన్ని తగిలించుకొని
గదుల్లోంచి గోడల్లోకి పోతారు
కాలం ఇలాగే కదిలి పోతుంది
హఠాత్తుగా నీ ముఖం ఆనవాలు చూస్తావు
అది అద్దంలో కాదు
పక్కవాడి ముఖంలో....

o o o

ఈ బాటలో పున్నాగ పువ్వులు నలిగిపోతాయి
గడ్డి పరకల వెన్ను కాలిక్రిందపడి విరిగిపోతుంది
వెన్నులో కాలాన్ని పోసుకొని
కవితల్లుదామని తయారౌతానా —
కలం కదలదు—కాలం ఆగదు
స్తంభించిపోయిన ఈ జీవితంలో
ఏమీ రాయలేని తనాన్ని గురించే
ఇక్కడ కవితల్లుతాను—

o o o

ఒక సీతాకోక చిలుక అలా ఎగురుతుంది
రోకలిబండ ప్రేమగా కాలిని స్పృశిస్తుంది
మా రేషన్లో భాగానికొస్తున్నాయని
కాకుల్ని తరుముతానేగాని
కాకి కనపడకపోతే రోజంతా కారుచీకటై పోతుంది
శిశిరంలో ఆకులురాలి ఎక్కడ పడతాయో
నాకు బాగా పరిచయమే
చిగురించే కొమ్మ - రాలిపడే పండుటాకు
రావిచెట్టుని ముద్దాడే వడ్రంగి పిట్ట

భావలేశమైన కుందేలు ఎడారి చూపులు
గిరికీలుకొట్టి పైకే చేరే పావురం—
బంధించలేని అనుబంధం యిది
ఇసుక రేణువునుంచి యినప్రపంచందాకా
అన్నింటితోను జీవితాన్ని పంచుకుంటాం
కాని ఈ అనుబంధం యిక్కడ
ఏ వొక్క జీవితాన్ని బంధించలేదు—
యిక్కడ కంటి ముందరి ప్రతి అణువు
మా చెవులో గుసగుస లాడుతాయి
"స్వేచ్ఛ.... స్వేచ్ఛ.... స్వేచ్ఛ...."

సెకండ్ ఫ్రంట్

కె. సంజీవి

చీకటి ముట్టడిస్తోంది
కంపాస్ పగిలిపోయింది
గడుసు దయ్యాల దిగంబరనృత్యానికి
మరోసారి అసుర సంధ్య సిద్ధమవుతోంది.
పిల్లాపాపా ఉన్నవాళ్ళం
బేఫికరుగా విశ్రమించలేం. పదండి.
ఇది నిప్పులు నిర్మించే కోట కాదు
ఇక్కడ అగ్గిపెట్టెలు మంచుగడ్డలవుతాయి
ఇది జీవితం చిగురించే తోట కాదు
పావురాళ్ళకు విషం కోరలు మొలుస్తుంటాయి
హంతకులెవరో తెలుసుకదా
శవపరీక్ష లెందుకు
అనుకున్న తీరం అందకపోయినా
కొత్త దుఃఖాన్నయితే కనుక్కున్నాం కదా
ఇంకా ఇక్కడెందుకు. పదండి

తీనన్మెన్ స్క్వేర్‌లో
యవ్వనం గ్లాస్‌నోస్తయి పోయింది
మాసియాంగు దేశంలోనూ
సొంతచెట్టు ఫాంగ్ లీజీనే పూచింది
క్రెమ్లిన్ గంట వాటికన్‌లో మోగింది
బెర్లిన్‌లో కూలిపోవలసిందే కూలిపోయింది
మిగిలిపోయిన చెకుముకి రాళ్ళు మూట కట్టండి
మనమెందుకిక్కడ. పదండి.

బుడాపెస్టులో జెండాలు చింపి
ఎవడో మనల్ని వెక్కిరించేడని
శ్రీమతి సీసెస్కూ చెప్పులు
ఎవడో మనపై విసిరేసని
ఎందుకలా దిగులు పడడం.
వాడి పండుగకు మౌన ప్రేక్షకులమై
ఎందుకలా నుంచోవడం. పదండి

మనం గోడలు పడగొట్టేవాళ్ళమేగాని
జనాన్ని విడగొట్టే వాళ్ళం కాదు.
మనం చెప్పులు కుట్టేవాళ్ళం కావొచ్చు
జనం నెత్తిన మొట్టేవాళ్ళంకాదు.

బెల్‌విల్లీ కొండల్లో ప్రాణాలొడ్డిన వాళ్ళం
పోటెమ్కిన్ నావను నడిపించిన వాళ్ళం
ప్రపంచాన్ని ఊపేసిన పది రోజులం
వరదలెత్తిన టాటూ నదికి
వంతెనగా మారిన వాళ్ళం
మనం - గెలిచేదాక
ఆగడానికి వీల్లేని పోరాటాలం. పదండి.

వేసుకున్న చిక్కుముడులు
ఇప్పుడిప్పుడే విడవు.
దారాలు తెంపి పోగులు పెట్టకండి.

నడవడం ఎలాగో నడుస్తూనే నేర్చుకుందాం.
మంచి మజిలీ చేరాకే అలసట తీర్చుకుందాం.
మనసు చెదర నివ్వకండి.
చెమట ఆరనివ్వకండి. పదండి.

ఎవరికీ అర్థంకాని ఎవడూ ఆక్షేపించని
సంకేతాల ఇనుపకమ్ములు లెక్కబెడుతూ కూర్చోకండి.
ఆ మలుపు తిరిగాక సంగతేమిటని
వాదిస్తూ నిలపకండి. అసలిక్కడ ఆగకండి.

ఇది వంతెన.
ఎక్స్‌పైరీడేట్ ముగిసిన వంతెన.
వంతెనమీద సైనికులెవరూ
కుడి ఎడమల కవాతులు తొక్కరు.
పడుతూ లేస్తూనే పదండి ముందుకు.

[ఆంధ్రజ్యోతి దినపత్రిక సౌజన్యంతో]

ఆంటీ క్రైస్ట్ అంతం

జె. సి.

ఈ భూగోళం ఒక వైరుధ్యాల పుట్ట
ఈ నేల హృదయంలో వెచ్చగా నిద్రిస్తోంది
మంచు కౌగిలిలో ఆర్పలేని జ్వాల

మంటల వెలుగులలో విశ్రాంతి పొందుతున్న
ఒయాసిస్సు అంచుమీద ప్రేమరహిత జ్వాలల్లో
శక్తిహీనమవుతున్న
ఎడారి మనసులో చేదు జ్ఞాపకాలు

ఎగుస్తున్న ప్రజాజీవన తరంగాల పైన
నిర్మించుకున్న రాజకీయ దుర్గాలలో
పబ్బం గడుపుకుంటున్న పాలకులు
అలలను శాసించడానికీ

తలల్ని నరికేయడానికీ తలపోస్తారు
కాని సముద్ర గర్భంలోంచి పెల్లుబుకుతున్న
అపార ప్రజాశక్తిని గుర్తించలేక పోతారు

నిన్న వాళ్ళు హిట్లర్లు ఇవాళ సెసెస్కూల్యలు
రేపు మరో కబంధులు కావచ్చు

స్వేచ్ఛ మోసులెత్తిన వెంటనే
దాని కణాల్లోని అదృశ్య పరాన్న భుక్కులు
పొలాల్నీ ఫలాల్నీ జనాలహృదయాల్నీ తొలుస్తాయి
బహుళజాతి పెట్టుబడికి పుట్టిన ఆలోచనలు
ఎరువులుగా, జబ్బులుగా, మందులుగా,
పేదల జీవితాల చాకిరీగా అవతారమెత్తి
మానవ ప్రగతి పేర
వాళ్ళ నుంచి జీవితాన్ని పీల్చేసి మనుషుల్ని యంత్రాల్లా మారుస్తాయి
శాంతి పేరిట సామ్యవాద శక్తుల దిగ్బంధనం
ప్రజా పోరాటాల మీద ఉక్కుపాదం
ఏలినవారి ప్రయోజనాల పరిరక్షణ
నల్ల బజారు మరుభూమిలో
చీకటి శక్తుల విజృంభణ
పరిపక్వమైన అసంఖ్యాక అబద్ధాలు
ఇవే వాళ్ళకు ఆ నిగూఢ శిఖరానికి సోపానాలు

ఇరవై శతాబ్దాల కింద మరణించిన శిశువు
ఇంకా జన్మించ వలసే ఉంది
రోజు రోజూ మనలోపల మరణిస్తోంది జన్మిస్తోంది
యూరప్ సామ్రాజ్యంలో
సోషలిజం పునాదికింద
సెసెస్కూల్య నిర్మించుకున్న సమాధిలో
ఆ శిశువు పునర్జన్మించింది.

వద్దు

కె. ఎస్. బాబు

వద్దురో రాముని గుడి రహీంగుడి ॥వద్దు॥
మన కొద్దురో మతం పెట్టేటి అలజడి
రామన్నకు రహీమన్నకు
రక్తం ఒకటే అయ్యో! ”
రామన్నకు భూమి లేదు
రహీమన్నకు బువ్వ లేదు
మరెందుకురో రాముని గుడి రహీంగుడి ”
రాముడు పుట్టిన భూమట
రైయ్యని రమ్మంటున్నరు
పోకురో దొంగల ఎంబడి పడి ”
మసీదును మట్టి చేసి
మతం కొట్లాటే స్తరు
కల్వకురో కసాయోల్ల వెంబడి ”
ఇటుకలు మోపించి మన
నోట్ల మన్ను కొత్త రాల్లు
ఇనాకురో ఆల్లు సెప్పె మాటలన్నీ ”
నిలువ నీడ లేదు గాని
గుడులు కట్టి ఇస్తరట
సూడురో ఈళ్ల చేసె చేతబడి ”
మసీదు కాపలాదార్లు
మనను కానెటోల్లు లేరు
మరవకురో మమతే మన మతమని ”
దేవుని గుడి కద్తే నిను
దర్వాజ సూడనీరు
గంతేరో దొంగోల్ల నీతులన్ని ”
మసీదు కెల్లిన్నా మరి రోజు 'రోజా' తప్పదాయె
ఎందుకురో ఈ పరేషాన్ అన్నీ ”
రామన్నలు రహీమన్నలు అన్నలుగా వుండాలె
కూడు కొరకు గూడు కొరకు పోరు బాట సాగాలె
ఛల్! పదండిరో ఇన్కిలాబు తెవ్వడాన్కి ”

కథ

జాతస్య మరణం ధ్రువమ్

సురా

ఆదెమ్మ చచ్చిపోయిందని విన్న వెంటనే చాలా రోజులు పోయింతర్వాత కథ రాయాలనిపించింది. నేను ఇదివరకు తరచు కథలు రాస్తూ ఉండేవాణ్ణి. అప్పట్లో ఐడిపిఎల్‌లో ఉద్యోగం, మలక్ పేటలో నివాసం. రోజువారి జీవితంలో ఎన్నో పాత్రలు తారసిల్లుతుండేవి. కనీసం నెలకో కథయినా రాస్తూ ఉండేవాణ్ణి. మా కంపెనీలో ఉద్యోగస్తులందరు స్వతంత్రంగా సైడ్‌బిజినెస్ మొదలెడ్తున్న రోజులవి. ఒకళ్ళిద్దరు సెటిల్ అయ్యేసరికి నాకు కూడా బిజినెస్ మీద మనసయింది. నాన్నని ఒప్పించి నా వంతు పొలం పెట్టి బాంక్ లోన్ సంపాదించి పటాన్ చెరువులో మందుల ఫ్యాక్టరీ పెట్టాను. కథకుడిగా నా జీవితం అలా ముగిసింది. మందుల వ్యాపారం కోసం ఎడతెరిపి లేకుండా ప్రయాణాలు చేస్తూ, అలసటగా ఇంటికి తిరిగి వచ్చి పత్రికలు తిరగేయడానికి కూడా తీరిక లేని జీవితానికి అలవాటు పడిపోయాను. వారం పదిరోజుల కోసారి విజయవాడ వచ్చినా జయపురం పోయి అమ్మ నాన్నలని కలవడానికి కూడా కుదిరేది కాదు. జాబులు జవాబులు రాసే అలవాటు కూడా పోయింది. వోచర్లు, చెక్కులు సంతకం చేయడానికి తప్ప ఇతరత్రా పెన్ను పట్టుకోవాల్సిన అవసరమూ రాలేదు, కోరికా కలగలేదు.

ఆ మధ్య గొడవలయిం తర్వాత మావూరెళ్ళి అమ్మ నాన్నలని ఓదార్చి విజయవాడ వచ్చి ఈ హోటల్లో దిగాను. నేను బిజినెస్ పెట్టినప్పటి నుండి విజయవాడ వచ్చినపుడల్లా ఈ హోటల్లోనే దిగడం నా కలవాటు. మా కంపెనీ ఏజెంట్ నాకు గుడివాడలో క్లాస్‌మేటు. కులం కాలం కలిసి రావడంలో ఇద్దరి మధ్య పాత పరిచయం ఇలా బలపడింది. వాడే నాకీ హోటల్‌ని పరిచయం చేసాడు. నేనీ హోటల్లో దిగిన మొదటి రోజే ఆదెమ్మని చూసాను. పేరుకి రెస్టారెంట్‌లో అంట్లు తోమడం పని, కాని ఆదెమ్మ అందరికి అన్నిటా సహాయం చేస్తూ ఉండేది. రూములు క్లీన్ చేసే బోయిస్, అటెండెంట్లు, రెస్టారెంట్‌లో సర్వర్లు, అడపాతడపా అర్ధరాత్రి డ్యూటీ

(* ఈ కథ రచనాకాలం జనవరి, 1989)

కొచ్చే అమ్మాయిలు, చివరికి మానేజర్‌తో సహా అందరూ ఏదో ఒక అవసరానికి ఆదెమ్మని పిలుస్తూ ఉండేవాళ్ళు. నా లాంటి రెగ్యులర్ కస్టమర్స్‌కి కూడా ఆదెమ్మని పిలవడం అలవాటయి పోయింది. విచిత్రమేమిటంటే ఇంతమందిలో ఇన్నేళ్ళుగా పాపులర్ అయిన ఆదెమ్మ గురించి నలుగురికి తెలిసింది చాలా తక్కువ. ఇరవయి ఏళ్ళ క్రితం ఈ హోటల్‌లో పనికి కుదరకముందు ఆదెమ్మ జీవితం గురించి ఎవరికి తెలియదు. నాకు ఇప్పుడనిపిస్తుంది, అసలు పుట్టు పూర్వోత్తరాలు లేకపోవడం వల్లే ఆదెమ్మ నే రాయబోయే కథకి పాత్ర అవుతుందని నాకు స్ఫురించలేదని.

ఊరినుండి వచ్చి, బస్సుదిగి రూమ్‌కి చేరుకుని స్నానంచేసి తగలబడిన షాపుల్ని చూద్దామని బయల్దేరా క్రింద లాబీలో అప్పారావు నడిగితే తెలిసింది. ఆదెమ్మ మొన్నటి పోలీస్ ఫైరింగ్‌లో పోయిందని. వెంటనే వివరాలు తెలుసుకుందామని కృష్ణారావుగారి రూముకెళ్ళాను. ఆయన గొడవలు మొదలయిన రెండోరోజే వాళ్ళ ఊరెళ్ళాడు. ఇంకా తిరిగి రాలేదు. ఆయన జీవితంలో ఇంతకాలం సెలవు తీసుకోడం ఇదే మొదటిసారి అయింటుంది. తిరిగొచ్చి అప్పారావునేఅడిగాను.

గొడవ మొదలయిన మొదటిరోజు సాయంత్రమే హోటల్‌మీద పెద్ద గుంపు దాడిచేసింది. హోటల్లో గెస్టులు పనివాళ్ళతో సహా అందరు ఎక్కడి వాళ్ళు అక్కడ తప్పుకున్నారు. కృష్ణారావుగారు మాత్రం పోలీసులకి ఫోన్ చేస్తూ హోటల్‌ని రక్షించడానికి ప్రయాసపడ్డాడు, వ్యర్థంగా. చివరికి ఆయన కూడా వెనక దారినుండి తప్పించుకొని బయటపడ్డాడు. ఆయనతో పాటే బయటికి వచ్చి కృష్ణలంకలో తన ఇంటికి పోయింది ఆదెమ్మ. వారం రోజులు పోయింతర్వాత పరిస్థితి అదుపులోకి వచ్చింది. అందరు తిరిగి వచ్చారు. కానిఆదెమ్మ రాలేదు. మర్నాడు పోలీసులు మాత్రం వచ్చారు. గుర్తుపట్టడానికి వీల్లేకుండా ఉన్న ఓశవం ఫోటో చూపించి ఆదెమ్మ పోయిందనే వార్త చల్లగా బయటపెట్టారు. జరిగిందేమిటంటే రెండోరోజున ఈ రోడ్డు చివర ఉన్న మూడంతస్తుల చీరల దుకాణం లూటీ జరుగుతుంటే పోలీసులు ఫైరింగ్ ఓపెన్ చేసారు. రెండు గంటలు పోయింతర్వాత అక్కడే రోడ్డుమీదే ఆదెమ్మ శవం వాళ్ళకి కనపడింది. పక్క దుకాణంలో పనిచేసే కుర్రాడి ద్వారా ఆదెమ్మ ఈ హోటల్లో పని చేసేదని తెలిసింది. కబురు చెప్పి ఇంటివాళ్ళకి చెప్పడానికి వాళ్ళకి హోటల్లో ఎవరూ దొరకలేదు. నాలుగు రోజులాగి శవాన్ని మార్చురీనుండి తీసి వాళ్ళే దహనం చేసేసారు - అప్పారావు తన కథనం ముగించిన వెంటనే నాకీ కథ రాయాలనిపించింది.

మానేజర్ కృష్ణారావుగారి భాషలో చెప్పాలంటే ఆదెమ్మ వాళ్ళది నైజాం. వరంగల్ జిల్లా ఏటూరు నాగారం తాలుకాలో ఓమూలకి విసిరేసి నట్టుండే అబ్బాపూర్ వాళ్ళ ఊరు. ఆదెమ్మ వయసెంతో ఆదెమ్మకి కూడా తెలియదు. వాళ్ళ కులపువాళ్ళెవరు ఈ ప్రాంతాల్లో లేకపోవడంతో కులమేమిటో కూడా ఇక్కడి వాళ్ళెవరికి సరిగా తెలియదు. కాపులు బలిస్తే రెడ్లవుతారని వరంగల్‌లో నానుడి. ఆదెమ్మ రెడ్డిమాత్రం కాదు. ఉన్న అరఎకరం పొలం చెయ్యి దాటిపోయింతర్వాత మొగుడూ పెళ్ళాలిద్దరు కూలి పనికి పోతుండేవారు. బహుశా వాళ్ళ ఊళ్ళో కాపులు చిక్కిశల్యమయితే పాలి కాపులవుతారు కాబోలు. ఏమయితేనేం కూలి పనిలో వాళ్ళకి పొద్దు గడిచేది కాదు. ఇద్దరూ బతుకు తెరువుకోసం విజయవాడ వచ్చారు. ఇక్కడే సెటిల్ అయ్యారు. మొగుడు రిక్షాలాక్కుంటే తాను ఇళ్ళల్లో పని చేసేది. అలాగే కృష్ణారావు గారింట్లో పనికి కుదిరింది. ఆదెమ్మ చురుకుతనం చూసి ఆయనే ఆదెమ్మని ఇంటినుండి హోటల్ పనికి మార్చాడు. హోటల్లో చేరిన ఏడో ఆ మరుసటి ఏడో మొగుడు తాగి తాగి చచ్చిపోయాడు. అప్పుడోసారి ఆదెమ్మ ఏడ్చినట్టుకూడా కృష్ణారావు గార్కి లీలగా జ్ఞాపకం. ఆ ఏడుపుతోనే ఆదెమ్మ పుట్టింది. పుట్టినిల్లు మెట్టినిల్లు కూడా ఈ హోటల్ అయింది ఇది ఆదెమ్మ జీవిత కథ. ఈ కథ నిజమే అనడానికి కృష్ణారావుగారి మాట తప్ప ఎవరికీ ఏ ఆధారమూ లేదు.

కృష్ణారావు గారు చాలా మంచి మనిషి. వాళ్ళది కోనసీమ. తండ్రి కరణం. ఊళ్ళోనే ఉంటూ కరణీకం చేసుకోమని ఎంత చెప్పినా వినకుండా విజయవాడొచ్చి ఈ ఉద్యోగంలో స్థిరపడ్డాడు. పాతికేళ్ళుగా ఈ హోటలు మానేజర్. ఆయన చేరిన కొత్తలో ఇదో చిన్న రెస్టారెంట్. క్రమంగా అది పెరిగి పెద్దదయి రెండువందల రూములతో నాలుగు అంతస్తులతో విజయవాడలో ప్రముఖ హోటలయింది. ఆయన శ్రమ నిజాయితీ వల్లే ఇంత అభివృద్ధి జరిగిందని ఓనరుకి ఆయన మీద నమ్మకం. తమ కష్టాలు, కథలు ఓపికగా వింటాడని వర్కర్లందరికి ఆయనంటే గౌరవం. నేను నా ఏజెంటు మిత్రుడు ఎపుడయినా డ్రింక్స్ చేస్తే మాకు కంపెనీ ఇచ్చి ఎంటర్‌టయిన్ చేస్తాడని నాకు ఆయనంటే ఇష్టం. ఓ రోజెప్పుడో ఆయన చెప్తేనే నాకు ఆదెమ్మ గురించి తెలిసింది. ఆదెమ్మ కూడా ఎక్కడో ఎపుడో పుట్టిందని, ఆదెమ్మ క్కూడా పూర్వ చరిత్ర అంటూ ఒకటుందని నాకు విశ్వాసం కలగడానికి కారణం కృష్ణారావు గారి వ్యక్తిత్వమేగాని ఆదెమ్మ జీవితం కాదు. అయితే అపుడు నాకీ కథ రాయాలనే ఆలోచన రాలేదు. ఇంత సాధారణమయిన జీవితం గురించి కథ రాయకూడదని రూల్

ఏమీలేదు. ఆ మాటకొస్తే దీన్ని సాగదీసి సీరియల్ నవల కూడా రాయవచ్చు. కాని నాకు ఆ ప్రతిభలేదు. పైగా నే నీ పదేళ్ళల్లో కథలు రాయడం కూడా మానేసాను.

నాకు తెలుసు, మీరంతా ఇదేం కథ అని తేలిగ్గా తీసిపారేస్తారని. మీ మనసులో ఉన్న ప్రశ్నలేమిటో కూడా నాకు బాగా తెలుసు. ఇరవయి ఏళ్ళపాటు తలలో నాలుకలా మెదులుతూ అందర్నీ అప్యాయంగా పలకరించే ఆదెమ్మ అకస్మాత్తుగా సంఘవ్యతిరేక శక్తిగా మారి నిజంగానే ఆ రోజు చీరల దుకాణం లూటీ చేసిందా అన్న ప్రశ్న నాలోనూ రేగింది. ఆదెమ్మ ఎలా చచ్చిపోయింది? లూటీ చేస్తుంటే గుండె దెబ్బతగిలిందా? తగలబడిన తన హోటలుని చూడ్డానికి వెళ్తుంటే ప్రమాదవశాత్తు ప్రాణం పోగొట్టుకుందా? చచ్చిపోయిన ఆదెమ్మ ఎవరు? రెడ్డి కాలేక పాలికాపయిన రైతుబిడ్డా? నైజాం నుండి విజయవాడకు బతుకు తెరువు కోసం వచ్చిన కూలి మనిషా? అందరూ అభిమానించే హోటల్ వర్కరా? కేవలం స్త్రీయా? మరణించినపుడు ఆదెమ్మ ఎవరు అవిడ ఐడెంటిటీ ఏమిటి అన్న ప్రశ్నలు నాకు కూడా స్ఫురించాయి. కాని నేను చెప్పదల్చుకున్నదల్లా మనల్ని వేధించే ఈ ప్రశ్నలకి జవాబులు ఈ కథకి అనవసరం అని మాత్రమే. కథకి ఆదెమ్మ మరణిస్తే చాలు. ఇంతకీ మరణించింది ఆదెమ్మేనా?

పుట్టిన ప్రతివాడు చచ్చి తీరవలసిందే అని భగవద్గీతకారుడు అన్నాడు. కాని చచ్చిన ప్రతివాళ్ళు 'ఒకప్పుడు జీవించి యుండవలెను' అని భగవంతుడు కూడా అనలేదు. ఇదెలా సాధ్యం అని ధర్మసందేహం కలిగితే కథంతా మరోసారి చదవండి. ఆదెమ్మ పుట్టుపూర్వోత్తరాల గురించి కృష్ణారావుగారి మాట, చావు గురించి పోలీసులు ఆలస్యంగా అందజేసిన కబురు తప్ప మనకే ఇతర సాక్ష్యాధారాలులేవు. వాళ్ళ చెప్పదు మాటలు వినకుండా నేను నేరుగా నిజా నిజాల్ని నిర్ధారణ చేసుకోవచ్చు. కాని నాకు అప్పుడీ కథ రాయడం సాధ్యమయ్యేదికాదు. జీవితాన్ని కథ కింద, మనుషుల్ని పాత్రల కింద రూపొందించే క్రమంలో హత్యలు చేయడం కథకులందరికి అలవాటే. ఎన్నో ఏళ్ళుగా సాగుతూ వస్తున్న ఈ హత్యాకాండ వల్లే మన సాహిత్యం జనాదరణని పొందింది. కథకుడిగా నా పాఠకుల మీద నేను అధికారం చెలాయించడం కోసం ఇలా హత్యలు చెయ్యడం, చేయించడం, ఎవరయినా చేస్తే ఆమోదించడం

దక్షిణాఫ్రికా కోసం ...

నెల్సన్ మండేలా విడుదలతో దక్షిణాఫ్రికా మరోసారి సంచలన వార్త అయింది. ప్రజాపోరాటాలలో నిమగ్నమై ఉన్నవాళ్ళ నుంచి తమ ప్రాంతంలోని పోరాటాన్ని వ్యతిరేకించే వాళ్ళవరకూ అందరూ దక్షిణాఫ్రికా ప్రజాపోరాటం గురించి మాట్లాడుతున్నారు. నెల్సన్ మండేలాకు ప్రపంచం నలుమూలల నుంచీ ప్రజలూ, ప్రజా వ్యతిరేక ప్రభువులూ కూడ ఆహ్వానం పలుకుతున్నారు.

ఇంత విస్తృతి సాధించిన దక్షిణాఫ్రికా ప్రజా పోరాటం ఏమిటి?

జూలూ, బసుటో, ఖోసా, పోడో, ట్వానా, సోథో, షాంగాన్, త్సోంగా, వెండా తదితర ఆఫ్రికన్ తెగలకు చెందిన నేల దక్షిణాఫ్రికా. ఆ నేలమీదికి పదిహేడో శతాబ్దం మధ్యభాగంలో తరలి వచ్చారు బోయర్లు. హాలెండ్‌నుంచి డచ్ ఈస్టిండియా కంపెనీ తరఫున వ్యవసాయదారులుగా వచ్చిన బోయర్లకు వ్యతిరేకంగా స్థానిక బంటూలు వీరోచిత పోరాటాలు చేశారు పంధొమ్మిదో శతాబ్దపు తొలిరోజుల్లో ఇంగ్లీషు వాళ్ళూ ఈ భూమిమీద కన్నువేశారు. బోయర్లు, బ్రిటిషర్లు తమది కాని నేలమీద నేలకోసం యుద్ధాలు చేసుకున్నారు. బంగారం, వజ్రాల నిక్షేపాలు విస్తారంగా ఉన్న ఆ బంగారు నేలమీద స్థానికులు పరాయివాళ్ళయిపోయారు. డచ్చివాళ్ళు ఓడిపోయారు. బ్రిటిష్‌వాళ్ళు 1910లో యూనియన్ ఆఫ్ సౌత్ ఆఫ్రికా పేరుతో దేశాన్ని "రూపొందించారు"!

పంథొమ్మిదో శతాబ్దమంతా డచ్చివాళ్ళకూ, ఇంగ్లీషువాళ్ళకూ వ్యతిరేకంగా బ్రహ్మాండమైన పోరాటాలు సలిపి ఓడిపోయిన స్థానికగిరిజన తెగలు ఆ శతాబ్ది చివరి రోజుల్లో రాజకీయంగా సంఘటితం కావడం ప్రారంభమైంది. ఒకవైపు ఆఫ్రికన్‌లు

ఒక అవసరం అని నాకు ఎప్పుడో బోధపడింది. కాని కథకుల కంటె గొప్ప ప్రతిభావంతులయిన కథకులు మనల్ని ఇప్పుడు పాలిస్తున్నారనే సత్యం మాత్రం సాక్ష్యాధారాలు లేకుండా పుట్టి చచ్చిన ఆదెమ్మ ద్వారానే నా కర్థమయింది. అందుకే ఇన్నేళ్ళు పోయింతర్వాత మళ్ళీ ఓ కథ రాసాను.

(శ్రీయుతులు దేవినేని నెహ్రూ, స్వర్గీయ వంగవీటి మోహన రంగా గార్లకి కృతజ్ఞతలతో)

ఇట్లా సంఘటితమవుతుంటే, మరోవైపు డచ్చివాళ్ళూ, ఇంగ్లీషువాళ్ళూ ఏకమై ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. ఆ ప్రభుత్వం ఆఫ్రికన్‌లకు కొన్నిరకాల ఉద్యోగాల్ని నిషేధించింది. ఆఫ్రికన్‌లను తక్కువ వేతనాల శ్రమకే పరిమితం చేసింది. ఆఫ్రికన్‌లు పంటమనుషులుగా, గనిపని మనుషులుగా, తోటమాలీలుగా, సఫాయీలుగా మారిపోయారు.

శ్రమలో, ఆర్థిక జీవనంలో మొదలయిన ఈ అంతరాలు సాంఘిక జీవనంలో అంతరాన్ని, వివక్షను, అణచివేతను పెంచిపోషించాయి. ఆఫ్రికన్లు పేవ్‌మెంట్లమీద నడవగూడదు. తెల్లవాళ్ళు ఎదురయినప్పుడు టోపీతీసి పట్టుకోవాలి. రైళ్ళలో జంతువుల్ని రవాణాచేసే పెట్టెల్లాంటి నాలుగో తరగతి పెట్టెల్లో ప్రయాణించాలి. అడిగినప్పుడల్లా పోలీసులకు తమ పాసులు, పన్నుల రశీదులు చూపాలి. తెల్లవాడి కోర్టు వాళ్ళ మాట వినదు, విన్నా నమ్మదు.

ఈ దుర్భరమైన వివక్షకు వ్యతిరేకంగా ఆఫ్రికన్ విద్యావంతులలో ప్రారంభమైన తిరుగుబాటు ఆలోచనలు 1912లో దక్షిణాఫ్రికా నేటివ్ నేషనల్ కాంగ్రెస్ ఏర్పడడానికి కారణమయ్యాయి. ఒకవైపు ఆఫ్రికన్‌లు తమ పోరాటానికి రాజకీయ నిర్మాణ రూపాలు ఇస్తూ ఉంటే ప్రభుత్వం మౌలికమైన భూమి సమస్యవైపు చూపు సారించింది. 1913లో ప్రవేశపెట్టిన నేటివ్ లాండ్‌బిల్ ప్రకారం అప్పటికి పది లక్షలమంది ఉన్న తెల్లవాళ్ళకు 90 శాతం భూమిపై అధికారం ఉంది. అప్పటికి నలభై లక్షల మంది ఉన్న నల్లవాళ్ళకు 7.3 శాతం భూమిపై మాత్రమే అధికారం ఉంది. అట్లాగే ఈ బిల్లు ప్రకారమే తెల్లవాళ్ళ భూములమీద నల్లవాళ్ళు ఉండడం నేరం. ఈ చట్టంతో నల్లవాళ్ళు తాము పుట్టిన నేలమీదనే పరాయివాళ్ళయి పోయారు. మరోవైపు అనుమతిపత్రాల నిబంధనలు మరింత తీవ్రతరమయ్యాయి. ప్రతినెలా ఒక షిల్లింగ్ విలువగల కొత్త పాస్ కొనుక్కోవాలనే నిబంధన వచ్చింది. అయితే అప్పటికి ఎన్. ఎన్. సి. నాయకత్వానికి ఇంకా బ్రిటిష్ పాలకుల స్వేచ్ఛా ప్రియత్వం మీద, విజ్ఞప్తులు సాధించే ఫలితాల మీద నమ్మకం పోలేదు.

క్రమక్రమంగా 1920 దశకానికి కాంగ్రెస్ సత్యాగ్రహ ఉద్యమాన్ని, అనుమతి పత్రాల్ని వాపస్‌చేసే ఆందోళనల్ని చేపట్టడం మొదలెట్టింది. 1922 నాటికి ప్రభుత్వంలో అవిశ్వాసాన్ని ప్రకటించింది. బ్రిటిష్ ప్రభుత్వంలో కూడ విశ్వాసం

ఉంచనవసరం లేదని తీర్మానించే స్థాయికి ఎదిగింది. ప్రభుత్వం కొత్త జాతి వివక్ష విధానాల్ని ప్రకటిస్తూ నల్లవాళ్ళ వాక్సభా స్వాతంత్ర్యాలమీద, తెగల నాయకుల హక్కులమీద దాడిని కొనసాగించింది. ఈ స్థితిలో కాంగ్రెస్ ఇప్పటి రూపమైన ఎ. ఎన్. సి.గా మారింది. పరిస్థితులు ఆదేశిస్తున్న కర్తవ్యాలకు, నాయకత్వపు సంకోచాలకు మధ్య సాగిన ఘర్షణలో ఎ.ఎన్.సి. క్రమక్రమంగా కార్యాచరణ వేపు, వామ పక్షాలవేపు అడుగుల వేయడం మొదలు పెట్టింది. ప్రభుత్వం ఒక కొత్త నల్లచట్టం ద్వారా ఆఫ్రికన్లను జిల్లాలనుంచి బహిష్కరించే అధికారాన్ని సంతరించుకుంది. ఎ. ఎన్. సి. సమావేశాలను నిషేధించడం ప్రారంభించింది.

ఆకటి దశాబ్దంలోనూ, రెండో ప్రపంచయుద్ధ కాలంలోనూ మారుతూ వచ్చిన దక్షిణాఫ్రికన్ రాజకీయార్థిక వాతావరణం ఆఫ్రికన్ యువజనులలో కొత్త సమరశీల ఆలోచనలను రేకెత్తించింది. జాతీయవాదం ఒక సెంటిమెంటు కాదనీ, వలస పాలనకు వ్యతిరేక కార్యాచరణ అనీ యువకులు గుర్తించడం ప్రారంభించారు. జాతీయ వాదమంటే రంగుభేదపు తెల్లవానిమీద నల్లవాని పోరాటం మాత్రమే కాదనీ, తమ నేల మీద, తమ మీద, తమ ఆర్థిక, సాంఘిక, రాజకీయ, మత జీవనం మీద ఉక్కుపాదం మోపిన పాలకవర్గం మీద పీడిత వర్గపోరాటమనీ ఆఫ్రికన్లు గుర్తించారు. ఆ గుర్తింపు వ్యక్తీకరణ కూడ పొందింది ఎ.ఎన్.సి.కి అనుబంధంగా యూత్‌లీగ్ ప్రారంభమైంది. యూత్‌లీగ్ ఎ.ఎన్.సి.కి కొత్తచూపునూ, కొత్త శక్తినీ ఇవ్వతలపెట్టింది. ఆఫ్రికన్ జాతీయవాదపు ఆర్థికపునాది సోషలిజమని అది ప్రకటించింది. సోషలిజం "మన పూర్వీకుల నుంచి మనకందిన విలువైన వారసత్వం" అని యూత్‌లీగ్ గుర్తించింది. ఆఫ్రికన్ సమాజంలో సాంప్రదాయికంగా మనుషులను వాళ్ళ ఆస్తినిబట్టికాక సమాన స్థాయిలో పాల్గొననిచ్చే ఖోట్లాలవంటి గిరిజన సభల వారసత్వంగా ప్రజాస్వామ్యాన్ని అది స్వీకరించింది.

ఎ.ఎన్.సి. "చేతికి మట్టి అంటని పెద్దమనుషుల సంఘం"గా అణచివేతకు లొంగిపోయిందనీ, ప్రస్తుతం యూత్‌లీగ్ ఆఫ్రికన్ జాతీయవాదపు మేధస్సంపదగానూ, శక్తివనరుగానూ నిలిచి, ఎ.ఎన్.సి.ని పునస్సంఘటితం చేసి, స్వేచ్ఛా సమరానికి శక్తినీ, మార్గాన్నీ, పటుత్వాన్నీ ఇవ్వాలని యూత్‌లీగ్ ప్రకటించింది. దేశంలోని భూమినంతా అన్నిజాతుల రైతులకు జనాభా నిష్పత్తినిబట్టి పంచాలనీ, రైతు

లకు ప్రణాళికాబద్ధ అభివృద్ధినీ, శాస్త్రీయ పద్ధతులనూ నేర్పి పూర్తిస్థాయి పారిశ్రామికీకరణ సాధించి, శ్రామికులందరి జీవన ప్రమాణాన్ని పెంచాలని, అన్నిరంగాలలోను వర్ణ వివక్షను రద్దు చేయాలని యూత్‌లీగ్ లక్ష్యప్రకటన చేసింది.

వర్ణ వివక్షను తన సిద్ధాంతంగా ప్రకటించుకునే నేషనల్‌పార్టీ 1948లో అధికారంలోకి వచ్చిన తర్వాత ఆఫ్రికన్ ప్రజా పోరాటం మీద ప్రభుత్వ అణచివేత తీవ్రతరమయింది. గ్రూప్ ఏరియాస్ ఆక్ట్, పాపులేషన్ రిజిస్ట్రేషన్ ఆక్ట్, సప్రెషన్ ఆఫ్ కమ్యూనిజమ్ ఆక్ట్ మొదలైన అనేక నల్లచట్టాలు అమల్లోకి వచ్చాయి. 1959 జూలైలో అమలులోకి వచ్చిన సప్రెషన్ ఆఫ్ కమ్యూనిజం ఆక్ట్ ప్రకారం దేశంలో సాంఘిక, రాజకీయ, ఆర్థిక మార్పులు తేదలచుకున్న వారెవరయినా కమ్యూనిస్టే అవుతారు. న్యాయశాఖామంత్రి ఎవరినైనా కమ్యూనిస్టుగా గుర్తిస్తే వారిని సంస్థలనుంచి, సమావేశాలనుంచి, ప్రాంతాలనుంచి నిషేధించవచ్చు. 10 సంవత్సరాల జైలు శిక్ష విధించవచ్చు. 1951 లో ప్రభుత్వం ఈ ఆక్టును వెనుకటి నుంచి వర్తించే లాగ సవరించింది. ట్రేడ్ యూనియన్లపై దాడి చేసింది. గిరిజన జీవిత ప్రత్యేకతను పరిరక్షిస్తానని పేరుతో గిరిజన జీవితాన్ని వక్రీకరించి బంటూ పాలక ప్రాంతాలు ఏర్పాటు చేసింది.

1952లో నల్లచట్టాలకు వ్యతిరేకంగా శాసనోల్లంఘన కార్యక్రమాన్ని ఎ ఎన్ సి ప్రారంభించింది. ఏప్రిల్‌నుంచి డిసెంబర్ వరకు వేలాదిమంది ప్రభుత్వ శాసనాల్ని ధిక్కరించి జైళ్ళపాలయ్యారు.

ప్రజాచైతన్యం ఇలా విస్తృతమవుతున్న సమయంలో ప్రభుత్వం ఎ ఎన్ సిని వేధించడానికి కుట్ర ప్రారంభించింది. 1956 డిసెంబర్‌లో 156 మంది ఆఫ్రికన్ నాయకులను అరెస్టుచేసి కుట్రకేసు పెట్టింది. దేశద్రోహ విచారణ పేరుమీద ఈ విచారణ తొమ్మిదినెలలపాటు సాగింది. ఈ 156 మంది నిందితులలో మొదట 91 మంది మీద, తర్వాత 61 మంది మీద ప్రభుత్వమే కేసును ఉపసంహరించుకోగా 1961లో మిగిలిన వారిమీద కేసు కొట్టివేయబడింది.

కాని ఈ మధ్యకాలంలో ప్రజాందోళనలు పెరుగుతున్న క్రమంలోనే ప్రజాందోళనలమీద నిషేధమూ పెరుగుతూ వచ్చింది. పాస్‌ల వ్యతిరేక ఆందోళన తీవ్ర

రూపం దాల్చింది. 1960 మార్చ్ 21న షార్ప్‌విల్లీలో ప్రభుత్వం 69 మందిని కాల్చి చంపి వేసింది. దేశవ్యాప్తంగా ఎమర్జెన్సీ విధించింది. పెద్దఎత్తున అరెస్టులు సాగాయి. ఆఫ్రికన్ జాతీయవాద సంస్థలన్నీ నిషేధానికి గురయ్యాయి. ఈ స్థితిలో కూడ సమ్మెలు నిర్వహించాలని, శాసనోల్లంఘన జరపాలని ఎఎన్‌సి భావించింది. ఈ కార్యక్రమాలలో పాక్షిక విజయాలు సాధించడంనుంచి ఎఎన్‌సి నాయకులలో కొత్త ఆలోచనలు రగుల్కొన్నాయి.

శాంతియుతంగా సాగుతున్న తమ ప్రదర్శనలను నగ్నమైన రాక్షసత్వం అణచివేస్తున్నప్పుడుకూడ ప్రజలు అహింసామార్గంలోనే సాగాలనడం నిష్ప్రయోజనకరం అని నెల్సన్ మండేలా గుర్తించాడు. ఈ గుర్తింపు సంఘటితమైన ఫలితంగానే ఉంకాంటో విసిజ్వే (జాతిచేతిలో ఈటె) అనే సాయుధ పోరాట సంస్థ ప్రారంభమైంది. ప్రభుత్వ సంస్థల మీద దాడిచేసి ధ్వంసం చేయడం ఈ సంస్థ లక్ష్యం. దాడి సందర్భంగా ప్రజలకు ఎటువంటి హానీ జరగకూడదనేది దాని నియమం. 1961 డిసెంబర్ 16న విద్యుచ్ఛక్తి కేంద్రాలమీద, బాటూ వ్యవహారాల కార్యాలయాలమీద బాంబుదాడులు చేసి పేలుళ్ళతో తనను తాను ఆవిష్కరించుకుందీ సంస్థ. ఈ సంస్థ ఇతరదేశాల లోని ఆఫ్రికన్ పోరాట సంస్థల సహాయంతో గెరిల్లా శిక్షణను, ఆయుధాలను సమకూర్చుకుంది.

1962 అగస్ట్‌లో అజ్ఞాతవాసంలో ఉన్న నెల్సన్ మండేలాను అరెస్టుచేశారు. ఆఫ్రికన్ కార్మికులను సమ్మెకు రెచ్చగొట్టాడని, తగిన అనుమతి పత్రాలు లేకుండా విదేశాలలో తిరిగివచ్చాడని నేరాలు ఆరోపించారు. ఈ కేసులో మండేలా నేరస్తుడని కోర్టు భావించింది. మండేలాకు ఐదు సంవత్సరాల కఠినశిక్ష పడింది. మండేలాను రాబిన్‌ద్వీపంమీద ఏకాంతవాసంలో ఉంచారు.

మరోవైపు 1963లో దక్షిణాఫ్రికాలో ఉంకాంటో విసిజ్వే కార్య కలాపాలు విస్తృతమయ్యాయి. 1963 మే1న ప్రభుత్వం 90 రోజుల నిర్బంధచట్టాన్ని ప్రవేశపెట్టింది. ఈ చట్టంప్రకారం పోలీసులు ఎవరినైనా ఏ కారణమూ చూపకుండా, విచారణలేకుండా 90 రోజులపాటు ఏకాంతవాసంలో ఎవరినీ కలవకుండా నిర్బంధించి ఉంచవచ్చు. ఈ నిర్బంధాన్ని పొడిగించవచ్చు. ఆ సంవత్సరం జులై 12న జోహాన్స్‌బర్గ్ సమీపంలోని రైవోనియాలో ఒక వ్యవసాయక్షేత్రం నుంచి అజ్ఞాత

వాసంలో ఉన్న ఎఎన్‌సి అగ్రనాయకులందరినీ పోలీసులు అరెస్టు చేశారు. అక్కడ దొరికిన పత్రాల ఆధారంగా మండేలాతో సహా ఎఎన్‌సి నాయకులమీద కొత్త నేరారోపణలు చేశారు. హింసాత్మక విప్లవంకోసం విధ్వంసక చర్యలు జరిపేందుకు మనుషుల్ని కూడగట్టారనీ, గెరిల్లా యుద్ధతంత్రంలో శిక్షణ ఇచ్చారనీ, కమ్యూనిజం లక్ష్యాలకోసం దక్షిణాఫ్రికామీద దాడిచేసే విదేశీ సైన్యాలకు సాయపడేందుకు నిర్ణయించుకున్నారనీ, ఈలక్ష్యాలకోసం ఆల్జీరియా, లైబీరియా, నైజీరియా, టునీషియాల నుంచి నిధులు సేకరించారనీ ఆరోపణలు చేశారు. 193 హింసాత్మక సంఘటనలను ఈ నిందితుల ప్రోద్బలంపైన జరిగినవిగా ఆరోపించారు. నిజానికి ఈ 193 ఘటనలలోనూ ప్రాణహాని జరుగలేదు. ప్రభుత్వ ఆరోపణలను ఖండిస్తూ డిఫెన్స్ న్యాయవాదులు, స్వయంగా నిందితులు చేసిన వాదనలన్నిటినీ కోర్టు పెడచెవినిపెట్టింది. నిందితులు తీవ్రమైన దేశద్రోహానికి పాల్పడ్డారని భావించి ఎనిమిదిమంది నిందితులకు యావజ్జీవ కారాగార శిక్షలు విధించింది.

నిషిద్ధ సంస్థలుగా ఎఎన్‌సి ఉకొంటో విసిజ్వేలు దేశంలో అజ్ఞాతంగా పని చేయడం ప్రారంభించాయి. ప్రజల్ని అణచిపెట్టే నల్లచట్టాలు మరెన్నో అమలులోకి వచ్చాయి. ఆలివర్ టాంబో రహస్యంగా దేశంలోంచి బైటికివచ్చి ఎఎన్ సిని ప్రవాసంలో నడపడం ప్రారంభించాడు. దేశంలో ఆఫ్రికన్ జాతీయవాదజ్వాల ఆరిపోలేదనేందుకు చిహ్నంగా జోహాన్స్‌బర్గ్ సొవెటో టౌన్‌షిప్‌లో 1976లో పెద్దఎత్తున అల్లర్లు చెలరేగాయి. ప్రపంచమంతా అసహ్యించుకుంటున్నప్పటికీ, బ్రిటన్, అమెరికా, ఇజ్రాయిల్, అర్జెంటీనాలవంటి దేశాల మద్దతుతో దక్షిణాఫ్రికా ప్రభుత్వం ప్రజలమీద అతిక్రూరమైన దమననీతిని అమలుచేసింది. కొత్తరాజ్యాంగాన్ని ప్రకటించి వోటుహక్కును పరిమితం చేసింది. అణచివేత పెరిగినకొద్దీ ప్రజల ప్రతిఘటనా పెరుగుతూ వచ్చింది. ఈ ప్రతిఘటనను విశాల ఐక్య సంఘటనలో భాగం చేసేందుకు యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ పుట్టింది.

ప్రపంచ ప్రజాభిప్రాయం, అంతర్గతంగా పెరుగుతున్న ప్రజాప్రతిఘటన శ్వేత జాత్యహంకార ప్రభుత్వానికి చరమగీతం పాడడంప్రారంభించాయి. ఈ నేపథ్యంలో బోథారాజీనామాచేసి ఆస్థానంలో డిక్లార్క్ అధికారానికి వచ్చాడు.ముఖ్యమైన వర్ణవివక్ష చట్టాలను మార్చకుండానే ప్రచారంతో, భ్రమలతో డిక్లార్క్ దక్షిణాఫ్రికా ప్రజా

దక్షిణాఫ్రికా కథ :

నన్ను మనిషనొద్దు

తుతుజెలి మత్షోబా

చట్టం దృష్టిలోనూ,
కనీసం నా తోటి మానవుడి దృష్టిలోనూ కూడా
నేను మనిషిని కానందుకే ఈ కథ —

నిజానికి నాలోని మనిషి ఎప్పుడో చచ్చిపోయాడు. ఈ జీవితకాలంలోనే లెక్కలేనన్నిసార్లు చచ్చిపోయాడు ఇప్పుడు మిగిలుంది ఒట్టి డొల్ల మాత్రమే. చనిపోయిన ఆ మనిషి కథ చెప్పడానికి జీవచ్ఛవం మాత్రమే మిగిలుంది. ఆ చనిపోయిన వాడు ఎన్ని కష్టాలు అనుభవించాడో అంతా నేనూ అనుభవించాను. అతని బాధలే నా బాధలు కూడా. ఇంకా చెప్పాలంటే - ఇద్దరం ఒకే రకమైన కటిక చేదు జీవిత సారాన్ని రుచి చూశాం. మేమిద్దరం ఒకే గొలుసులో పూసలం.

వాళ్ళు నన్ను పట్టుకున్నప్పుడల్లా తాత్సారం చేసేవాడిని, అబద్ధాలాడేవాడిని, లంచాలిచ్చి తప్పించుకునేవాడిని, హింసించేవాళ్ళ- నా ఆడవాళ్ళముందే లెక్కలేనన్ని సార్లు వాళ్ళ చేతదెబ్బలు తిన్నాను - అయినా ఓర్చుకునే వాడిని. కన్నతల్లి జననాంగాలమీద ఒట్లు, ప్రమాణాలు చేసేవాడ్ని. ఇంకా తప్పనప్పుడు, నా తోడబుట్టిన ఆడ కూతుళ్లని ఆ తోడేళ్ళకి ఎరగా వేసేవాడిని. ఇలా బతికేను. అందుకే నిజానికి నేను ఎప్పుడో చచ్చి పోయాను.

స్వామ్యం వైపు ప్రయాణిస్తున్నదనే ఆశలు కల్పిస్తున్నాడు. మొత్తంమీద ఈ ఆశలు అడియాసలేగాని, కనీసం ఎఎన్‌సి వంటి సంస్థలు బహిరంగంగా పనిచేసేస్థితి, నెల్సన్ మండేలా వంటి నాయకులు విడుదలయ్యే స్థితి ఇవాళ దక్షిణాఫ్రికాలో మళ్ళీ నెలకొంది.

ప్రజాపోరాటం ఎంత కష్టభరితంగా, సుదీర్ఘంగా జరగవలసిఉంటుందో, ఎన్ని చీలికలు తలెత్తినా అంకిత దీక్షతో పనిచేసే సంస్థ ఎట్లా పోరాట నాయకురాలిగా నిలబడ గలుగుతుందో, చరిత్ర పురోగమన నియమం ఎంత కచ్చితంగా, ఎంత స్పష్టంగా అమలు జరుగుతుందో తెలుసుకోవడానికి ఎనిమిది దశాబ్దాల దక్షిణాఫ్రికా ప్రజాపోరాటం ఒక ప్రబల నిదర్శనం.

మమ్మల్ని కొల్లగొట్టడానికి వాళ్ళెప్పుడూ శుక్రవారమే వచ్చేవాళ్ళు. ప్రతి శుక్రవారం వచ్చేవాళ్ళు. ఇప్పుడిప్పుడు ఏ నెలకొకసారో వస్తున్నారనుకోండి. కొల్లగొట్టడానికి జిమ్‌హోప్‌కన్నా మంచి చోటు దొరికుంటుంది. అందుకే తరచూ రావడం లేదు. జిమ్‌హోప్‌కి చాలా విషాద స్మృతులున్నాయి. ప్రతి శుక్రవారం వచ్చి మమ్మల్ని పీడించే వారు కాస్తా మరికొంచెం ముందుకెళ్ళి మాకు ఉత్తరాన ఉన్న హాస్టల్ ప్రాంతంలోకి కూడా చొరబడడం మొదలుబెట్టారు. ఆ కూలివాడ మురికివీధుల్లోనే నిలబెట్టి నిలువునా పీల్చిపిప్పి చేసి వదిలిపెట్టడం ప్రారంభించారు. డెభ్భైయ్యొకటు జూన్‌లో ఒకసారి వచ్చారు. ఆ తరవాత సంవత్సరంలో చాలా అరుదుగా కనిపిస్తున్నారు. మృత్యుపీడల్ని అంతతొందరగా తుడిచేయలేం. మెల్లిగా వాటిని తొలగించుకుని బయటపడుతున్న సమయంలో మళ్ళీ ఇంకోసారొచ్చేవాళ్ళు. మా జీవితాల్లోంచి పూర్తిగా మాత్రంవాళ్ళు నిష్క్రమించదల్చుకోలేదు. అందుకే ఆ సంఘటనల్ని మేం మర్చిపోలేం.

శాంతి భద్రతలు కాపాడే శాంతి అధికారులుగా చలామణీ అవుతూ వాటాంతాల్లో పిరికివాళ్ళని, అమాయకుల్ని, నిర్దోషుల్ని దోచుకునే ఆసాయుధపోలీసులగురించే నేను చెప్తున్నానని కొంతకాలంపాటు సోవెటోలో వున్నవాళ్ళెవరైనా ఇట్టే గ్రహిస్తారు. ఈ మురికివాడలన్నింటిలోకీ శాంతి అధికారులకన్నా పెద్దదొంగ లెవరూ వుండరు. వీరు ఘరానా గజదొంగలు. ఎందుకంటే మిగతా దొంగల్లాగా కాకుండా వీళ్ళు అందరూ చూస్తూండగానే బహిరంగంగా దోచుకుంటారు. దీని గురించి ఏమీ చెయ్యలేం. కారణం వారు చట్టం పేరుతో దోచడమే. కనుక వారిని వ్యతిరేకించేపని ఏది చేసినా అది తిరగబడ్డమే అవుతుంది. చట్టాన్ని ఉల్లంఘించడమేఅవుతుంది.

ఇదిలా ఉండగా ఈ శుక్రవారం జిమ్‌హోప్ రైల్వేస్టేషను బ్రిడ్జిమీద మేము నిల్చునున్నాం. సాయంత్రం ఐదవుతోంది. పడమటి కనుమలమీదికి సూర్యుడు ఒరిగిపోతున్నాడు. అగ్నిగోళంలా ఉన్న సూర్యుడి కిరణాలు సోకి మబ్బులన్నీ ఎర్రెర్రబారాయి. ఇంటికప్పులనించి లేస్తున్న బొగ్గులపొయ్యి పొగలు బ్రహ్మాండమయిన మబ్బులా తయారయ్యాయి. రెండు మూడు నిముషాలకొకసారి విద్యుత్‌రైళ్ళు మేం నిలుచున్న బ్రిడ్జికిందనుంచొచ్చి లెక్కలేనంతమందిని దింపేసి వెళ్ళిపోతున్నాయి. దిగుతున్న వాళ్ళలో చాలామంది హాస్టల్స్‌లో ఉంటున్నవారే. తిండికోసం, రొట్టెల

కోసం వాళ్ళందరూ మొహేల్ వీధుల్లో పరుగులు తీస్తున్నారు. జమ్‌హోవ్‌కి వచ్చిన ఆఖరి రైలు మూడుస్టేషన్ల అవతలున్న ఫెఫెనికి బయల్దేరింది. తూర్పు పశ్చిమ సోవెటోకి మధ్యనున్న న్యూకెనడాకి వెళ్ళే ఇంకోరైలు బ్రిడ్జి కిందనుంచి ఇప్పుడే వచ్చి ఆగింది. ఫెఫెనికి బయల్దేరబోతున్న ఆ రైలునించి హాస్టల్స్‌కెళ్ళే ఆఖరి జట్టుకూడా దిగింది. వాళ్ళందరూ మొహేల్ వీధులవాటి ఇలియట్ వైపు వెళుతున్నారు. అంతా ఖాళీగా కనిపిస్తోంది. స్టేషన్ వైపు వచ్చేవారు ఎవరూ కనపడ్డంలేదు.

న్యూ కెనడానుంచి వచ్చిన రైలు చక్రాలు పట్టాలమీద కీచుమని రాసుకుంటూ పెద్ద కుదుపుతో ఆగాయి. రైలునించి ఇద్దరు దిగారు. దిగీదిగగానే మొహేల్ వీధి పంపుదగ్గరకి బయల్దేరారు. ఆ వీధంతా తమ సొత్తే అన్నట్టు వీధికడ్డంగా నడవడం, కనుచూపు మేరకున్న జనాలందరూ మావాళ్ళే అన్నట్టు ప్రవర్తించడం చూస్తే వాళ్ళెవరన్న సందేహం రానేరాదు. కూరగాయలు, పళ్ళు, రొట్టె ముక్కలు, మాంసం ముక్కలు అమ్మేముసలమ్మలు ఉండే చోటుకిరాగానే వీధుల్లోఇంకెవరికీ దారుల్లేకుండా మూసేసి తిండిపోతుల్లాగా ఏది చేతికి దొరికితే అది చిత్తం వచ్చినట్టు తీసుకునితింటూ మావేపు రావడం మొదలు పెట్టారు. ఇందు విషయమైకూడా మనం ఏదీ చెయ్యలేం. ఎందుకంటే తండ్రుల్లేని మనవళ్ళకి కనీసం కడుపుకింత పెట్టడం కోసమైనావ్యాపారం చేసుకునేందుకు అనుమతిలేని నిర్భాగ్యపు చిల్లర వ్యాపారులు వీళ్ళు.

'ఓహో! వాళ్ళొచ్చేస్తున్నారు. ఇక్కడినించెళ్ళిపోదాం పద' మని నా పక్కనున్న మండ్లా ఒకటే తొందర పెడుతున్నాడు. మండ్లా అన్నది నిజమే. ఓ పాత ఇంగ్లీషు చిత్రంలో సంఘటనల్ని వాళ్ళు గుర్తుకు తెస్తున్నారు. కాని నేను ఉన్నచోటు నించి కదల్లేదు. దానికి కారణం ఆ పోలీసులు విలన్లగుంపులాగా రోడ్డుకడ్డంపడి వస్తూండడమే. గార్డు డ్యూటీలో వున్న రైల్వేకానిస్టేబుల్ తన ప్రాంతంలో ఎవర్ని పీడించినా ఊరుకోడు- ఆ విషయం నాకు తెలుసు. అంచేత గార్డు వీళ్ళని స్టేషన్ నుంచి తరిమేసే ఘట్టం చూసి ఆనందిద్దామనుకుంటున్నా న్నేను.

"ఏం ఫరవాలేదు భయపడకు. ఆ గార్డ్ స్టేషన్ నుంచి వీళ్ళని ఎలా తరుముతాడో చూడిప్పుడు" అన్నాను. ఆ నలుగురూ మా కిందకొచ్చేసరికి ఇద్దరిద్దరుగా విడిపోయారు. ఆ ఇద్దరిలో ఒకడు పొడుగ్గా, మొహంనిండా ఏదో క్రీం రాసుకుని పొట్టి జుబ్బా వేసుకుని మోటుగా ఉన్నాడు. ఇంకో అతను మధ్యవయస్కుడు. పూటుగా తాగిన మొహం. తల ముందుభాగమంతా బట్టతల అయిపోయింది. పసుపు గోల్ఫ

టోపి పెట్టుకున్నాడు. వాళ్ళిద్దరూ ముసలమ్మల దగ్గరినుంచి లాక్కున్న ఉడికించిన గొర్రెకాలు చీకుతూ ఎడంచేతి వేపునించి బ్రిడ్జి ఎక్కుతున్నారు. ఇద్దరిలో తక్కువ వయసున్నవాడు మరికాస్త ముందుగా మెల్లెక్కుతున్నాడు. రెండోవాడుకూడా పూర్తిగా మెట్లెక్కి పైకొచ్చేసరికి రైల్లోంచి మొదట దిగిన వాళ్ళంతా బ్రిడ్జి సగంలో ఉన్నారు సరిగ్గా.

ఈ పొగమంచులో కూడా పోలీసు కుక్కల వాసన పసిగట్టారో, లేక చూసీ చూడగానే దూరంనుంచే గుర్తించారో లేక శుక్రవారం కాబట్టి ఇలాంటిదేదయినా జరుగుతుందని ముందుగానే ఊహించి జాగ్రత్తగా ఉన్నారో తెలీదుగాని ముందుగా నడుస్తున్న ముగ్గురు నలుగురు వీళ్ళజాడ తగిలి గిరుక్కున వెనక్కి తిరిగి మళ్ళీ వెనకనున్న మనుషుల్లో కలిసిపోయారు. చూసుకోకుండా ఇంకా ముందుకొచ్చిన వాళ్ళు దొరికిపోయారు. తప్పించుకుందామని అటూఇటూ ప్రయత్నించినా ఫలితంలేక పోయింది. ఒక్క క్షణం— అంతే. స్టేషన్లో కలకలం మొదలై గందరగోళంగా మారింది. అక్కడేదో పులి తిరుగుతున్నంతగా కంగారు కంగారుగా అటూఇటూ పరిగెట్టడం మొదలుబెట్టారు. అలా పరిగెట్టబోయిన ఇద్దర్ని పోలీసులు చొక్కాలు పట్టుకుని ఆపేశారు. పాసులు చూపించమని గద్దించడం మొదలుబెట్టారు. వాళ్ళు ఒకపక్క పాసులు చూపిస్తూంటే ఇంకో వైపునించి ఏవో మారణాయుధాలు, చట్టవిరుద్ధమైన వస్తువులు వాళ్ళ జేబుల్లోనే ఉంటాయన్నట్లు ఒళ్ళంతా తడిమి తడిమి ఒదిలిపెడుతున్నారు. అయితే ఈలోపు స్టేషన్‌గార్డు అక్కడికి చేరుకున్నాడు. అప్పుడు మాత్రం వాళ్ళ పాస్ పుస్తకాలు తిరగేస్తూ సరిగా ఉన్నాయో లేదో చూడ్డం మొదలుబెట్టారు.

"ఏయ్.... ఏంచేస్తున్నారు. ఈ వెధవ పన్లన్ని ఇక్కడ చేయకూడదని తెలీదూ? వెధవల్లారా వెళ్ళండి.... వెళ్ళి అవన్నీ స్టేషన్‌కి బయట చూసుకోండి" అని గొంతు నరాలు తెగిపోయేలాగా కేకలు పెట్టి తిట్టడం మొదలు బెట్టాడు గార్డు.

'వాళ్ళని ఓసారి అరెస్టుచేసి జైళ్ళు ఎలావుంటాయో చూపించండి' అని కేకేశాడు మండ్లా. 'ఊరుకో' అని మండ్లానుమందలించింది, 'వాళ్లన్నది ఇంకోళ్ళని పంపడానికే తప్ప వాళ్ళెన్నటికీ జైలుకెళ్ళరు. కావలిస్తే పందెం' అన్నాను. ఇంతలో మరి కొంతమంది పోగయ్యారు. గార్డు తిట్లు లంకించుకోడంలో ఆ ఇద్దరూ తోకలు ముడిచి స్టేషను బయటున్న తమ జాతివాళ్ళ దగ్గరకి చేరుకున్నారు. రైలు దిగిన వాళ్ళలో కొంతమంది ఈ 'శాంతి' అధికారులకి భయపడి వాళ్ళు వెళ్ళిపోయేదాకా తలదాచు

కోడానికి స్టేషన్లో కొచ్చారు. దాంతో మేము ఎక్కడ వున్నవాళ్ళం అక్కడే ఆగిపోయి జరుగుతున్న తతంగాన్ని చూస్తున్నాం. పోలీసులు కొంతమంది పాసులు చదవడం మొదలుపెట్టారు. అసలు వీళ్ళకి పాసులు చదవడం తెల్సా అని నా అనుమానం. ఒకవేళ వీళ్ళకి తెలిసినా తమ పాసులు సరిగ్గా ఉన్నాయోలేవో ఆ బాధితులకి తెలుసోలేదో, ఈ అవాస్యుల్లో చాలామంది ఈ ఘరానాదొంగలు ఏది చెబితే అదే నమ్ముతారు. అధికారులు కొంతసేపు అటూఇటూ చూసి మందిలోవున్న పిరికివారిని, బలహీనుల్ని, అమాయకుల్ని ఎంచి పాసులడుగుతున్నారు. వాటిని ఊరికే అటూ ఇటూ తిప్పిచూసి తమ జేబులో పడేసుకుంటున్నారు. ఆ పాసులు లేకుండా వాళ్ళు ఎక్కడికీ కదల్లేరు కాబట్టి అక్కడే దిక్కుతోచక నిలబడ్డారు. మిగతావాళ్ళ పని చూసేదాకా హాస్టల్ వాళ్ళందర్నీ ఓ పక్కగా వరుసలో నిలుచోమన్నారు. కొంత మంది తెల్లమొహాలు వేసుకు చూస్తున్నారు. డబ్బులున్నవాళ్ళు అధికారుల చేతులు తడిపి పాసులు తీసుకుని పారిపోతున్నారు మిగిలినవాళ్ల 'హాస్టల్‌లో ఫలానా రూం కెళ్ళి, ఫలానావాళ్లు, ఫలానాలాగ స్టేషన్‌దగ్గర అరెస్టయ్యారు వాళ్ళని తొందరగా విడిపించడానికి డబ్బులు తీసుకుని వెంటనే రమ్మంటున్నారు అని మా వాళ్ళకి కొంచెం చెప్పండి బాబు' అని వేడుకుంటున్నారు వెళ్ళిపోతున్న వారిని. అధికారుల్లో మిగిలిన ఇద్దరూ అదేరోడ్‌కి వందగజాల దూరంలో ఇంకో చివర్న అదేపని చేస్తున్నారు. ఇక్కడివాళ్ళ చేతులనించి తప్పించుకుని పరిగెడుతున్నవాళ్ళ అదృష్టం బాగాలేకపోతే వాళ్ళు మళ్ళీ అక్కడ చిక్కుకుంటారు. అయితే మాత్రమేమిలెండి. ఏమీ ఫరవా లేదు. బకాయి ఇక్కడ తీరకపోతే పోలీసు స్టేషన్లో బంటూ కమీషనర్ల ముందు నిలబెడతారు. ఆ తరువాత వాళ్ళని మడ్డర్‌బీ జైలుకి పంపిస్తారు. చట్టాన్ని ఉల్లంఘించినందుకు శిక్షాకాలం పూర్తయ్యేదాకా వాళ్ళు అక్కడుంటారు. రైతులకి కావల్సిన కూలీలని చాలా తక్కువ కూలికి సరఫరా చేస్తూంటుంది మాడ్డర్‌బీ జైలు. సోమరిపోతుతనంగా ఉండడం అనే వీరి నేరానికి అతికొద్దిరోజుల నించి రెండు సంవత్సరాల వరకూ ఎంతైనా శిక్షపడుతుంది. దీనికికూడా మనం ఏంచేయలేం. ఎందుకంటే దేశంనిండా నిరుద్యోగం పేరుకుపోయివుంది గనక.

ఇదిలా ఉండగా మావూరి నేరస్థుల వ్యాను 'క్వేలాక్వేలా' వేగంగావచ్చి వీధి కడ్డంగా ఆగింది. దాంతో జనాలందరూ చెల్లాచెదురై స్టేషను ముళ్ళకంచెకి అవతల వైపుకి వెళ్ళిపోయారు. అది వెళ్ళిపోయిన తరువాత మళ్ళీ వద్దామని. జనాలకి కని

పించకుండా ఉండేందుకు ఆ వ్యాను స్టేషన్‌కి రెండోపక్కనుండే వీధిలోకి మెల్లగా వెళ్ళి ఆగింది. దాంట్లోంచి తలుపు తీసుకుని మరికొంతమంది పోలీసులు దిగి, చాలా ఉత్సాహంగా తమవంతు పనిలోకి దిగిపోయారు. ఇంతవరకూ స్టేషను బయట వరసగా నిలబెట్టి ఉంచిన వాళ్ళనందర్నీ ఇక్కడా, అక్కడా అని లేకుండా కాళ్ళా చేతులా తన్నుకుంటూ వ్యానులోకి ఎక్కించడం మొదలుబెట్టారు వాళ్ళు. ఒకటే పెనుగులాడుతున్నారక్కడ. అయినా తప్పదు. వ్యానుకున్న ఆ చిన్నపాటి తలుపు లోంచే అందరూ లోపలికెళ్ళాలి. అందర్నీ పూర్తిగా ఎక్కించాక వ్యాను డ్రైవర్ వచ్చి తలుపులుమూసి దానికి తాళం వేశాడు ఈ పోలీసుల గుంపు మొత్తానికి యూని ఫారం వేసుకున్నది ఇతనొక్కడే. తాళం తగిలించి ఆ పక్కనేఉన్న దుకాణం దగ్గర కెళ్ళి బేరిపళ్ళు తీసుకుని దర్జాగా నోట్లోవేసుకుని నమలడం మొదలెట్టాడు. జనాల్ని తనికీచేసేపని అతను పెట్టుకో దల్చుకోలేదు. ఎలాగా మిగతావాళ్ళు గుంజుకున్న దాంట్లో ఇతనికి పెద్దవాటానే ఇస్తారు. అంతేకాక బీరు బ్రాందీకూడా దొరుకుతుంది. అంచేత అతనికి చేసేందుకేమీ పనిలేదిక్కడ. రివాల్వర్ 'కౌబాయ్' తరహాలో పెట్టు కోడం అతనికి ఇష్టంకాబోలు బహుశా. అలా పెట్టుకున్న తుపాకీ తోలుపట్టీ బెల్టుని కూడా ఓ పక్కకి లాగేయడంతో దాన్ని మరోసారి బానబొజ్జమీదకి లాక్కుని సరి చేసుకున్నాడు.

ఇంతలో ఒక 17 ఏళ్ళ యువకుడు జేబులో చిన్న కత్తితోసహా దొరికేడు. అది అత్యంత ప్రమాదకరమైన ఆయుధం కదామరి— ముఖంమీద పిడిగుద్దులు గుద్ది చేతులకి బేడీలేసి స్టేషను కాంక్రీట్ గోడకేసితిప్పి నిలబెట్టేరు. ఓ పది నిముషాల అనంతరం ఖైదీల వరసలోవున్న తన తమ్ముడ్ని చూసి అతని అక్క రైలుదిగి వచ్చింది. ఎందుకు తమ్ముడ్ని బంధించారో కనుక్కుని, కత్తి జేబులోపెట్టుకు తిరుగు తున్నందుకు చీవాట్లు పెట్టడం ప్రారంభించింది. ఈలోపు ఆ గుంపు మొత్తానికి యువకుడైన పోలీసువచ్చి ఆమె పక్కనే నిల్చుని చూపుల్తోనే జుర్రేయడం మొద లెట్టాడు. ఆమె అందుకు ఏ మాత్రం అభ్యంతరం చెప్పలేదు. ఓ మూడునాలుగు నిముషాలనంతరం తమ్ముడ్ని వదిలిపెట్టేశారు. అందరిలోకి తనకి మాత్రమే అంద మైన అమ్మాయి దక్కినందుకు ఆనందపడుతూ కుర్రాడి మొహం మీద మరోసారి శక్తికొద్ది ఎడాపెడా వాయించి వదిలేశాడు. ఒక్కోసారి మగవాళ్ళని రక్షించడం కోసం మా ఆడాళ్ళని కూడా మాతోబాటు బలవంతంగా ప్రయాణం చేయిస్తూంటాం.

ఒక్కోసారి ఏంటి, చాలాసార్లే - అంతకన్నా ఏం చెయ్యగలం? ఈ విషయంలో కూడా ఏం చెయ్యలేం.

ఇదిలా సాగుతూండగా మొహెల్ వీధిలోకి ఒకతను రావడం కనిపించింది. వీధిలో నిలుచున్న వారి పంక్తి మధ్యమధ్యలో అనుమానంగా చూస్తున్నాడు. కుడి భుజంమీద నార తాడుతో కట్టిన పెద్దపెట్టె ఉంది. ఎడంచేతితో పెద్ద అట్టపెట్టె ఒకటి పట్టుకున్నాడు. భూమికి దాదాపు తగుల్తూన్నట్టున్న ఆ పెట్టె బరువుకి అతను ఒక వేపు వంగి నడుస్తున్నాడు. చాలా దూరం నించి వస్తున్న వాడిలా గబగబా నడుస్తున్నాడు. చాలా రోజుల తరువాత పట్టణం నుంచి ఇంటికొస్తున్నాడనడంలో ఎటువంటి సందేహం అక్కరలేదు- బహుశా ఇంటి మొహం చూసి కొన్నేళ్ళు అయ్యుండొచ్చు. మూలన దాక్కున్న వ్యాన్‌ని అతను చూడలేదు. చూసివుంటే స్టేషన్ దగ్గర పొంచి వున్న ప్రమాదం స్ఫురించి ఉండేది. హఠాత్తుగా ఇద్దరు అధికారులు అతని దారికి అడ్డొచ్చి బరువులన్నీ కిందపెట్టమన్నారు. అతనికి ఇది శుక్రవారమని, రెయిడింగ్ జరిగే రోజనీ ఇప్పుడు జ్ఞాపకం వచ్చి ఉంటుంది. ఒక్కసారి అతని మొహం పాలిపోయింది. తనెంత ప్రమాదకరమయిన పరిస్థితుల్లో ఇరుక్కున్నాడో అతనికి అర్థం అయినట్టుంది మొహంలో గాభరా స్పష్టంగా కనిపిస్తోంది. వెంటనే ఒక్కసారి జేబులు తడుముకున్నాడు. అంతే - దేనికోసం వెతుకుతున్నాడో దాని జాడలేక పోవడంతో మొహం నల్లగా మారి కళావిహీనం అయింది. ఇంకోసారి తడుముకున్నాడు. కాని కనిపించలేదు. అతన్ని ఆపిన మనుషులు చెరోపక్కా బలంగా పట్టుకుని ఓ పక్కకి తోసేరు. ఎదురు తిరగకుండా సాధుజంతువులా వాళ్ళు ఎలా చెబితే అలా వినడం మొదలు పెట్టాడు. చేతులు పైకెత్తమని మొత్తం మనిషినంతా తడిమి తడిమి వెదికేశారు. వంటిమీద దాచుకుంది ఏమీ లేదని తేలిపోయింది. అతని వద్ద పాస్ పుస్తకం లేదని తెలిసీ కూడా 'ఆ పుస్తకం తీయ్' అని గద్దించారు. ఇప్పుడది తన దగ్గర లేదని ఇంట్లో మర్చిపోయానని వివరంగా వినయంగా చేతులూపుతూ వివరించడం మొదలు పెట్టాడతను. వాళ్ళకి నేను దగ్గరగా ఉండడం మూలాన అతను ఏం చెబుతున్నాడో నాకు వినిపిస్తోంది.

'నిజమేబాబూ నేను తప్పుచేశాను' చేతులు నులుపుకుంటూ చెబుతున్నాడు. 'నేను పాస్ తీసి ట్రంక్‌లో పెడదామనుకున్నాను. అది చొక్కా జేబులో ఉండిపోయింది. పెట్టె సర్దుకునేప్పుడు చూసుకోడం మర్చిపోయానయ్యా'

'నువ్వు అబద్ధం చెప్పడం లేదని మా కేంటి రుజువు' కయ్యానికి కాలుదువ్వుతూన్నట్లు అడిగాడు ఓ పోలీసు.

'నేను అబద్ధమాడ్డం లేదండి, కన్నతల్లి మీద ఒట్టు, నిజంగానే మర్చిపోయానండి' ఇంతలో రెండోవాడు మరికొంచెం కరుగ్గా 'అదీ నీ బుద్ధి తక్కువతనం. ఆ పుస్తకం లేని మూలాన నువ్విప్పుడు జైలుకెళ్ళబోతున్నావు. అంతే' అన్నాడు.

'అన్నా, అన్నా మీ కాళ్ళకి దండం పెడతానయ్యా - ఇంటికెళ్ళి నా వాళ్ళని చూసి రెండేళ్ళయిందన్నా. నేనిక్కడున్నప్పుడు పుట్టిన కవల కూతుళ్ళని ఇన్నాళ్ళకి చూసుకునే మొదటి అవకాశం వచ్చిందన్నా ఈ నల్లవాడిమీద కనికరం చూపించి ఈ ఒక్కసారికి క్షమించి వదిలేయండన్నా' అని కాళ్ళా వేళ్ళా పడ్డం మొదలుబెట్టాడు.

'ఏంటయ్యా క్షమించేది....ఆ(....పెళ్ళాం పిల్లల గురించి మా దగ్గర చెప్పొద్దు. మాకు లేవనుకుంటున్నావా సంసారాలు, మేం ఇన్ని కష్టాలు పడుతోంది కూడా వాళ్ళగురించే, అంటూ ఫెడీల్మని జవాబు చెప్పాడో పోలీసు.

'కాని అయ్యా, బాబూ ఈ ఒక్క తప్పు క్షమించయ్యా. తప్పులెవరికైనా జరుగుతాయికదా. మీకూ ఎప్పుడైనా పొరపాటు జరిగుంటుంది కదా బాబూ....'

సరిగ్గా అదే,.... అదే ప్రశ్న ఆ మనిషి అడక్కుండా ఉండాల్సింది. కాని ప్రశ్నకి సమాధానంగా అప్పుడే మొహంమీద 'ఫట్'మని దెబ్బపడింది. 'ఏంటను కుంటున్నావురా? నీలాంటి దౌర్భాగ్యపు వెధవనా నేను? ఏయ్.... వీడ్ని కట్టేయండి! మరిబుకో, ఈ కుక్కకి బేడీలెయ్' అని అరుపులు లంకించుకున్నాడా పోలీసు. 'ఉండవయ్యా బాబూ....ఊరుకో. వీడ్ని వదిలేస్తే ప్రతిఫలం ఏమన్నా వుంటుందేమో చూస్తానుండు, అని సలహా చెప్పి అరెస్టయిన హాస్టల్ వాళ్ళకి దూరంగా అతన్ని తీసుకెళ్ళాడు రెండో పోలీసు మరిబుకో.

'ఊ(.... వెళ్ళు....ఆ వెధవతో నువ్వే మాట్లాడు. వీడిలాంటి పల్లెటూరి వెధవల్తో మాట్లాడాలంటేనే నాకు అసహ్యం. జోహాన్స్ బర్గ్‌కి ఆడుకోడానికి వెళ్ళేననుకుంటున్నాడు కాబోలు, ఒట్టి చేతుల్తోనే చంపీగల్ను నాకొడుకుని' కోపంతగ్గని పోలీసు ఇంకా ఎగిరెగిరి పడుతున్నాడు. అలా అరవడంవ్వాలా తనకి దొరికిపోయిన వాడికి, చూస్తున్న వాళ్ళకి కూడా అతను భయం పుట్టిస్తున్నాడు. దగ్గర్లోంచి వెళుతున్న ఇంకో ఇద్దరు కుర్రాళ్ళని చెయ్యెత్తి హెచ్చరించేడు కాని వాళ్ళదగ్గర పాసులు అడగలేదు.

నల్ల మనిషిని పక్కకి తీసుకెళ్ళిన పోలీసు 'చూడవయ్యా- నువ్వు నిజంగా ఇప్పుడు చిక్కుల్లో ఇరుక్కున్నావు. ఏదైనా సాయంచేస్తే అది నేనొక్కడినే చేయగల్ను. నీ దురదృష్టం కొద్దీ ఇవాళ నిన్ను పట్టుకున్నాయన మనసు బాగాలేదు. అంచేతా అదీ సంగతి. ఇంతకీ నీ దగ్గర ఎంతుంది. చెప్పుమరి. ఏదైనా కొంత ముట్టజెప్తే అతనూరుకుంటాడేమో చూద్దాం. డబ్బు ఎన్ని మాయలు చేస్తుందో తెలుసుగదా చూద్దాం తీయ్' అని మృదువైన గొంతుతో తానసలు ఈ ఉద్యోగంలో చేరిందే 'ఆ' ఆదాయం కోసం అన్నట్లు బుజ్జగించడం మొదలుపెట్టాడు.

'నా దగ్గర ఒక్క సెంటుకూడా లేదు. ఇంట్లో వాళ్ళకి సరుకులు, పిల్లలకి వస్తువులు కొన్నాను. మిగిలిన డబ్బంతా టిక్కట్టుకి సరిపోయింది. ఇంటికెళ్ళిన తరువాత కాని డబ్బురాదు. దానికి సంబంధించిన కాయితాలివిగో చూడండి - నా దగ్గర ఒక్క టిక్కెట్టు, కాయితాలు తప్ప ఇంకేంలేవు'. జేబుల్లో ఉన్నవన్నీ చూపించాడు. వెనక్కి తిరిగి మురికోడుతున్న పాంటు జేబుల్తో సహా అన్ని జేబుల్ని బయటికి తిరగేశాడు. 'నిజంగా చెబుతున్నానండి. ఇవితప్ప నా దగ్గర ఇంకేం లేవు' అన్నాడు.

'చూడూ - నువ్వు సజావుగా ఇంటికెళ్ళి భార్యా పిల్లల్ని చూడాలనుకుంటున్నావు కదూ?'

'అవునయ్యా- ధర్మప్రభువులు ఈ సారి మీరే నాకు ఆ అవకాశం కల్పించాలి!'

'మరీ....నాకెందుకు ఈ చెత్తకాయితాలన్నీ చూపిస్తావు. అవి మీ భార్యా పిల్లలకి తిండి పెడతాయి తప్ప నాకేమీ ఒరగబెట్టవు. నువ్వు ఇంటికెళ్ళగానే నీ డబ్బులు నీ చేతి కొస్తాయి. నీ భార్యాపిల్లలు సుష్టుగా భోంచేసి నిద్రపోతారు సుఖంగా కాని నిన్ను వెళ్ళనిచ్చినందుకు ఇవతల నా ఉద్యోగం పోతుంది. నా భార్యా పిల్లలు పెంటకుప్పల పక్కన అడుక్కోవడానికి నిలుచోవాలింక' అని తిడుతూ 'ఏయ్ బలాయి - వీడి దగ్గర పైసాకూడా లేదుట. కాని రెండేళ్ళ తరవాత సంసారాన్ని చూడ్డానికెళ్తున్నాట్ట. ఏంచేదాం' అని ప్రశ్నించాడు పోలీసు.

'నేనింవాకటే చెప్పాను. చావగొట్టి చెవులుమూసి బేడీలేయమని. విన్నావా? ఎక్కడా డబ్బుల్లేవంటే లోపల నిక్కరు జేబుల్లో దాచుంటాడు. బహుశా అందరి ముందూ తీయడానికి సిగ్గుపడుతున్నట్టున్నాడు. పోలీసు స్టేషనికి తీసుకెళ్ళి చితక్కొడితే అవే బయటపడతాయి' అన్నాడు బలాయి.

'రావయ్యా—రా ఏదీ చేతులు చాపు' అంటూ పక్కనేవున్న ఇంకో పోలీసు ముందుకొచ్చాడు. దాంతో గాభరాపడిన నల్లవాడు 'ఓహ్, నిజంగానే నన్ను అరెస్టు చేస్తున్నారా? బాబూ ఈ ఒక్కసారికి క్షమించండి బాబూ మిమ్మల్ని వేడుకుంటున్నాను' అంటూ గింజుకోడం మొదలెట్టాడు. దాంతో ఆ ఇద్దరిమధ్య ఓ చిన్నపాటి పెనుగులాట జరిగింది. దాంతో 'ఏయ్ నువ్వు అరెస్టవడానికి గింజుకుంటున్నావు, అది నేరం తెల్సా, అసలా నీ—' అంటూ ఆ నల్లవాడి తల్లి శీలాన్ని శంకిస్తూ బండ బూతులు తిట్టడం ప్రారంభించేడు పోలీసు.

'కాదు, కాదు-కాని దయచేసి నా మాట వినండి బాబూ' అంటూ గింజుకోడంలో ఆ పోలీసు పట్టునించి తప్పించుకుని ఊగిసలాటలో వెనక్కి పడ్డాడు. పడి లేస్తూనే అనాలోచితంగా తన వస్తువుల్ని పట్టుకోబోయాడు. పోలీసు కళ్ళు నిప్పులు కురుస్తున్నాయి. అతని గుంపులో మిగతావాళ్ళు కూడా పరిగెత్తుకువచ్చారు. వస్తూనే ఏ మాత్రం ఆత్మరక్షణకోసం ప్రయత్నించని ఆ నల్లవాడిమీద పడి ఇష్టం వచ్చినట్టు బాదడం మొదలుబెట్టారు. పోలీసులు అందరిదృష్టి అతనిమీదే ఉండగా ఆ అదనుని ఉపయోగించుకుని బ్రిడ్జిమీద ఉన్నవాళ్ళ మొహేల్ వీధుల్లో పందెపు గుర్రాల్లా పరుగెట్టడం ప్రారంభించారు. ఇద్దరు యువకులకికలిపి బేడీలు వేశారు. వాళ్ళుకూడా ఇదే అదనుకొని వీధుల్లో పరుగు లంకించుకున్నారు. వాళ్ళ ఇద్దరి చేతులకి ఒకే బేడీ వేయడంతో అడ్డదిడ్డంగా పరుగెడుతున్నారు. కాని యువకులవడంచేత ఆ పరిస్థితుల్లోకూడా అలా పరిగెత్తగలిగారు.

ఆ మనిషిని కొట్టడం ఇంకా ఆపలేదు. ఇంక మేం చూస్తూ ఊరుకోలేకపోయేం. 'ఏయ్, చూడండీ మీక్కావలిస్తే అతన్ని అరెస్టుచేయండి అంతేకాని అలా గొడ్డుని బాదినట్టు బాదకండి' అంటూ స్టేషన్‌నుంచి మేం అరిచాం.

మెల్లిమెల్లిగా కోపంతో, ఉద్రేకంతో ఉడుకుతున్న జనాలు చుట్టూ చేరడం మొదలెట్టారు. 'ఆపండీపని. లేదా మీరు ఇంక జన్మలో ఏమీ చెయ్యలేకుండా చెయ్యగలం'-గుంపులోంచి ఎవరో గట్టిగా హెచ్చరించారు మెల్లిగా ఎలాగయితేనేం వాళ్ళు కొట్టడం ఆపి వాళ్ళ చెయ్యివాడితనం చూపే అవకాశం కల్పించారు మాకు. వీధి పక్కనున్న కంచెమొదల్లో చెత్తా చెదారం పేరుకున్నచోట పడున్న ఆ వ్యక్తి బాధతో

మూలుగుతున్నాడు. అతని మొహమంతా రక్తం, దుమ్ము కలిసి భయంకరంగా తయారయింది. ముఖంలో ముక్కుమూతి నీకమయిపోయి పోలిక పట్టలేకుండా తయారయింది. ఇంతజరిగినా ఆ లావాటి పోలీసుకి తృప్తి కలగలేదు. ఆ మనిషి చేతి మణికట్టు పట్టుకుని కంచె వేపు లాగబోయాడు.

'ఏయ్ పిశాచం! అతన్ని వెళ్ళనియ్యి ఇంక. ఇప్పటికే అతన్ని చావగొట్టావు కనపడ్డం లేదూ? ఎవరిదో ప్రశ్న.

అక్కడ చేరుతున్న జనాలలో మెల్లిమెల్లిగా ఉద్రిక్తత తారస్థాయికి చేరుకుంటూంది. యూనిఫారం వేసుకున్న పోలీసు ఆ విషయాన్ని పసికట్టగలిగాడు.

'ఈసారికి క్షమించొదిలేయవోయ్. వదిలేయ్ పాపం. వెళ్ళనియ్యి అతన్ని' అన్నాడతను నాలుగు పక్కలా అదోలా చూస్తూ.

అంతవరకూ వంటి మొయ్యా దెబ్బలు తిని పడున్న ఆ వ్యక్తి హఠాత్తుగా ఎవరూ ఊహించని పనొకటి చేశాడు. మెల్లిగా దేకి తనని వదిలేయమని చెప్తున్న పోలీసు ముందు మోకరిల్లి దుమ్ములో కొట్టుకుపోయిన చేతుల్ని జోడించి ప్రార్థిస్తున్నట్లు కూచున్నాడు. ఇంకా అలా మోకాళ్ళ మీదే ఉండి 'ధన్యవాదాలు సామి. ధన్యవాదాలు. దేవుడు మిమ్మల్ని చల్లగా చూస్తాడు. ఇప్పుడు ఇంక నేను ఇంటికెళ్ళి కూతుళ్ళనీ భార్యనీ చూడొచ్చు' అన్నాడు.

తనని విడిపించినందుకు కృతజ్ఞతా సూచకంగా ఆ పోలీసువాడి ఎర్ర బూటుని ముద్దుపెట్టుకోవచ్చని అతనికి తట్టలేదు సమయానికి. లేకుంటే ఆపనికూడా చేసి ఉండేవాడు.

ఆ నిర్భాగ్యుడు మెల్లిగా లేచి బట్టలకి అంటుకున్న దుమ్ము దులుపుకున్నాడు. తన రెండుసామాన్లని తీసుకుని మెల్లిగా మెట్లెక్కడం ప్రారంభించేడు. తనపక్షాన గొంతువిప్పిన జనాలకి కృతజ్ఞతలు చెప్పడానికి ప్రయత్నించేడు. పోలీసులు ఈ రోజుని గుర్తుంచుకోవాలనుకున్నారు. మిగిలిన దురదృష్టవంతులంతా ఇంకా 'క్వేలా క్వేలా' వ్యానులో తమ వంతుకోసం నిరీక్షిస్తున్నారు.

అతను ఇంటికి చేరి తన భార్యతో ఆనందాన్ని ఎలా పంచుకుంటున్నాడో

దక్షిణాఫ్రికా కవితలు :

నిద్రలేదు - నిలకడలేదు

ఇల్యా మెకే

వాళ్ళకు నువ్వు కేవలం నంబర్ 466/64 మాత్రమే
దుమ్ము నిండిన రస్తాల్ని తుడిచేవాడివి
ఆ 'దీవి'లో భూమిని దున్నేవాడివీ, బాగుచేసేవాడివీ
కానీ, నువ్వు ఒక శక్తివి
నీ కోసం, నీ వంటి అన్ని నంబర్లకోసం పోరాడుతున్న
మీ పిల్లల రక్తనాళాల్లో ప్రవహించే సంకల్పానివి
అవును, మండేలా నీ చేతుల్లో పారని బిగించు
ఆఫ్రికా కోసం శ్రమిస్తోన్న చెమటోడుస్తున్న
అన్నలలాగే అక్కలలాగే
కొడుకుల లాగే కూతుళ్ళలాగే
నేలను దున్ను బాగుచెయ్యి
ఆఫ్రికా మనది. ఆతల్లి ఒడి చేరే వరకూ
మరచిపోదాం మనం విశ్రాంతిని

(అను : భరద్వాజ)

ఊహించడానికి ప్రయత్నించాను. ఇద్దరు కూతుళ్ళని పదేపదే గాల్లోకి ఎగరేసి పట్టుకుంటూ వాళ్ళతో అతను ఆడుకుంటున్నట్లు అనిపించింది.

'మిత్రుడా, ఇంకా చేయాల్సింది చాలా ఉంది' నా చెవిదగ్గర మండ్లా చెప్పింది వినిపిస్తోంది.

'ఎప్పట్లోగా చెయ్యాలి ?' అని ప్రశ్నించాను 'నరకానికి చేరేలోగా. హ.... హ....హ ! బహుశా అక్కడ మనం మనుషులుగా ఉంటామేమో'

'హ...., మనం చాలా కాలంగా నరకంలో ఉన్నాం
మనం చాలా కాలంగా నరకంలో ఉన్నాం'
'అయితే నరకంనుండి బయట పడేలోపు చేయాలి'

(అను : సురేష్)

మీ గౌరవార్థం

ఫోసెగొ మొట్సొ డొంబొ

న్యాయమైన ఈ బంగారు నేలలో
సాహసి ఊపిరి శ్వాసిస్తోన్న చోట
కాంతి పుష్పించనీ - స్ఫూర్తి జ్వలించనీ
స్వేదం ఇంకిన నేలమీద
బలిష్టులైన ఆ యువతీ యువకుల హృదయాలలో
విప్లవ నవనవోన్మేష స్ఫూర్తి జ్వలించనీ
బానిసల సంకెళ్ళు బిగిసే పాడు కాలాన్ని
లయం చేసే వారి పట్టిన వీర పుత్రులకన్న
ఓతల్లులారా మీరు ధన్య చరితలు
రేపటి భవనానికి పునాదులు నిర్మిస్తోన్న,
ప్రపంచపటంపై 'మార్పు'ని లిఖిస్తోన్న,
రగులుతున్న నిప్పురవ్వల్ని సృష్టించిన
ద్యూమానోకె, అంకుల్ జె.బి, మండేలా, సిసులా, ష్లాంగినీ
మిమ్మల్ని నా గీతాలతో అలంకరిస్తాను-గౌరవిస్తాను
గోల్డ్‌బర్గ్, బ్రాంఫిషర్, కథ్రాడాలు-
త్యాగం రూపు గట్టిన మహా మానవులు
అజేయ సైనికులు వాళ్ళు - వాళ్ళ ముందు వినమ్రుడనౌతాను
నేల కొరిగిన పీటర్‌సన్ దేహం,
సాహసస్ఫూర్తి మనుగడలోకి లేచి నిలుస్తూనే ఉంటుంది
ఓహ్ ! ఉక్కు సంకల్పమా -
సైనికుల్లో స్ఫూర్తినీ, దీక్షనీ నింపు
ఓ ఆఫ్రికన్ సంకల్పమా ఇదే ఆహ్వానం
తీసుకురా మా జీవితకాలం లోనే స్వాతంత్ర్యాన్ని
తీసుకురా మా జీవితాలకు పోరాట స్వేచ్ఛని

(అను : భరద్వాజ)

విచ్ఛిన్నమవుతున్న వ్యక్తిత్వం

మాగ్జిం గోర్కీ

[సృజనాత్మకతకు మూలం ఏమిటి? వ్యక్తికీ, సమూహానికీ మధ్య ఐక్యతను, ఘర్షణను ఎట్లా అర్థం చేసుకోవాలి? సమూహం నుంచి విడివడిన వ్యక్తి, సమూహం కన్న తాను భిన్నమనీ, అతీతమనీ తలపోస్తూ సమూహాన్ని శత్రువుగా భావించిన క్షణంలో వ్యక్తిత్వం ఎట్లా విచ్ఛిన్నమై పోయింది? వ్యక్తి విచ్ఛిన్నమయి పోవడాన్ని సామాజికంగా, తాత్వికంగా ఎట్లా వివరించవచ్చు? ఇటువంటి ప్రశ్నలకు జవాబు చెప్పడానికి మాగ్జిమ్‌గోర్కీ ఎనిమిది దశాబ్దాల కింద ఈ వ్యాసంలో ప్రయత్నించాడు. తెలుగు పాఠకులకు కష్టంగా ఉండగల ప్రస్తావనలను మినహాయించి ప్రధాన భాగానికి స్వేచ్ఛానువాదాన్ని ఇక్కడ ప్రచురిస్తున్నాం.]

ప్రజలు కేవలం భౌతిక విలువలన్నింటినీ సృష్టించిన శక్తి మాత్రమే కాదు. మానసిక విలువలకి కూడా వాళ్ళే నట్టిపోని ఒకేఒక్క వనరు. ఉనికిలో వున్న అన్ని మహాకావ్యాలకు, ప్రపంచంలోని అన్ని విషాదాలకు తాత్వికులు, కవులు, సృష్టి కర్తలు సామూహికంగా ప్రజలే. ప్రపంచంలోని విషాదాలన్నింటిలోకి పెద్దది ప్రపంచ సంస్కృతీ చరిత్ర.

శైశవదశలో ప్రజలు ప్రకృతిని చూసి భయపడ్డా సంభ్రమం చెందారు. ఆరాధన కనపరిచారు. ప్రకృతికి వ్యతిరేక పోరాటంలో ఆత్మ పరిరక్షణ ప్రవృత్తుల ప్రేరణతో ఉట్టి చేతులతో నిలబడి మతాన్ని సృష్టించుకున్నారు. అదేవాళ్ళ కవిత్వం. ప్రకృతి శక్తుల గురించిన వాళ్ళ సమస్త జ్ఞానమూ అదే. చుట్టూవున్న ప్రతిపక్షశక్తులతో ఘర్షణలో వాళ్ళు పోగేసుకున్న అనుభవ సంపదంతా అదే. ప్రకృతిమీద తాము సాధించిన తొలి విజయాలు ప్రజలకు స్థిరత్వ స్పృహను, ఆత్మగౌరవాన్ని మరిన్ని విజయాలు సాధించాలనే ఆకాంక్షను కలిగించాయి. వీరోచిత మహాకావ్యాలను సృష్టించేందుకు వాళ్ళను పురికొల్పాయి. ఈ వీరోచిత మహాకావ్యాలు ప్రజల స్వస్వరూప జ్ఞానం సమస్తానికి ఖజానాలయ్యాయి. తమను తాము కోరుకున్న కోర్కెలన్నింటికీ నిలువలయ్యాయి. తరువాత పురాణమూ మహాకావ్యమూ కలగలిసి పోయాయి. ఎందుకంటే ఏ వీరగాథా కావ్యంలోనయినా ప్రజలు తమ సామూహిక మన స్తత్వపు శక్తిని

నాయకునికి ఆపాదించారు. ఆ నాయకుడు దేవతలను యుద్ధానికి పిలువగల వాడుగా వాళ్ళు భావించారు లేదా ఆ నాయకుణ్ణి దేవతలలో ఒకణ్ణి చేశారు.

పురాణంలోను, మహాకావ్యంలోను ఆవిష్కరణ పొందినది ఒకానొక ప్రత్యేక వ్యక్తి వైయక్తిక ఆలోచనలు కావు. ఒక ప్రజానీకపు సామూహిక సృజనాత్మకత. ఆ యుగపు ప్రధాన చోదక శక్తి అయిన భాష విషయంలోనూ అంతే.

భాష రూపొందడమూ, అభివృద్ధి చెందడమూ కూడా ఒక సామూహిక చర్య అనే విషయం భాషా శాస్త్రం వైపునుంచి, సంస్కృతి చరిత్ర వైపునుంచి కూడా నిర్ద్వంద్వంగా నిర్ధారణ అయింది. పురాణంలోను, మహాకావ్యంలోను సాటిలేని అద్భుత సౌందర్యం పుండడానికి కారణం బ్రహ్మాండమైన సామూహిక శక్తే. ఆ సౌందర్యం భావానికి, రూపానికి మధ్య సమర్థమైన సమన్వయం వల్ల రూపొందింది. ఆ సమన్వయం సామూహిక మన స్తత్వపు సంపూర్ణత్వం వల్ల సిద్ధించింది. బాహ్య రూపం అనేది ఒక మహాకావ్యపు ఆలోచనలో భాగంగా మారేందుకు సామూహిక మన స్తత్వపు ఆలోచనాధార తోడ్పడింది. తద్వారా మాట ఎల్లప్పుడూ ఒక సంకేతం గానే ఉండగలిగింది. మరోమాటల్లో చెప్పాలంటే ప్రజలు ఏ ఏ సజీవ దృశ్యాలలో, భావనల్లో తమ ఆలోచనలని సాక్షాత్కరింపజేసుకున్నారో ఆ దృశ్యాల, భావాల వరుసలు మాటల సాయంతోనే ప్రజల ఊహాకందాయి. గాలికీ పక్షి రెక్కలకీ పోలిక చెప్పారంటే ఆదిమ మానవుల మనసులో దిగిన ముద్రలమధ్య సంబంధానికి చిహ్నామది. గాలికి అదృశ్య చలనముంది. పక్షి ఎగురుతున్నప్పుడు కనబడే వేగంలో దాన్ని సాక్షాత్కరింపజేసుకున్నారన్న మాట. ఇంకో అడుగు ముందుకు వేస్తే బాణాలు పక్షులలాగ ఎగురుతాయి అనే మాటా వచ్చింది....

శతాబ్దాలపాటు సాగిన వైయక్తిక సృజనాత్మకతా క్రమంలో కూడా ఇలియడ్‌తో, కలెవలతో సమానమైన సృష్టి జరగలేదు. సామూహిక సృజనాత్మకత ఎంత శక్తివంతమైనదో ఈ వాస్తవమే తెలుపుతుంది. అంతేకాదు జానపద సృజనాత్మకతలో మూలాలు లేని ఒక్క ప్రతీకను కూడా వైయక్తిక మేధ సృష్టించలేదు. గతంలో జానపద గాథలలోనూ, వీరగాథలలోనూ లేని ఒక్క ప్రాపంచిక చిహ్నాన్ని కూడా వైయక్తిక మేధ సృష్టించలేదు.

ఒక నాయకుడు సృష్టించబడే పద్ధతేమిటి? సమూహానికి గల యిటువంటి సృజనాత్మక సాధనల విషయంలో కచ్చితమైన నిర్ధారణలు చేసేందుకు తగిన ఆధారాలు మనకిలేవు. కాని ఈ విషయంలో మనజ్ఞానాన్నంతా సమీకరించడం ద్వారా, ఖాళీలు పూరించడం ద్వారా ఆ క్రమానికి ఒక చిత్తు రూపు రేఖలని కనిపెట్టవచ్చను కుంటాను.

మనుగడకోసం అంతులేని పోరాటాన్ని సాగిస్తున్న కుదురును తీసుకుందాం. అదొక చిన్న జనసమూహం. చుట్టూ తెలియని ప్రకృతి శక్తులు. తరుచుగా అవి శత్రు పూరితమైనవి గూడ. ఆ జనం ఒకరితో ఒకరు సన్నిహిత సంబంధంతో జీవించే వారు. ఆ కుదురు సభ్యులలో ప్రతి ఒక్కరి అంతరంగిక జీవితం ఉమ్మడి పరీక్షకు బహిరంగంగా వుండేది. ఒకరి అనుభూతులు, ఆలోచనలు, ఊహలు అన్నీ ఉమ్మడి ఆస్తి అయిపోయేవి. తనలో రేకెత్తిన ఆలోచనలను బృదంలోని యితరులతో పంచుకుని బరువు దించుకోవాలని ప్రతి ఒక్కరు సహజాతంగా ప్రేరణ పొందేవారు. చుట్టూ వున్న అడవులు, వాటిలోని జంతువులు, సముద్రం, ఆకాశం, చీకటి వెలుగు వంటి భ్రమ గొలిపే శక్తుల ముందర తన నిస్సహాయస్థితి ఈ ఆలోచనలు పంచుకోవడానికి దారితీసేవి. ఇందుకు కలల ప్రోద్బలం, చీకటి వెలుగుల నీడలలోని వింతలు కూడా కారణం కావచ్చు. మొత్తానికి ఈ రకంగా వైయక్తిక అనుభవాలు తక్షణమే సామూహికానుభవంతో మిళితమయ్యేవి. అట్లా సమూహం సంపాదించుకున్న సమస్త అనుభవమూ సభ్యులలో ప్రతి ఒక్కరి ఆస్తి అయ్యేది.

నిజానికి వ్యక్తి అంటే ఆ బృందంలోని భౌతిక శక్తులలో ఒక భాగానికి రూపం. అదే సమయంలో బృందపు మానసిక శక్తి మొత్తం అతనే. ఒక వ్యక్తి అదృశ్యం కావచ్చు. జంతువు తినేయొచ్చు, పిడుగుపడి చనిపోవచ్చు. కూలిన చెట్టు కిందపడో బండకిందపడో నలిగిపోవచ్చు నదిలోనో, ఊబిలోనో మునిగిపోవచ్చు. ప్రతిచోటావున్న భయానక శత్రువుకు యిది ఒక చిహ్నంగా కనబడేది. బృందంలో తమ భౌతిక శక్తులలో ఒకభాగం పోయినందుకు విచారం కలిగేది. మరిన్ని నష్టాలు కలుగుతాయేమోనని భయం కలిగేది. ఇటువంటి నష్టాలకి వ్యతిరేకంగా పరిరక్షించుకోవాలని తపన కలిగేది. మృత్యుభయంనుంచి తప్పించుకునేందుకు సర్వశక్తులను కూడగట్టాలని, మృత్యువును ఎదిరించాలని ఓడించాలని సహజమైన కోర్కె కలిగేది.

తమ భౌతిక శక్తులలో ఒక భాగాన్ని పోగొట్టుకున్నపుడు సమూహంలో రేకెత్తిన ఉద్వేగాలు ఒక పుమ్మడి కోర్కెకు దారితీసాయి. అది అసంకల్పితమయిన కోర్కె. కాని అత్యవసరమయినది. అతి తీవ్రమయినది. ఆ కోర్కె మంటే నష్టాన్ని ఎల్లకాలం గుర్తుంచుకోవాలని. ఎడబాసిన వ్యక్తిని పునర్జీవింప జేసుకోవాలని. అతన్ని తమలో కాపాడుకోవాలని. వెళ్ళిపోయిన వ్యక్తి గౌరవార్థం జరిగిన ఖననపు విందులో కుదురు మొట్టమొదటి సారిగా తెలివి, వ్యక్తి అనే భావనలని ముందుకు తెచ్చింది. తనకు తాను ధైర్యం చెప్పుకుంటూ, ఒక రకమైన సవాలు విసురుతూ తమకందరికి వుండిన నైపుణ్యాన్ని, శక్తిని, తెలివిని ఆ ఒక్క వ్యక్తికి ఆపాదించారు. ఆ లక్షణాలన్నీ ఆ వ్యక్తిని, ఆ బృందాన్నికూడా స్థిరంగాను, బలంగాను నిలిపినవి. ఆ క్షణంలో ఆ కుదురులో ప్రతివ్యక్తికి తానుచేసిన సాహసం లేదా తనకొచ్చిన సంతోషకరమైన భావం, ఊహ గుర్తొచ్చి వుండవచ్చు. కాని సమూహానికి బైట "నేను" కు మనుగడ వున్నదని అతనూహించలేదు. ఆ "నేను" వస్తువును, దాని సకలశక్తిని వెళ్ళిపోయిన వ్యక్తి రూపానికి కలగలిపాడు. ఈ రకంగా కుదురుకు పైన, కుదురుకు భిన్నంగా నాయకుడు అనే భావన తలెత్తింది. అ నాయకుడు కుదురుకుగల సమస్త శక్తిని మూర్తీభవించుకున్న రూపం. ఆ సమస్తశక్తి సాధనలు ఆ శక్తి క్రియలుగారూపాంతరం చెందుతాయి. ఆ శక్తికి కుదురుకుగల మానసికశక్తికి ప్రతిఫలనం. అటువంటి క్షణాలలోనే ఒక ప్రత్యేకమైన మానసిక స్థితి తలెత్తివుంటుంది. అక్కడే మృత్యువును జీవితంగా మార్చగలిగిన సృజనాత్మక ఆకాంక్ష తలెత్తివుంటుంది. వెళ్ళిపోయిన వ్యక్తిని గుర్తుతెచ్చుకొనేందుకు సమానశక్తితో ప్రయత్నిస్తున్నపుడు వైయక్తిక ఆకాంక్షలన్నీ అ ఒక వ్యక్తి ప్రతిరూపంమీద కేంద్రీకరించబడినపుడు సమూహం బహుశా తానప్పుడే సృష్టించిన నాయకుడు తనలోనే వున్నాడని గుర్తించి వుంటుంది. ఈ దశలోనే "అతను" అనే భావన పుట్టిందనుకుంటాను. ఇంకా అప్పటికి "నేను" భావన రూపొంది వుండదు. సమూహానికి ఇంకా ఆ అవసరం రాలేదు.

కుదుళ్ళు సమైక్యమై తెగలయినపుడు కుదురునాయకులు కూడా ఐక్యమయి తెగనాయకుడి రూపం పొందారు....

ఒక నాయకుడు సృష్టించబడినపుడు అతని శక్తి, సౌందర్యం గర్వకారణాలుగా, ఆరాధనా కారణాలుగా వుండేవి. జనం అతనిని దేవతలలో ఒకనిగా చేయ

దల్చుకునేవారు. తద్వారా వారు అసంఖ్యాకమయిన ప్రకృతి శక్తులకు వ్యతిరేకంగా తమ శక్తులని కూడగట్టుకో దల్చుకునేవారు. మనిషికి దేవతలకు మధ్య ఘర్షణ ప్రొమీథియస్ అనే బ్రహ్మాండమయిన రూపాన్ని సంతరించుకుంది. ప్రొమీథియస్ మానవజాతికి చెందిన మహామేధావి. ఇక్కడ ప్రజల సృజనాత్మకత విశ్వాస చిహ్నంగా అత్యున్నత శిఖరాన్ని చేరింది. ఎందుకంటే ఈ చిహ్నంలో ప్రజలు తాము ఏ వున్నత లక్ష్యాన్ని చేరగోరుతున్నామో ప్రకటించారు. దేవతలతో తమ సమాన త్వాన్ని ప్రకటించారు.

ప్రజలు పెరిగిన కొద్దీ కుదుళ్ళమధ్య పోరాటం తలెత్తింది. మనం అనే భావ నతో చెప్పుకున్న సమూహంతోపాటే 'వాళ్ళు' అనే సమూహంకూడా కనబడడం మొదలయింది. ఈ రెండు సమూహాలమధ్య పోరాటం లోంచి 'నేను' అనే భావన తలెత్తింది 'నేను' తలెత్తిన క్రమానికి, మహాకావ్యంలో నాయకుడు తలెత్తిన క్రమానికి పోలికవుంది. 'వాళ్ళకు' వ్యతిరేకంగా, ప్రకృతికి వ్యతిరేకంగా చేసే పోరాటంలో వేరువేరు పనులను ఎంచుకునే అవసరం వచ్చింది గనుక వ్యక్తులని సృష్టించడం అవశ్యకమని సమూహం తలపోసింది. ప్రత్యేకీకరణ అవసరమొచ్చింది. ఉమ్మడి అనుభవాన్ని సభ్యులమధ్య పంపిణీ చేయవలసిన అవసరం వచ్చింది. సమూహపు సమగ్రశక్తి ముక్కలయిపోవడం ప్రారంభమయిన క్షణం ఇదే. అయితే తమ మధ్యలోనుంచి ఒక వ్యక్తిని నాయకత్వానికి, పూజారిత్వానికి పైకెత్తి నపుడు సమూహం అతనికి తన అనుభవాన్నంతటినీ ధారాదత్తం చేసింది. గతంలో నాయకుడి ప్రతిరూపానికి తన మనస్తత్వం మొత్తాన్ని సమర్పించిన పద్ధతిలోనే యిది జరిగింది. నాయకుడో, పూజారో నిర్వహించవలసిన పాత్ర వారికి సూచన రూపం లోనో, సమ్మోహక ప్రభావం రూపంలోనో అంది ఉంటుంది. నాయకత్వపు బాధ్యత లను నిర్వహించవలసిన వ్యక్తిపైన ప్రభావం లాగానే ఇది ఉండి ఉంటుంది. ఐతే, ఒక వ్యక్తిత్వాన్ని సృష్టించేటప్పుడు సమూహం తన శక్తుల ఐక్యతకు సంబంధించిన అంతర్గత చైతన్యాన్ని భంగపరచలేదు. వ్యక్తి మనస్తత్వంలోనే ఆ చైతన్యం ధ్వంసమైపోవడం జరిగింది. సమూహం తన మధ్య నుంచి ఒక వ్యక్తిత్వాన్ని ముందుకు తీసుకువచ్చి తన ముందుగానో, పక్కనో, తర్వాత కాలంలో తనపైననో

నిలబెట్టినప్పుడు, ఆ వ్యక్తిత్వం మొదట సమూహంలో అంతర్భాగంగానే తనకు అందిన కర్తవ్యాన్ని నిర్వహించింది. తర్వాత, ఆ వ్యక్తిత్వం ఒక ప్రత్యేక నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకున్నప్పుడు, సామూహిక అనుభవం ద్వారా అందిన పదార్థాన్ని సమ్మిళితం చేయడంలో గౌరవ ప్రదర్శించినప్పుడు, ఆ వ్యక్తిత్వానికి తన గురించి తనకు తెలిసివచ్చింది. తానొక నూతన సృజనాత్మక శక్తినని అనుకుంది. సమూహపు మానసిక శక్తులకన్న తాను అతీతమైన దాన్నని అనుకుంది.

ఆ క్షణమే వ్యక్తిత్వ వికాసం ప్రారంభమైన క్షణం. వ్యక్తిత్వపు కొత్త స్వస్వరూప జ్ఞానమే వ్యక్తివాద నాటకానికి నాంది.

తన శక్తి గురించిన ప్రగాఢమైన స్పృహతో, తన ప్రాముఖ్యత గురించిన ఎరుకతో వ్యక్తి ఆ రకంగా సమూహం నుంచి రూపొందాడు. ఇట్లా సమూహంలో నుంచి తలెత్తిన వ్యక్తి మొట్టమొదట తన చుట్టూ శూన్యాన్ని అనుభవించేవాడు కాదు. ఎందువల్లనంటే, అప్పటికింకా తనలోకి ప్రవహిస్తున్న సమూహపు మానసిక శక్తివల్ల అతను బలవంతుడుగానే ఉండేవాడు. వ్యక్తి వికసించడంలో తన బలానికి రుజువును చూసుకున్న సమూహం, తన శక్తినంతా "నేను"లో నింపడం మొదలెట్టింది. అప్పటికింకా "నేను" సమూహానికి వ్యతిరేకంగా మారలేదు. సమూహానికి తమ నాయకుని అద్భుత మేధ పట్ల, అపార నైపుణ్యంపట్ల, నిజమైన ఆరాధన ఉండేది. అందుకే సమూహం నాయకుడి తలమీద గౌరవ కిరీటాన్ని పెట్టింది. ఆ నాయకుడి ముందు తెగల మహాకావ్య నాయకుల ప్రతిబింబాలుండేవి. ఆ ప్రతిబింబాలు తమతో సమానం కమ్మని సవాల్ చేస్తున్నట్లుండేవి. మరోవైపు సమూహం తమ నాయకునిలో తాము మరొక కావ్యనాయకుణ్ణి తయారు చేయగలిగామని సంతృప్తి పడుతుండేవి. ఇలా నాయకుణ్ణి సృష్టించగల అవకాశమే తెగకు ఆ రోజుల్లో అతి ముఖ్యమైనదిగా ఉండేది. ఎందుకంటే తెగ సాధించిన విజయాల ప్రచారమే శత్రువులకు వ్యతిరేకంగా కత్తులతో, గోడలతో సమానమైన రక్షణ కవచంగా ఉండేది.

మొట్టమొదట "నేను" సమూహంతో తనకు గల సంబంధపు స్పృహను కోల్పోలేదు. తనను తాను తెగ అనుభవాల ఖజానాగానే భావించుకుంది. ఆ అనుభవాన్ని భావాల రూపంలో ప్రదర్శించినప్పుడు, కొత్తశక్తుల సమకూరడాన్ని, అభివృద్ధి చెందడాన్ని అది త్వరితం చేసింది.

తన మనసులో తెగ నాయకుల ప్రతిబింబాలుండగా, ఇతరులమీద అధికారంలో ఉన్న ఆనందాన్ని రుచిచూసిన తర్వాత వ్యక్తి తనకు అందిన హక్కులను తన సొంత వినియోగానికి మిగుల్చుకోవాలని ప్రయత్నించడం ప్రారంభించాడు. అలా చేయాలంటే ఏం చేయాలి? కొత్తగా రూపొందినవీ, పుట్టి మారగలిగినవీ అయిన వాటికి శాశ్వతత్వం ఆపాదించాలి. తనను ముందుకు తెచ్చిన జీవన రూపాలను ఇక మార్పులేని నియమాలుగా తయారు చేయాలి. స్వీయ ప్రతిష్ఠాపనకు అంతకన్న మరో మార్గం లేదు.

అందువల్లనే మానసిక సృజనాత్మకతా రంగంలో వ్యక్తి చాల అభివృద్ధి నిరోధక పాత్ర నిర్వహించాడని నేననుకుంటాను. అతను తన వ్యక్తిగత హక్కులను ప్రతిష్ఠించుకుని, పరిరక్షించుకున్నప్పుడు, ఆ మేరకు సమూహపు సృజనాత్మకతను నిరోధించవలసి వచ్చింది. సమూహపు కర్తవ్యాలను తగ్గించవలసి వచ్చింది. తద్వారా వాటిని వక్రీకరించవలసి వచ్చింది.

సమూహం అమరత్వాన్ని కోరుకోదు. ఎందుకంటే, సమూహానికి అది ఉంటుంది. వ్యక్తి ఇతరులమీద తన ఆధిపత్యాన్ని స్థాపించుకున్నప్పుడు అనివార్యంగానే ఈ ఎల్లప్పుడూ కొనసాగే మనుగడ కోసం దాహాన్ని పెంచి పోషించుకున్నాడు.

ఎప్పుడైనా ప్రజల సృజనాత్మకత అప్పటికప్పుడు పుట్టుకొస్తుంది. ప్రజలలో ఉండే సంయోగ ఆకాంక్ష నుంచి ఈ సృజనాత్మకత జనిస్తుంది ప్రకృతిమీద విజయాకాంక్ష నుంచి సృజనాత్మకత వస్తుంది. ఇందుకు భిన్నంగా, వ్యక్తి తన ఆధిపత్యాన్నీ, అధికార హక్కునూ ఒకే ఒక్క పైవాళ్ల ద్వారా స్థాపించుకోదలచుకున్నాడు.

వ్యక్తివాదం ప్రధానాంశంగా స్థిరపడిన తర్వాత, ఇతరులను అణచి ఉంచే హక్కు సంతరించుకున్న తర్వాత అది ఒక శాశ్వత దైవాన్ని సృష్టించింది. "నేను"కు దైవసమానమైన లక్షణాలున్నాయని ప్రజల్ని అంగీకరించేలా చేసింది. తన స్వీయ సృజనాత్మక శక్తులపట్ల అపారమైన నమ్మకాన్ని పెంచుకుంది ఈ అభివృద్ధి పథం శిఖరాన్ని చేరేసరికి, సంపూర్ణ స్వేచ్ఛకోసం వ్యక్తి పడే తపన అనివార్యంగా అతణ్ణి ఘర్షణకు గురిచేసింది. తానే స్వయంగా స్థాపించిన సాంప్రదాయాలతో, తానే స్వయంగా సృష్టించిన శాశ్వత దైవంతో, ఆ దైవ మహత్తు కలిగించిన సాంప్ర

దాయాలతో వ్యక్తికి తీవ్రమైన ఘర్షణ ఏర్పడింది. తన అధికార దాహంతో వ్యక్తి వాదం తన చావులేని దైవాన్ని చంపవలసి వచ్చింది. నిజానికి ఆ దైవమే వ్యక్తి వాదానికి ఆధారపీఠం. వ్యక్తి వాదపు మనుగడకు సమర్థన దైవమే. ఆ దైవం పడి పోయిన క్షణం దైవసమానమైన, ఏకాకి "నేను" పతనంకూడ ప్రారంభమైంది. ఏదో ఒక బాహ్యశక్తి ఆధారం లేకుండా "నేను" సృజనాత్మకంగా ఉండలేకపోయింది. అందువల్ల జీవించలేకపోయింది. జీవించడమూ, సృజించడమూ అవిభాజ్యమైనవి.

మన సమకాలీన వ్యక్తివాదం మళ్ళీ అనేక విధాల దైవాన్ని పునరుద్ధరించ డానికి ప్రయత్నిస్తోంది. శక్తులుడిగిన "నేను" ను మళ్ళీ బలోపేతం చేసేందుకు దైవాధికారాన్ని వినియోగించుకోదలచు కుంటోంది. ప్రస్తుతం "నేను" సంకుచిత వ్యక్తిగత ప్రయోజనాల చీకటి అడవిలో దారి తప్పిపోయింది. సమస్త సజీవ సృజనాత్మక శక్తులకూ మూలమైన సమూహంనుంచి శాశ్వతంగా విడిపడిపోయింది.

అక్కడే జాతిలో వ్యక్తినిరంకుశత్వంపట్ల భయమూ, వ్యతిరేకతా తలెత్తడం మొదలయింది....

ప్రజల గాథలూ, కథలూ, నమ్మకాలూ అన్నిటిలోనూ వ్యక్తి నిస్సహాయత గురించి లెక్కలేనన్ని అద్భుతమైన ఉదాహరణలుంటాయి. వ్యక్తికి ఉన్న ఆత్మ విశ్వాసంపట్ల హేళన ఉంటుంది వ్యక్తికి ఉన్నఅధికారం దాహంపట్ల తీవ్రమైన ఖండన ఉంటుంది. మొత్తంమీద అవన్నీ వ్యక్తిపట్ల వ్యతిరేకతను చూపుతాయి. మనిషిమీద మనిషి పోరాటం మానవజాతి సామూహిక శక్తిని తగ్గిస్తుందనే, విచ్ఛిన్నం చేస్తుందనే నమ్మకం జానపద గాథలన్నిటిలోనూ నిండివుంటుంది. సమూహపు సృజనాత్మక శక్తుల పట్ల ప్రజల విశ్వాసాన్ని ఇది ప్రతిఫలిస్తుంది. ఇదే కవిత్వంలో వ్యక్త మయింది. ప్రకృతికి చెందిన చీకటి శక్తుల పైనా, ప్రతిపక్షశక్తులపైనా విజయం సాధిం చాలంటే సంపూర్ణ ఐక్యత సాధించాలని ఈ విశ్వాసమే పిలుపునిచ్చింది. ఈ పోరా టంలో ఒంటరిగా ప్రవేశించేవాళ్ళను ఈ విశ్వాసం హేళన చేసింది. ఓటమి జోస్యం చెప్పింది. ప్రజల మధ్య విభేదాలన్నింటిలో లాగానే ఈ వాదనలలోనూఅనివార్యంగా ఇరు పక్షాలూ అవతలిపక్షం తప్పుల్ని అతిశయోక్తిగా చెప్పాయి. ఈ అతిశయోక్తి మరింత అగాధానికీ ఘర్షణకూ కారణమైంది. ఇక్కడ ఇరుపక్షాల ఉన్నవి రెండు సృజనాత్మక సూత్రాలు. ఒకటి మౌలికమైనది, మరొకటి ఫలితమైనదీ.

"వ్యక్తులు" సంఖ్యలో పెరిగినకొద్దీ వాళ్ళలో వాళ్ళకే అధికారం ఎక్కువ కావాలనే ఘర్షణ మొదలయింది. ఇంకా ఇంకా ఎక్కువ కీర్తి నాశించే "నేను" ప్రయోజనాలను కాపాడేందుకు ఘర్షణ మొదలయింది. సమూహం విచ్ఛిన్నమైపోతూ వ్యక్తికి ఎడతెగకుండా శక్తిని సమకూరుస్తూ వచ్చింది. మన స్తత్వ పరమైన ఐక్యత రద్దయిపోతూ, వ్యక్తి ఇంకా ఎక్కువగా పాలిపోయాడు. తెగవ్యతిరేకత సాగుతూండగా తన విజయాల్ని నిలుపుకునేందుకు, తన వ్యక్తిగత హోదాను, తన ఆస్తిని, భార్యాపిల్లలను ఇంకా ఎక్కువ జాగ్రత్తతో కాపాడుకోవలసిన స్థితి వచ్చింది. వ్యక్తి ఆత్మ సంతృప్తికరమైన మనుగడలో సమస్యలు మరింత సంక్లిష్టమై, వాటిని తొలగించే కృషి పెరగవలసి వచ్చింది. తన "నేను" కు విముక్తి సాధించే పోరాటంలో వ్యక్తి సమూహంతో పూర్తిగా సంబంధం పోగొట్టుకున్నాడు తాను ఒక భయానక శూన్యంలో ఉన్నానని గుర్తించాడు. త్వరలోనే అతని శక్తులుడిగిపోయాయి. అక్కడ వ్యక్తికీ సమాజానికీ మధ్య ఒక అరాచక పోరాటం ప్రారంభమైంది. ప్రపంచచరిత్ర క్రమం మనకు చూపే దృశ్యం ఇది. ఇవాళ్టి శిథిలమైన, శక్తిహీనమైన వ్యక్తి శక్తులకు అసాధ్యమైనదీ పోరాటం.

స్వంత ఆస్తి పెరిగింది. అది ప్రజల్ని విడదీసింది. వాళ్ళ సంబంధాల్ని శత్రుత్వంతో నింపింది. వాళ్ళమధ్య పరిష్కారం సాధ్యంకాని వైరుధ్యాల్ని సృష్టించింది. దారిద్ర్యంలో మునిగిపోకుండా తప్పించుకునేందుకు మనిషి ప్రతి ఒక్క ప్రయత్నమూ చేయవలసి వచ్చింది. తన స్వంత ప్రయోజనాల్ని పరిరక్షించుకోవడంలో వ్యక్తి తెగతో, రాజ్యాంగ యంత్రంతో, సమాజంతో ప్రతి ఒక్క సంబంధాన్నీ కోల్పోయాడు. తన పక్షం తనమీద విధించే క్రమశిక్షణను పాటించడం అతనికి ఇవాళ చాల కష్టమవుతుంది చివరికి కుటుంబంకూడ అతణ్ణి అలసటలో ముంచుతోంది.

సమూహాన్ని విచ్ఛిన్నం చేయడంలో, ఒక స్వయం సంపూర్ణ "నేను" ను సృష్టించడంలో స్వంత ఆస్తి నిర్వహించిన పాత్ర అందరికీ తెలుసు. ఐతే ఈ క్రమంలో మనం గుర్తించ వలసిన అంశం ఒకటి ఉంది ప్రజలు భౌతికంగానూ, నైతికంగానూ బానిసలు అయిపోవడం మాత్రమేగాక, ప్రజల శక్తి దిగజారిపోవడం, సమూహానికి గల అత్యున్నతమైన, కవితాత్మకంగానూ, యథాలాపంగానూ సృజనాత్మకమైన మన స్తత్వం క్రమక్రమంగాధ్వంసమైపోవడం గుర్తించాలి.

"బానిసలకు చరిత్రలేదు" అని అంటూ ఉంటారు. ఈ మాటను బానిస యజమానులే అన్నప్పటికీ దీనిలో కొంత నిజం ఉంది. ప్రజలను కట్టెలు కొట్టేవాళ్ళుగానూ, నీళ్ళు తోడేవాళ్ళుగానూ మార్చడానికి వాళ్ళలో ఆత్మను అర్పివేయడానికి మతమూ, రాజ్యాంగ యంత్రమూ ఎంతో సహనమైన శ్రద్ధతో ప్రయత్నించాయి. తద్వారా ప్రజలకు మనుగడకు సంబంధించిన స్వంత ఊహలు చేసేందుకు, తమ ఆకాంక్షలను, ఆలోచనలను, ఆశలను గాథలుగా, కథలుగా ప్రతిఫలించేందుకు ఉన్న హక్కునూ, అవకాశాన్నీ తొలగించడం జరిగింది.

తమ గతకాలపు కవితామయ సృజనాత్మక శిఖరాలను సాధించేందుకు మానసిక అవరోధాలవల్ల సాధ్యం కాకపోయినప్పటికీ ప్రజలు తమ లోతయిన అంతరంగిక జీవితాన్ని జీవిస్తూనే వచ్చారు. వేలాదిగాథలూ, పాటలూ, సామెతలూ సృష్టిస్తూనే వచ్చారు. అప్పుడప్పుడు ఫౌస్ట్ వంటి ప్రతీకలంతఎత్తుకుకూడ ఎదిగారు. ఫౌస్ట్ గాథను సృష్టించడం ద్వారా ప్రజలు వ్యక్తి మానసిక నిర్వీర్యతను నొక్కి చూపదలచుకున్నారు. ఆ వ్యక్తి చాలకాలం కిందనే వాళ్ళకు వ్యతిరేకమయిపోయాడు. అతని ఆనంద దాహాన్నీ, అతని జ్ఞానపరిధికి ఆవలివిషయాల్ని తెలుసుకోవాలనే ప్రయత్నాల్నీ హేళన చేయాలనే కోరిక వాళ్ళను పురికొల్పింది. అన్నిదేశాల మహాకవుల మంచి రచనలన్నీ ఈ ప్రజల సామూహిక సృజనాత్మక రచనల ఖజానాలపైనే ఆధారపడ్డాయి. ఈ ఖజానానే ప్రాచీన కాలంనుంచి అన్ని కవితా సాధారణీకరణలకూ, అన్నిప్రముఖ ప్రతిబింబాలకూ, ప్రతీకలకూ వనరుగా నిలచింది.

ఈర్ష్యాపరుడయిన ఒథెల్లో, సందేహజీవి హామ్లెట్, కోర్కెనిండిన డాన్ జువాన్‌లు షేక్స్పియర్ కన్న, బైరన్‌కన్న ముందు ప్రజలు సృష్టించిన ప్రతీకలే. కాల్డెరాన్ రాయకముందే స్పానియార్డులు 'జీవితం ఒక కల' అని పాడారు. స్పానియార్డుల కన్న ముందే ఆ మాట స్పానిష్ మూర్‌లు అన్నారు. సెర్వాంటెస్ రాయక ముందే రాచరికయోధుల వ్యవస్థ జానపద కథల్లో అపహేళన పొందింది. పైగా అది అదే రకమైన, కటువైన, విషాదకరమైన ధోరణిలోనే సాగింది.

మిల్టన్, డాంటే, మిక్కీవిక్జ్, గెథె, షిల్లర్ ఆ అత్యున్నత శిఖరాల్ని చేరినప్పుడు వాళ్ళు సమూహపు సృజనాత్మకతతో ప్రేరణపొందారు. ప్రజాకవిత్వంనుంచి స్ఫూర్తి పొందారు. ప్రజా కవిత్వం అనేపనరు అతిలోతయినది, అనంత వైవిధ్యం గలది. మేధోసంపన్నమైనది, విస్తృతమైనది.

....వ్యక్తిగత సృజనాత్మకతగురించి ఇటువంటి అద్భుతమైన ఉదాహరణలలో సరిగ్గా కోసిన, మెరుగుపెట్టిన రత్నాలు దొరుకుతున్నాయంటే, ముడి వజ్రాలు సమూహంలోనే, ప్రజలలోనే పుట్టాయన్న మాట. వ్యక్తి దగ్గర కళ ఉంటుంది. కాని సృజనాత్మకత మాత్రం సమూహం దగ్గరే ఉంటుంది.

తన స్వంత ఆధారాలమీద వదిలేస్తే, సమూహం నుంచి సంబంధం విడగొడితే, ప్రజల్ని ఏకం చేసే భావాల ప్రభావానికి అతీతం చేస్తే, వ్యక్తి మందకొడిగా, అభివృద్ధి నిరోధకుడుగా, జీవన అభివృద్ధికి వ్యతిరేకిగా మారిపోతాడు.

ఈ దృక్పథం నుంచి సంస్కృతీ చరిత్రను పరిశీలించండి. స్తబ్ధత కాలంలోనూ, సమాజం చలనంలో ఉన్న కాలంలోనూ వ్యక్తి పాత్రను చూడండి. [యూరప్ చరిత్రలోని] పునరుజ్జీవదశను, సంస్కరణ దశను ఉదాహరణగా చూడవచ్చు. పునరుజ్జీవ దశలో వ్యక్తికి గల అభివృద్ధి నిరోధకత్వం, అతనిలోని నిరాశావాదం, నిశ్శబ్దవాదం, ప్రపంచం గురించిన అటువంటి నిహిలిస్టు దృక్పథాలు వ్యక్తమయ్యాయి. ఇటువంటి కాలంలో ప్రజలు నిరంతరాయంగా తమ అనుభవాన్ని క్రోడీకరిస్తుండగా, వ్యక్తి ప్రజల నుంచి దూరమై, వారి జీవితాన్ని విస్మరించి, తన జీవితపు హేతుబద్ధతను, స్పృహను గురించి మొత్తం అవగాహనను కోల్పోయి, శక్తులన్నిటినీ పోగొట్టుకొని, క్రూరమైన, నిస్సారమైన బతుకును దారుణంగా ఈడుస్తుంటాడు. సామూహిక అనుభవాన్ని భావాల రూపంలో, ప్రతిపాదనల రూపంలో, సిద్ధాంతాల రూపంలో సంఘటితం చేయాలనే తన అత్యున్నత సృజనాత్మక కర్తవ్యాన్ని నిరాకరిస్తాడు. సంస్కరణ దశలో వ్యక్తి మానసిక శక్తి వేగంగా వికసించడం కనబడుతుంది. అటువంటి సాంఘిక సంక్షోభ సమయాలలో, వేలాది సంకల్పాలు ఒక వ్యక్తిని తమ సాధనంగా చేసుకుని అతనిలో కేంద్రీకరించ బడడం వల్లనే ఈ వికాసం సాధ్యమవుతుంది. ఇటువంటి సమయాలలో వ్యక్తి మన కళ్ళముందే అధికార కాంతితో, సౌందర్య కాంతితో లేచి నిలబడడం కనిపిస్తుంది. అతని ప్రజల, అతని వర్గపు, అతని పార్టీ ఆకాంక్షల కిరణాలు అతనిమీద వెలుగులు ప్రసరిస్తాయి.

ఆ ప్రత్యేక వ్యక్తి ఎవరనేది అనవసరం .... ముఖ్యమైన విషయమేమంటే ఇటువంటి నాయకులు సామూహిక శక్తికి వాహకులని గుర్తించాలి. వాళ్ళు ప్రజల

పక్షన వ్యాఖ్యాతలు. .... ఎల్లప్పుడూ, ప్రతిచోటా చరిత్ర అంతటా మనిషిని తయారు చేసినది ప్రజలే ....

ఇవాళ్టి మనిషి చేయగల పనులు ఎంత ప్రాముఖ్యం లేనివో, అతని మనసు ఎంత భయానక నిస్పృహతో ఉన్నదో మనకు తెలుసు. అందువల్ల భవిష్యత్తులో ఏం జరుగుతుంది, గతం మనకు ఏమి నేర్పుతుంది, అని మనం ఆలోచించవలసి ఉంది. వ్యక్తి ఈ తప్పించుకోలేని పతనం వైపు ఎందుకు వెళ్తున్నాడో కారణాలు కనిపెట్ట వలసి ఉంది.

కాలం గడుస్తున్న కొద్దీ జీవితం మరింత కష్టదాయకమూ, సమస్యల మయమూ అవుతుంది. అందరికి వ్యతిరేకంగా ఒక్కరు చేసే పోరాటం వల్ల ఇలా జరుగుతుంది. ఈ తీవ్ర శత్రుత్వం ప్రతి వ్యక్తిలోనూ క్రియాశీలాన్ని పెంపొందించ వలసింది. తనవంటి వాళ్ళే తన మీద చేస్తున్న దాడిని అతను తిప్పికొట్టవలసి ఉంది. వ్యక్తిలో ఏమైనా సృజనాత్మక తపన ఉన్నట్టయితే, అందరికి వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ చేస్తున్న ఈ ఎడతెగని పోరాటం అతణ్ణి తన మానసిక శక్తులన్నిటినీ, తన కవితాసంపదంతటినీ ప్రపంచానికి చూపే స్థానంలో నిలిపి ఉండేవి. కాని వ్యక్తి కనీసం ఒక్క ప్రొమీథియస్‌నైనా, విలియమ్ టెల్‌నయినా, ముందుకు తేలేకపోయాడు. ప్రాచీన గతానికి చెందిన హెరాక్లెస్‌తో శక్తిలోనూ, అందంలోనూ సాటిరాగల ప్రతీకను కూడ సృష్టించలేకపోయాడు.

ఎందరో మాన్‌ఫ్రెడ్‌ల సృష్టి జరిగింది. వారిలో ప్రతి ఒక్కరూ ఒకే విష యాన్ని వేరు వేరు పద్ధతులలో చెపుతారు. వ్యక్తి జీవితపు నిగూఢత్వాన్ని గురించి, ప్రపంచంలో మనిషి ఒంటరితనపు వేదన గురించి. అప్పుడప్పుడు ఇది విశ్వంలో మన భూగోళపు విషాద ఏకాకితనం పట్ల సంతాపం స్థాయికి కూడ ఎదుగుతుంది. ఇది దయనీయంగా కనబడుతుందిగాని ఇందులో ప్రతిభ ఏమీలేదు. మాన్‌ఫ్రెడ్ 19వ శతాబ్దంలో తయారయిన తలకిందుల ప్రొమీథియస్ రూపం. మాన్‌ఫ్రెడ్‌లో ఒక క్షుద్ర వ్యక్తివాది చిత్రాన్ని ఆకర్షణీయంగా చిత్రించారు. అతను శాశ్వత ప్రపంచం మొత్తం మీద తనను, తన ఎదురుగా ఉన్న మృత్యువును తప్ప మరిదేనినీ గుర్తించ లేని ఇంద్రియ లోపానికి శాశ్వతంగా గురయ్యాడు. అతను ఎప్పుడయినా సమస్త ప్రపంచపు బాధల గురించీ మాట్లాడితే, ప్రపంచం ఆ బాధలను తొలగించుకునేందుకు

ప్రయత్నిస్తున్నదని అతనికి తట్టనే తట్టదు. ఒక వేళ ఆ ఆలోచన ఎప్పుడయినా తట్టినా, అతను అనగలిగిందల్లా ఒకటే - సమస్యలను జయించడం అసాధ్యం అని. అతను ఇలా తప్ప మరోరకంగా మాట్లాడలేడు. ఎందుకంటే, ఒంటరితనంతో వికలమైన మనసుకు దృష్టిలోపిస్తుంది. ఆ మనసు సమూహపు అప్పటి కప్పటి కార్యాచరణను చూడజాలదు. విజయాలోచనే దానికి పరాయిదిగా ఉంటుంది. "నేను"కు ఒకే ఒక్క ఆనంద హేతువు ఉంటుంది. తన జబ్బుగురించీ, అనివార్య మృత్యువు సమీపిస్తుండడం గురించీ పదేపదే చెప్పుకోవడం. మాన్‌ఫ్రెడ్‌తో మొదలయి, "నేను" తన గురించి తాను పాడుకుంటుంది. తనలాంటి ఒంటరి ప్రాణుల గురించి పాడుతుంది.

ఇటువంటి కవిత్వసారాన్ని పరిశీలిస్తే, ఒంటరి మానవ "నేను" ను దాని నగ్నత్వం నుంచి కాపాడడానికి, పఱుకెత్తిస్తున్న మృత్యుభయం నుంచి దానికి రక్షణ కల్పించడానికి: వ్యక్తి మనుగడ అర్థరహితమైనదనే దాని పెద్ద, నిజాయితీ పూర్వకమైన అభ్యర్థనకు రక్షణ కల్పించడానికి "ప్రపంచాన్ని" తోడు తెచ్చుకోవడం జరిగింది. తనను తన చుట్టూ ఉన్న మహా, సజీవ ప్రపంచంతో సమానం చేసుకున్నప్పుడు మనుగడ నిరర్థకమైపోయిందనే తన స్వంత భావాన్ని వ్యక్తిత్వం ప్రపంచానికి కూడ వర్తింప జేస్తుంది. తన ఒంటరితనం గురించి సగర్వంగా మాట్లాడుతుంది. తన దయనీయమైన ఆత్మ అభ్యర్థనల పట్ల శ్రద్ధ వహించమని దోమలాగ మనుషులను బాధిస్తుంది.

ఈ కవిత్వం కొన్నిసార్లు శక్తివంతమైనదే: కాని కేవలం ఒక నిజాయితీతో కూడిన ఉద్వేగ ఆర్తనాదంవలె మాత్రమే. అది అపారమైనది కూడ కావచ్చు. కాని కేవలం ప్లాబర్టు అభివర్ణించినప్పుడు కుష్టువ్యాధికి కలిగే అందంలా మాత్రమే. ఈ కవిత్వపు ఒకానొక వ్యక్తిత్వం ఎటువంటిదంటే, జీవితానికీ సృజనాత్మకతకూ నిజమైన వనరు అయిన ప్రజలతో సజీవ సంబంధపు స్పృహను హృదయంలోలోపల అణచి వేసుకున్నది.

వ్యక్తివాదం తన మరణ శయ్యమీద పడి ఉన్నప్పుడు, పెట్టుబడిదారీ విధానపు పశ్చాత్తాపంలేని పట్టు, తన ఇష్టానికి వ్యతిరేకంగానే సమూహాన్ని పునస్సృష్టిస్తున్నది.

7]

కార్మిక వర్గాన్ని దృఢమైన నైతిక శక్తిగా అణగదొక్కుతున్నది. క్రమక్రమంగా, కాని ఇతోధికవేగంతో ఈ శక్తి తానే ప్రపంచపు మహాసామూహిక ఆత్మనని గుర్తించడం ప్రారంభించింది. జీవితాన్ని స్వేచ్ఛగా సృష్టించే కర్తవ్యం తనది మాత్రమేనని గుర్తించడం ప్రారంభించింది.

ఈ శక్తి ఆవిర్భావం చూస్తే వ్యక్తివాదులకు దిగంతంమీద నల్లని తుఫాను మేఘం కమ్మినట్లనిపిస్తుంది. మరణం ఎంత భయాన్ని కలిగిస్తుందో, ఈ పరిణామం కూడ వారిలో అంత భయాన్ని కలిగిస్తుంది. ఎందుకంటే వాళ్ళదృష్టిలో ఈ శక్తి సామాజిక మృత్యుకారకమే. వారిలో ప్రతి ఒక్కరూ తన "నేను" కు ప్రత్యేక పరిగణన ఉండాలనీ, ఉన్నత గౌరవం దక్కాలనీ ఆశిస్తారు. కాని ప్రపంచంలోకినూత్న జీవితాన్ని ఆవిష్కరించే కార్మికవర్గం ఈ "మానసిక అభిజాత్యవాదులకు" వారు కోరుకున్న శ్రద్ధను ఇవ్వాలని అనుకోదు. ఈ విషయం తెలుసు గనుకనే ఆ పెద్ద మనుషులకు కార్మికవర్గం పట్ల హృదయపూర్వక అసహ్యం ఉంటుంది.

వారిలో కొందరు, గొప్ప కళానైపుణ్యం గలవాళ్ళు, భవిష్యత్తు ఉన్నత ఆశల పట్ల అవగాహన గలవాళ్ళు, న్యాయాధిపతులుగా, ప్రవక్తలుగా, దళనాయకులుగా సోషలిస్టులలో చేరదలచుకుంటారు. కార్మికవర్గంతో కలసి నడిచేందుకు వాళ్ళుచూపే సంసిద్ధత తమ స్వంత వ్యక్తిత్వాలను స్థిరపరచుకునేందుకు క్షుద్రులు చేసే ప్రయత్నాల మీద ముసుగుమాత్రమేనని కార్మికవర్గం తెలుసుకోవాలి. అనివార్యంగా తెలుసుకుంటుంది కూడ.

మానసిక భిక్షకత్వానికి కుదించబడి, వైరుధ్యాల చిక్కులలో ఇరుక్కుని, ఆశ్రయం కోసం ఒక సురక్షిత మారుమూలకోసం వెతుకులాటలో వేళాకోళంగా, దయనీయంగా, మారిపోయి వ్యక్తివాదం విచ్ఛిన్నమైపోతోంది. దాని మనస్తత్వం ఇంకా ఇంకా ఎక్కువగా పలచబడిపోతోంది. ఈ గుర్తింపుతో నిస్పృహలో మునిగిపోయి, (ఆ నిస్పృహను గుర్తించిగాని, దాచుకునేందుకు ప్రయత్నించిగాని) వ్యక్తివాదం విముక్తికోసం అన్వేషణలో పిచ్చెక్కినట్టు తిరుగుతోంది. అధిభౌతిక వాదంలోకి, దుర్మార్గంలోకీ దిగజారుతోంది. దైవంకోసం అన్వేషిస్తూ, సైతాన్నుకూడ నమ్మడానికి సిద్ధపడుతోంది. దాని ప్రయత్నాలూ, సంక్షోభమూ మృత్యు సామీప్యపు హెచ్చరికను, నిష్ఫలమైన తన భవిష్యత్తు పట్ల భయాన్ని చైతన్యయుతంగా గుర్తిం

చక పోయినా తీవ్రంగా అనుభవిస్తున్నాయి. ప్రస్తుత కాలపు వ్యక్తివాది ఆందోళనా పూరితమైన నిరాశ ఉచ్చులో ఉన్నాడు. అతను తన మూలాల్ని కోల్పోయాడు. జీవితం మీద తన పట్టును నిలుపుకునేందుకు ప్రతి ప్రయత్నమూ చేస్తున్నాడు. కాని అతని శక్తి దిగజారుతోంది. ఇప్పుడింక మిగిలింది అతని మోసకారితనం మాత్రమే. మోసకారి తనాన్ని "మూర్ఖులతెలివి"గా ఎవరో అభివర్ణించారు. తన పాత వ్యక్తిత్వానికి కేవలం తొక్కగా మిగిలిపోయిన ఈ వ్యక్తి మానసికంగా అలసిపోయి, విసుగువల్ల వికలమైన మనసుతో, ఒకప్పుడు సోషలిజంతో సంబంధం పెట్టుకుంటాడు, ఒకప్పుడు పెట్టుబడిదారీ విధానాన్ని భజనచేస్తుంటాడు. మరోవైపు తనసాంఘికమృత్యువు సమీపిస్తున్నదనే అభిప్రాయం అతని సంకుచిత, రోగిష్టి "నేను"ను ఇంకా ఇంకా విచ్ఛిన్నం చేస్తుంది. అతని స్పృహ ఇతోధిక వేగంతో నిరాశావాదంగా మారుతుంది. వ్యక్తివాది తాను నిన్న ఆరాధించినదాన్నే ఉన్మాదపూరితంగా తిరస్కరించడం, తగులబెట్టడం ప్రారంభిస్తాడు. ఈ వ్యతిరేక వాదపు స్ఫూర్తి స్వభావం అతణ్ణి అనివార్యంగా ఏ మానసిక స్థితిలోకి నెడుతుందంటే ఆ మానసికస్థితి గూండాయిజానికి దగ్గరగా ఉంటుంది. నేనీమాట వాడుతున్నానంటే ఇప్పటికే అవమానాలు పొందిన వాళ్ళను ఇంకా అవమానించాలనిగాని, ఇప్పటికే తిరస్కరింపబడినవాళ్ళను ఇంకా తిరస్కరించాలనిగాని నాకేకోరికా లేదు. వాళ్ళపట్ల జీవితమే, నేను చేయగలిగినంత కంటె కటువుగా అవమానాన్నీ తిరస్కారాన్నీ ప్రయోగిస్తోంది. కాని గూండాయిజం అనేది వ్యక్తిత్వం మానసికంగాను, భౌతికంగాను విచ్ఛిన్నమైపోయిన స్థితికి ఫలితం. ఈ విచ్ఛిన్నం అంతిమదశకు చేరిందనేందుకు తిరుగులేని దాఖలా గూండాయిజం. బహుశా ఇది సాంఘిక పోషకాహారలోపంవల్ల, ఇంద్రియాలలోపంవల్ల మెదడుకువచ్చే తీవ్రమైన వ్యాధి కావచ్చు. ఈ స్థితిలో ఇంద్రియాలు నానాటికీ మందకొడిగా, నిర్లిప్తంగా తయారయి, పరిసరాలు కలిగించిన ముద్రల్ని తక్కువగా స్వీకరిస్తుంటాయి. తత్ఫలితంగా మేధకు మత్తుమందు ఇచ్చినట్టవుతుంది.

గూండా అనేవాడు ఏ సాంఘిక అనుబంధమూ లేని జీవి. తన చుట్టూ ఉన్న ప్రపంచంతో ఏ సంబంధాన్నీ అనుభూతి చెందడు. ఏ విలువా తెలియదు. చివరికి క్రమ క్రమంగా ఆత్మ రక్షణా ప్రవృత్తిని కూడ కోల్పోతాడు. తన వ్యక్తిగత జీవితపు విలువ పట్ల ఎంత మాత్రమూ స్పృహ ఉండదు. క్రమబద్ధమైన ఆలోచన చెయ్యలేడు. భావాల మధ్య సంబంధాన్ని కష్టం మీద తప్ప గుర్తించలేడు.

ఆలోచనా ధారలు కేవలం పెనం మీద మెరుపుల లాంటివి. అవి చుట్టూ ఉన్న ప్రపంచంలోని ఏదో ఒక సూక్ష్మ భాగంమీద కాంతి హీనమవుతున్న, మిణుకు మిణుకు మంటున్న కాంతిని ప్రసరించి శూన్యంలోకి అంతమయిపోయే మెరుపులు. రోగిష్టిలాగ ప్రభావాలకు లోనవుతాడు. కాని దృష్టిపథం సంకుచితమైనది. సమ్మేళన శక్తి ఛాయా మాత్రమైనది. ఆలోచనలోనూ, కుతర్కం పట్ల పక్షపాతంలోనూ ఉన్న వైచిత్రికి కారణం బహుశా ఇదేననుకుంటాను. "మనిషిని సృష్టించింది కాలం కాదు, మనిషే కాలాన్ని సృష్టించాడు" అని నొక్కి చెపుతాడు. అయితే తాను చెప్పే విషయాన్ని తానే నమ్మడు. "ముఖ్యమైనవి అందమైన మాటలు, అందమైన పనులు కావు" అని కూడ అంటాడు. తద్వారా తన నిర్వీర్యతను సూచిస్తాడు. తన సైద్ధాంతిక, సాంఘిక వైఖరులలో త్వరిత మార్పులకు సిద్ధంగా ఉన్నానని చూపుతాడు. రోగగ్రస్తమైన ఆ మనస్తత్వపు అస్థిరత్వానికీ, తిరుగుబోతు తనానికీ ఇది నిదర్శనం. ఆ వ్యక్తిత్వం కేవలం శిథిలమైనది మాత్రమే కాదు, శాశ్వతంగా రెండుగా చీలిపోయినది. అతనిలోని చైతన్యవంతమైన, సహజాతమైన భాగం ఎప్పటికీ ఒకే ఒక్క "నేను"లో కలగలిసి పోదు. ఇటువంటి రకమైన జీవిలో అతని వయ్యక్తికత అనుభవం, అతని మనసుకు గల తక్కువస్థాయి నిర్మాణ సామర్థ్యం కలిసి వారసత్వంగా వచ్చిన అనుభవానిది పైచేయి అవుతుంది. అందువల్ల అతను అవిరామంగానే అయినప్పటికీ మందకొడిగా, నిష్ఫలంగా తన తాత నీడతో యుద్ధం చేస్తుంటాడు. గతకాలపు చీకటి శక్తులు, పగబట్టిన భూతాలు అతణ్ణి చుట్టుముడతాయి. అతణ్ణి ఎప్పుడూ ఉన్మాదపూరితమైన ఆందోళనలో ఉంచుతాయి. అతని లోలోపలి ప్రవృత్తులలో ఆదిమ, పాశవిక కోర్కెలను మేల్కొల్పుతాయి. మొద్దుబారి, చెల్లాచెదరయినా, అతని నాడులు శక్తివంతమైన, బలమైన ప్రేరణల కోసం అన్వేషిస్తాయి. అందువల్లనే గూండాలు లైంగిక వైపరీత్యానికీ, ఇంద్రియ లౌల్యానికీ, హింసా ప్రవృత్తికీ లోబడి ఉంటారు. తన నిర్వీర్యత గురించి తెలిసి, ఇతను జీవితం విసిరే సవాళ్ళను మరింత మరింత ఎక్కువగా విస్మరిస్తుంటాడు. అందువల్ల సాంఘిక నైతిక స్పృహ కోల్పోతాడు. నిహిలిజంలో ప్రవేశిస్తాడు. లోతయిన అసంతృప్తిని పెంచుకుంటాడు. ఇవన్నీ గూండాకు సహజమైనవే.

ఈ వ్యక్తి తన జీవితమంతా ఉన్మాదపు అంచుల్లో తిరుగాడుతాడు. అంటు వ్యాధుల సూక్ష్మక్రిములకంటె కూడ ఇతడు సాంఘికంగా ప్రమాదకారి. నైతిక

అంటువ్యాధికి మూలమైన ఇతర్ణ్ణి ప్రమాదకర సూక్ష్మజీవులను నాశనం చేసే పద్ధతులలో నిర్మూలించలేము.

అతని అసంబద్ధ ఆలోచనల వెనుక, వింతయిన, తరచుగా కోపం తెప్పించే అతని చర్యల వెనుక ప్రపంచంపట్ల, ప్రజల పట్ల వ్యతిరేకత ఉన్నది. బలహీనమైనదయినప్పటికీ సహజాతమైన శత్రుత్వం ఉన్నది. రోగిష్టి మనిషిలో ఉండే నిరాశావాదం ఉన్నది. అతని అవగాహనలు తప్పుడువయిపోయాయి. అందువల్ల అతను జీవిత యాత్రలో వెనుకబడి తొట్రుబడుతూ ఉంటాడు. అతను దారిని మరిచిపోయాడు. మళ్ళీ గుర్తించలేకపోతున్నాడు. అతని కేకలు బలహీనమైనందువల్ల నిష్ఫలమవుతున్నాయి. అతని వాక్యాలు అసంబద్ధంగా ఉన్నాయి. పదాలు నిస్సారంగా ఉన్నాయి. అతని విజ్ఞప్తులకు ఫలితంలేదు. ఎందుకంటే అతని చుట్టూ అతనిలాగనే నిర్వీర్యంగా, అర్ధ ఉన్మాదంలో ఉన్నవాళ్ళున్నారు. అతనిలాగనే వాళ్ళు కూడ ఏ సాయాన్నీ అందించజాలరు. అందించరు. అతనిలాగ దుర్మార్గంగానే వాళ్ళు కూడ ముందుకువెళ్ళిన దారుల మీద ఉమ్మేస్తారు. తాము అర్థం చేసుకోలేని దాన్ని దుర్భాషలాడతారు. తమకు వ్యతిరేకమైనవాన్ని అవహేళన చేస్తారు. అంటే చురుకుగా ఉన్న దాన్నల్లా, సృజనాత్మక స్ఫూర్తితో నిండి ఉన్న దాన్నల్లా, చేసిన క్రియల కాంతితో ప్రపంచాన్ని అలంకరించిన దాన్నల్లా, భవిష్యత్తు పట్ల విశ్వాసంతో జ్వలిస్తున్న దాన్నల్లా వాళ్ళు ఇట్లా తిరస్కరిస్తారు.

[మిగతా వచ్చే సంచికలో]

కొత్తపుస్తకాలు

స్నేహ ప్రచురణలు :

తర్జని - కరుణ రచనలు రు. 5-00

సృజన ప్రచురణలు :

సాంస్కృతికోద్యమ నిర్మాణ సమస్యలు - గద్దర్ రు. 3-00

ప్రతులకు :

సృజన, ఫ్లాట్ 11, బ్లాక్ 2, ఎం ఐ జి II

బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 500 044

ప్రకృతిని ఒడిలోకి తీసుకున్న స్త్రీలు

కె. అనూరాధ

"సత్యం కోసం పోరాటం మొదలైంది
హక్కుల కోసం పోరాటం మొదలైంది
చెలీ ! ఈ కొండలా ఈ అడవి
మన ఆస్తి మన హక్కు
చెట్లను కౌగిలించుకో ! సెలయేళ్ళను గుండెకద్దుకో!"....

— 'చిప్కో' ఉద్యమ గీతం

ఈ రోజున పర్యావరణం గురించి మాట్లాడాలంటే, మరీ ముఖ్యంగా మూడవ ప్రపంచ దేశాల పర్యావరణం గురించి మాట్లాడాలంటే తప్పని సరిగా 'అభివృద్ధి విధానం' గురించి మాట్లాడాలి. 'అభివృద్ధి' - శాస్త్ర సాంకేతిక రంగంలో గాని, సాంఘిక ఆర్థిక రంగంలోగాని, సంక్షేమ రంగంలోగాని అన్ని చోట్ల పెద్ద సంక్షోభాన్ని సృష్టించింది. ఈ సంక్షోభం ఫలితంగా సమాజంలోని అట్టడుగు వర్గాలు 'సమాజం' నుండి మరింత దూరం అవుతున్నారు. సామాజిక సంపద ఫలాలకు మరింత దూరం అవుతున్నారు. ఈ దూరం అయ్యే క్రమంలో సమాజంలోని బల హీన వర్గాలు, గిరిజనులు, స్త్రీలతో పాటు ప్రకృతి కూడా విపరీతమైన దోపిడీకి గురవు తోంది. ప్రకృతితో సన్నిహిత సంబంధం కలిగిన స్త్రీలు ఈ దోపిడీని కూడా గుర్తిస్తు న్నారు. అందుకే ఈ రోజున అన్ని పర్యావరణ ఉద్యమాలు స్త్రీ విముక్తి ఉద్య మాల్లో భాగం అయిపోయాయి.

పర్యావరణ ఉద్యమాల్లో స్త్రీల పాత్రను, వారి భాగస్వామ్యాన్ని విశ్లేషిస్తూ పాశ్చాత్య దేశాల ఫెమినిస్టులు చాలా పుస్తకాలు రాసారు. పర్యావరణ సాహిత్యానికి మైలురాయిగా భావించబడే 'సైలెంట్ స్ప్రింగ్' అన్న పుస్తకం కూడా రేచల్ కార్సన్ అన్న మహిళ రాసిందే. భారతదేశ నేపథ్యంలో పర్యావరణ ఉద్యమాల్లో స్త్రీల పాత్రను గురించి వందనా శివ రాసిన 'స్టేయింగ్ ఎలైవ్' అన్న పుస్తకం పర్యా వరణ, స్త్రీవాద సాహిత్యాన్ని మరింత అభివృద్ధి పరుస్తుంది.

ప్రకృతికీ స్త్రీకీ మధ్య వున్న సజీవ సంబంధాన్ని, లక్షణాల్లో వున్న సారూప్యాన్ని, మానవుల మనుగడ కోసం స్త్రీలు చేసే కృషిని చాలా సుదీర్ఘంగా చర్చించింది ఈ పుస్తకం. పర్యావరణ ఉద్యమాల ఆవశ్యకతను, వాటిలో స్త్రీలు నిర్వహిస్తున్న పాత్రను చాలా అద్భుతంగా చిత్రించారు రచయిత. స్త్రీకి ప్రకృతితో వున్న సంబంధాన్ని, పర్యావరణ సమస్యలు స్త్రీ సమస్యలుగా మారిన క్రమాన్ని ఎన్నో కొత్త కోణాలనుండి విశ్లేషించి ఎన్నో కొత్త విషయాలు చర్చకు పెట్టారు. అయితే సమస్యను చాలా అద్భుతంగా చర్చించినప్పటికీ, ఎన్నో అశాస్త్రీయమైన వాదనలతో ఈ పుస్తకం ముగుస్తుంది. ఈ అశాస్త్రీయ భావాలకు కారణం సమస్యను తలక్రిందులుగా చూడటమే.

రచయిత్రి భావించినట్లుగానే ఏనాడైతే ప్రకృతి జీవన చక్రానికి పునాదిగాకాక ఒక సరుకుగా, వనరుగా చూడబడిందో అప్పటినుండే ప్రకృతికీ, మనుషులకూ మధ్య దోపిడీ సంబంధాలు ఏర్పడ్డాయి. మానవుల సమస్తజ్ఞానం, శాస్త్రం ప్రకృతి విరుద్ధంగా మారాయి. ఒక తప్పుడు చైతన్యంతో తప్పుడు ప్రగతి మార్గంలోకి ప్రవేశించింది మానవ వ్యవస్థ. శాస్త్ర సాంకేతిక జ్ఞానం సంకుచితత్వాన్ని (రిడక్షనిజాన్ని) అలవర్చుకున్నాయి. మానవుల వికాసం కోసం వారి అవసరాలను తీర్చడం కోసం కాక, ఉత్పత్తిలో 'లాభం' కోసమే శాస్త్రం అభివృద్ధి చెందుతూ వచ్చింది. ఈ సంకుచిత శాస్త్రానికి, ప్రకృతితో నిత్య సంబంధంలోవున్న గిరిజనుల, స్త్రీల సాంప్రదాయ జ్ఞానం అశాస్త్రీయంగా, అనవసరంగా కనపడసాగింది ఆహారం, నీరు, ఆరోగ్యం లాంటి నిత్య అవసరాలను తీర్చే స్త్రీలకూ ప్రకృతికీ మధ్య ఒక సమన్వయం వుండేది కాని నూతన సాంకేతిక జ్ఞానం స్త్రీల జ్ఞానాన్ని శ్రమని పూర్తిగా తిరస్కరించి స్త్రీలను ప్రకృతికి దూరంచేసి పరాయీకరణకు గురిచేస్తుంది. ఇక్కడ ప్రకృతి, స్త్రీ రెండూ కూడా శాస్త్రీయ విధానం పేరుమీదసాగే పురుషాధిక్య భావజాలం చేతిలో లొంగిపోయే వస్తువులు అయిపోయారు.

ఈ అణచివేత క్రమాన్ని రచయిత్రి వివిధ కోణాలనుండి చర్చించారు. స్త్రీకీ ప్రకృతికీ వున్న సారూప్యతలో ముఖ్యమైనది ప్రత్యుత్పత్తి. జీవితాన్ని సృష్టించడంలో రెండిటికీ పాత్రవుంది. అందుకే స్త్రీ ప్రకృతిలాగా ఆలోచించగలదని రచయిత అభిప్రాయం. ఆదిమ సమాజాల్లో మాతృస్వామ్య వ్యవస్థలో ఆహార సేకరణ, ఉత్పత్తి స్త్రీలే చేసేవారు. వ్యవసాయాన్ని కూడా స్త్రీలే కనిపెట్టారని చరిత్ర సూచి

స్తోంది. ఆ రకంగా ప్రకృతిని పర్యావరణ దృష్టితో అర్థం చేసుకోవడం స్త్రీకి అల వాటైంది. ఇప్పటికి కూడా ప్రకృతితో దగ్గరి సంబంధం కలిగి వుండేది స్త్రీలే. ఏ ప్రాంతంలోనైనా నీళ్ళు, వంటచెరకు మోసుకొచ్చేది స్త్రీలే. కలుపు మొక్కలు, వాటి వివరాలు, వాటి స్వభావం స్త్రీలకు బాగా తెలుసు. ధాన్యం గురించి, విత్తన శుద్ధి గురించి, ఆహార పదార్థాల నిలవ గురించి వీరికున్న జ్ఞానం ఏ 'శాస్త్రవేత్త'ల జ్ఞానాని కన్నా తీసిపోదు. వీరికున్న జ్ఞానాన్ని వాడుకొని, అభివృద్ధి చేసి శాస్త్రస్థాయి కల్పించే బదులు 'శాస్త్రవేత్తలు' రూపొందించిన జ్ఞానాన్ని వీరిమీద రుద్దడం జరుగుతోంది.

అడవుల్లోవున్న గిరిజన స్త్రీలకు ప్రకృతి గురించి వున్న జ్ఞానాన్ని పర్యావరణ స్పృహను చాలా వివరంగా పరిశీలించారు రచయిత. ఒక ఉమ్మడి ఆస్తిగా వున్న అడవి, గిరిజనులకు ఎలా దూరమైందో, రక్షిత అడవి (ప్రొటెక్టెడ్ ఫారెస్టు) పేరుతో అడవులు ఎలా అత్యాచారానికి గురయ్యాయో చారిత్రకంగా వివరించారు. ఈ క్రమం లోనే 'పాశ్చాత్య సంకుచిత శాస్త్రం' గిరిజనుల, స్త్రీల ఉమ్మడి జ్ఞానాన్నికూడా ఎలా అణగదొక్కిందో మనకు అర్థం అవుతుంది. అడవుల నిర్మూలనకు, వినాశనానికీ ఈ సంకుచిత దృక్పథమే కారణం అని విప్పిచెప్పారు. ఎన్నో సంవత్సరాల నుండి అడవుల్లో నివసిస్తున్న గిరిజనులకు వున్నపాటి పర్యావరణ చైతన్యం ఈ శాస్త్రవేత్త లకు లోపించింది. అడవి వనరులను వారి అవసరాల కోసం, మనుగడ కోసం వాడు కోవడం తెలిసిన గిరిజనులకు, వాటిని కాపాడుకోవడం కూడా తెలుసు. ఏ ప్రాంతంలో ఏ చెట్లు నరకాలి, చెట్లను ఎలా సంరక్షించాలి, ఆ చెట్ల విలువ ఏమిటి అన్న విష యాలు గిరిజన స్త్రీలకు తెలిసినంతగా శాస్త్రవేత్తలకు తెలుసా? ప్రతి చెట్టు పేరు, వాటి వల్ల వుండే ఉపయోగాలు, అడవిలో ఎప్పుడు ఎక్కడ నీరు వుంటుందో, వంట చెరకు ఎక్కడనుండి ఏరాలో, ఆహారం, వంటచెరకు మళ్ళీ మళ్ళీ పునరుత్పత్తి కావ డానికి ఏం చేయాలో తెలుసుకోవాలంటే ఏ వ్యవసాయ పాఠశాలలు అవసరం లేదు. కొన్ని ఏళ్ళ అనుభవం నుండి నేర్చుకున్న ఈ జ్ఞానాన్ని నేటి శాస్త్రవేత్తలు విస్మరించ వచ్చా? కేవలం జామాయిలు, పిచ్చితుమ్మచెట్లు తప్ప మిగతా చెట్లన్నిటినీ కలుపు మొక్కలుగా భావించే మన శాస్త్రవేత్తలకు వాటి ఉపయోగాలను, అవసరాలనూ ఎవరు విప్పిచెప్పగలరు? 1904లో జాతీయ వ్యవసాయ పరిశోధనా సంస్థ స్థాపన సంద ర్భంగా పూనాకు వచ్చిన ఎ. హోవార్డ్ అనే బ్రిటిష్ శాస్త్రవేత్త గిరిజనుల జ్ఞానాన్ని గురించి రాస్తూ "ప్రస్తుతం వీరివద్ద నుండి వీలైనంత త్వరగా వీరి సాంప్రదాయ

జ్ఞానాన్ని నేర్చుకోవాలనుంది. ప్రస్తుతం వీరు నా గురువులు, నేను శిష్యుడిని. వీరి వ్యవసాయ పద్ధతులు ఎంత అద్భుతంగా వున్నాయంటే పంటను తెగుళ్ళ, కీటకాల బారినుండి చాలా తేలిగ్గా కాపాడుతున్నారు. ఇంత ఆరోగ్యవంతమైన పంటను సునాయాసంగా పండించే ఈ ప్రజలకు మాలాంటి వ్యవసాయ నిపుణులతో ఇంక పనేముంది....” అన్నారు. కాని హోవార్డ్ లాంటి శాస్త్రానికి అర్థం తెలిసిన శాస్త్రవేత్తలు ఎంతోమంది వుండరు. ప్రస్తుతం మన శాస్త్రవేత్తలు చేస్తున్నదంతా సమస్యలను సృష్టించడం, వాటికి మళ్ళీ తప్పుడు పద్ధతుల్లో సమాధానాలు వెతకడం ('పరిశోధించడం')! ఈ 'పరిశోధనకు' హరిత విప్లవం, శ్వేత విప్లవం అనే పేర్లు పెట్టి కరువును సృష్టించింది వీళ్ళే, అడవులను నిర్మూలించింది వీళ్ళే, క్రిమి కీటకాల సంఖ్యను పెంచింది వీళ్ళే, మొక్కల జన్యు విస్తీర్ణాన్ని నాశనం చేసింది వీళ్ళే, పంట భూములను చౌడు భూములుగా మార్చిందీ వీళ్ళే. అభివృద్ధి సృష్టించిన ఈ సరికొత్త సమస్యలన్నిటికీ ఒకోదానికీ ఒకొక జాతీయస్థాయి పరిశోధనా సంస్థలు స్థాపించి మరిన్ని సమస్యలు సృష్టించడానికి 'పరిశోధనలు' మొదలు పెడతారు. వీరి 'పరిశోధనలకు' ప్రపంచబ్యాంకు, బహుళజాతి సంస్థలు అప్పులు ఇచ్చి సహకరిస్తూ వుంటాయి. ఇప్పుడీ ఉన్మాదానికి పరాకాష్టగా 'బయోటెక్నాలజీ' అనే పేరుమీద సరికొత్త ఆయుధాన్ని పాశ్చాత్యదేశాల నిపుణులు మనకు అమ్ముతున్నారు.

అభివృద్ధి పేరుమీద చెలామణీ అవుతున్న దౌర్జన్యానికి బలైపోతున్నది స్త్రీలు, గిరిజనులు, బలహీన వర్గాలే. ఎందుకంటే మన వ్యవస్థలో వీరు రెండవ రకం పౌరులు. ఏ విషయంలోనూ వీరికి మాట్లాడే స్వేచ్ఛ, అవకాశాలు వుండవు. వీరిలో కూడా అందరికన్నా అట్టడుగున వున్నది స్త్రీలు గనక వీరే అత్యధిక స్థాయిలో దోపిడీకి గురవుతారు. ఈ విషయం లోనే రచయిత చేసిన మరో ఆసక్తికరమైన పరిశీలనను చూస్తే మనకు ఇది స్పష్టం అవుతుంది. మన దేశంలో హరిత విప్లవానికి నాంది పలికిన హర్యానా, పంజాబ్ రాష్ట్రాలే స్త్రీలపై అత్యాచారాలకు కూడా నాంది పలికాయి. మన దేశంలో మొట్టమొదటి ఏమ్నియోసెంటెసిస్ క్లినిక్ అమృత్‌సర్‌లో స్థాపించబడింది. 1978-83 కాలంలో 78,000 మంది ఆడ శిశువులను బలిగొన్నది అక్కడి 'హరిత అభివృద్ధి'. వరకట్న హత్యల సంఖ్య కూడా 'అభివృద్ధి' ప్రాంతాల

లోనే పెరగడం మొదలైంది. దేశంలోని ఇతర చోట్ల కూడా ఇలాంటి ఫలితాలే కన బడ్డాయి.

ప్రకృతిని సృజనాత్మక, సజీవ రూపంగా కాక ఒక నిష్క్రియాపరమైన నిర్జీవ పదార్థంగా చూస్తే, ప్రకృతిలోని వివిధ సజీవ ప్రక్రియలు, పదార్థాలు, వాటి మధ్య వున్న అంతస్సంబంధాలూ, వైరుధ్యాలూ అర్థం కావు. ప్రకృతి సూత్రాల కను గుణంగా మానవ జీవిత వికాసానికి తోడ్పడాల్సిన శాస్త్రీయ జ్ఞానం ఈ రోజు ప్రకృతి విరుద్ధంగా, ప్రజల మనుగడకు విరుద్ధంగా మారింది. ఈ తప్పుడు అభివృద్ధికి పేద ప్రజలు, స్త్రీలు మూల్యాన్ని చెల్లిస్తున్నారు. స్త్రీలకున్న పర్యావరణ స్పృహ, జ్ఞానం వల్ల ఈ అత్యాచారాన్ని మొట్టమొదలు గుర్తించి పోరాడింది వాళ్ళే. హిమాలయాల ప్రాంతంలో అడవి నిర్మూలనకు వ్యతిరేకంగా అక్కడి స్త్రీలు సరళా బేన్, బిమలా బేన్‌ల నాయకత్వంలో వీరోచితమైన 'చిప్కో' ఉద్యమాన్ని నడిపారు. ఈ ఉద్యమం గురించి, చరిత్రలో అనామకంగా వుండిపోయిన వీర వనితల గురించి ఎన్నో ఆసక్తి కరమైన వివరాలను రచయిత ఈ పుస్తకంలో పొందుపరిచారు. వాళ్ళ పోరాట పటిమనేకాక, వారి జ్ఞానాన్ని కూడా కళ్ళకు కట్టారు. పురుషులెవరూ పట్టించుకోక పోయినా దళాలుగా ఏర్పడి స్త్రీలంతా కలిసి అడవితల్లిని ఎలా రక్షించుకున్నారో, వారి పోరాటాన్ని ఊరూరా, గ్రామం గ్రామం తిరిగి ఎలా విస్తృతపరిచారో, ఏ పద్ధతులు అవలంబించారో వివరించారు. పర్యావరణ ఉద్యమంనుండే ఎన్నో పాటలు, కవితలు, విలువైన సాహిత్యాన్ని కూడా సృష్టించారు ఘర్‌వాల్ ప్రాంతం స్త్రీలు. ఇక్కడే కాదు దేశంలోని వివిధ చోట్ల జరిగిన అన్ని పర్యావరణ ఉద్యమాలలో స్త్రీలే ముందున్నారు. ప్రకృతి ఒడిలో ఇంతకాలం వున్న స్త్రీలు ఇప్పుడు ప్రకృతినే తమ ఒడిలోకి తీసుకున్నారు.

పర్యావరణ సమస్యల ఆర్థిక, సాంఘిక, రాజకీయ నేపథ్యాన్ని ఎంతో వివరంగా చర్చించిన వందనా శివ, ఈ సమస్యకు సరైన పరిష్కారం ఎక్కడా చెప్పలేక పోయారు. ఎందుకంటే సమస్యను మూలంలోకి వెళ్ళి చర్చించలేదు గనక పరిష్కారం కూడా ఉపరితలానికే పరిమితం అయ్యింది. ప్రకృతిని అర్థం చేసుకొని, పర్యావర ణాన్ని కాపాడ్డానికి 'ఫెమినైన్ ప్రిన్సిపుల్' (స్త్రీ వాద దృక్పథం)ని అలవర్చు కోవా లని, ఆ దృక్పథంతోనే శాస్త్రీయ సాంకేతిక జ్ఞానం అభివృద్ధి కావాలని అన్నారు. 'ఫెమినైన్ ప్రిన్సిపుల్' ఏమిటనే చర్చను ప్రక్కన బెడితే అసలు ఈ వ్యవస్థ

ఎందుకు ప్రకృతి వ్యతిరేక, ప్రజా వ్యతిరేక వ్యవస్థగా వుంది? అశాస్త్రీయ పురుషాధిక్య, సంకుచిత శాస్త్ర విజ్ఞానానికి మూలం ఎక్కడుందో రచయిత చర్చించలేదు. కేవలం వలసవాదుల రాజకీయ విధానం వల్ల, పాశ్చాత్య శాస్త్రాల ఆగమనం వల్ల మూడవ ప్రపంచ దేశాలలో పర్యావరణ సమస్యలు వచ్చాయని రాసారు. ఈ వాదనా క్రమంలోనే మొత్తంగా శాస్త్రవిజ్ఞానాన్నే అనేక చోట్ల తప్పు పట్టారు. శాస్త్రానికి సంకుచిత స్వభావం వుంటుందా? శాస్త్రవేత్తలకు ఉండవచ్చును గాని దానికదిగా శాస్త్రాన్ని తప్పుపట్టవచ్చా? శాస్త్రజ్ఞానం దారి తప్పడానికి పాశ్చాత్యదేశాలో, లేక వలసవాదమో కారణమా? ఉపరితలంలో వున్న ఏ సాంఘిక అంశానికైనా ఉత్పత్తి విధానంతో వున్న సంబంధాన్ని చాలా మంది మేధావులు కావాలని పట్టించుకోరు ఎందుకంటే ఉపరితలానికే పరిమితం అవడంలో సౌలభ్యం వుంటుంది. పైగా ఎవరితోనూ పేచీ వుండదు పుస్తకం మొత్తంలోనూ ఎక్కడా వర్గ దృక్పథమే లేదు. ప్రకృతి మీదగానీ స్త్రీల మీదగానీ అమలవుతున్న అణచివేత మొత్తం వర్గ సమాజంలోని అనివార్య చర్యలుగా ఆమె భావించలేదు. శాస్త్రంలోగానీ, సాంఘిక విషయాల్లోగానీ పురుషాధిక్య భావజాలానికి పునాది వ్యక్తిగత ఆస్తిలో, అంతిమంగా వర్గ సమాజంలో వుందని ఎక్కడా స్పష్టం చేయలేదు. పర్యావరణం మీద జరిగే అత్యాచారాన్ని కేవలం సంకుచిత శాస్త్రవిజ్ఞానం మీదకు నెట్టివేస్తే సరిపోతుందా? ఈ శాస్త్రాన్ని సంకుచితంగా మార్చి ప్రకృతిని పీల్చి పిప్పి చేస్తున్న సామ్రాజ్యవాదం పాత్రను వదిలేస్తే సమస్య మూలాలు అస్పష్టంగానే వుంటాయి.

రచయిత వాదనల్లో శాస్త్రవిజ్ఞానాన్ని తిరస్కరించడంతో పాటే ఇంకా అనేక తప్పుడు భావాలు వున్నాయి. సాంప్రదాయ పద్ధతులలోనూ, ఆదిమ వ్యవస్థలోనూ పరిష్కారాన్ని వెతకడం లాంటివి. ఇది కొత్త వాదనేమీ కాదు. పర్యావరణం గురించి మాట్లాడే మేధావులు చాలా మందికి ఇవే అభిప్రాయాలు వున్నాయి. ఆధునికత పర్యావరణ సమస్యలు తెచ్చిపెట్టింది గనక ఆదిమ వ్యవస్థే దీనికి పరిష్కారం అని భావిస్తారు. ఇప్పటి వరకు మన దేశంలో జరిగిన పర్యావరణ ఉద్యమాలన్నీ 'చిప్కో'తో సహా దాదాపు ఈ దృక్పథంతోనే జరిగాయి. సాంప్రదాయ జ్ఞానాన్ని తప్పకుండా పరిగణలోకి తీసుకోవాల్సిన అవసరం వుందికాని, సమాజాన్ని వెనక్కి నడిపించాలనుకోవడం, తిరోగమన వాదం అచారిత్రకం. ప్రకృతిలో వున్న పర్యావరణ సమతౌల్యం అనేది స్థిరంగా (static) వుంటుందని వీరు భావిస్తారు. కాని అది

ఆదిమ యుగాలనుండి ఈ నాటి వరకూ మారుతూ కొత్త స్థాయిని అలవర్చుకుంటూ వచ్చింది. చలనం దాని లక్షణం. దాన్నే అస్థిర (dynamic) సమతౌల్యం అంటారు. ఈ అస్థిర సమతౌల్యం కూడా విపరీతమైన దోపిడీ వల్ల దెబ్బతినవచ్చు. సమతౌల్యాన్ని కాపాడుకోవాలంటే దోపిడీ ఉత్పత్తి విధానం పోవాలి, సమాజంలో వర్గాలు అంతరించాలి.

చివరగా రచయిత వాదనల్లో వివాదాస్పదంగా వున్న మరొక విషయం స్త్రీని ప్రకృతితో సమానం చేయడం. స్త్రీ ప్రకృతి అని, దానిమీద పురుషుడి బీజం అని వార్యమని చెప్పిన మన వేదాలను, పురాణాలను కూడా రచయిత ఆసరాగా తీసుకున్నారు. దీన్నిబట్టి స్త్రీ, ప్రకృతి రెండూ కూడా సహజంగానే లొంగుబాటు లక్షణం (Passivity) కలిగి వున్నాయనీ మరింత నొక్కి చెప్పడం అవుతుంది. రెండిటినీ లొంగదీసుకున్న పురుషాధిక్య భావజాలం ప్రస్తావనే అప్పుడు నిరర్థకం అవుతుంది. అసమానత్వం కూడా అప్పుడు మొదటినుండీ వుందని, 'సహజమని' వాదించవచ్చును. కాబట్టి ప్రకృతికీ, స్త్రీకి మధ్యవున్న సన్నిహితత్వానికీ సాహచర్యానికీ వున్న గతి తార్కిక నేపథ్యాన్ని అర్థం చేసుకోకుండా రెండిటినీ సమానంగా చూడడం అనేది స్త్రీ వ్యక్తిత్వం చుట్టూ మరోరకం భ్రమను సృష్టించడమే అవుతుంది.

ఈ రకంగా ఎన్నో భ్రమలను తొలగించిన ఈ పుస్తకం మరెన్నో కొత్త భ్రమలను ప్రవేశపెట్టింది. పర్యావరణ ఉద్యమంలో తలెత్తుతూన్న ప్రముఖమైన వాదనలను అర్థం చేసుకోవడానికి ఈ పుస్తకం చాలా ఉపయోగంగా వుంటుంది.

సంస్మరణ :

పల్లాం తిరుపాల్

ఆయన "లేత ఎరుపులో ప్రభాతాన్ని" చూశాడు. ఆయన "లోపల కడపటి యుద్ధం వరకూ చిందిన రక్తం కురిసి ఘనీభవించిన నేత్ర సరస్సులు ద్రవించి ధారాపాతమై" ప్రవహించాయి. ఆకాశపు హద్దులు దాటిన ఆయన హృదయంలో అలజడి సంగీతమై పల్లవించింది. ఆయన చూపు వేకువ వాకిటిలో వెలుగు రేఖల్ని ఆకాశపు టంచుల్లో చిత్రించింది. తన హృదయం మీటి చూస్తే అలలహోరు వినిపిస్తుందన్నాడాయన. తన కనురెప్పలు సముద్రకెరటాల అంచులన్నాడు. 'తూరుపు నా చూపు ఆకాశమే రేపటి రూపు' అన్నాడు.

ఆయన పల్లాం తిరుపాల్. కవి. విరసం సభ్యుడు. విస్తృతంగా ప్రజల ఆదరణను చవిచూసి, ఆంధ్రదేశం నాలుగుచెరగులనుంచీ అందిన స్నేహార్ద్ర ఆర్థికహస్తాల వంతెన మీదనే శస్త్రచికిత్స పరీక్ష దాటి, అయినా తిరగబెట్టిన అనారోగ్యానికి బలియై పోయాడు.

1966 జనవరి **1**న చిత్తూరుజిల్లా రేణిగుంటలో నిజంగా మట్టిలో పుట్టాడు తిరుపాల్. ఆ మట్టిచేతులే తనను మేధావిగా మలుస్తుంటే, ఎవరిపై గేయాలు కట్టాలో నిర్ణయించుకున్నాడు. రాడికల్ విద్యార్థి సంఘంలో క్రియాశీల కార్యకర్త అయ్యాడు. జననాట్యమండలి సాంస్కృతిక సైనికుడయ్యాడు. విప్లవ రచయితల సంఘం సభ్యుడయ్యాడు. రాయలసీమ విద్యార్థియువజన కార్యాచరణ కమిటీ పోరాటంలో భాగమయ్యాడు. విద్యార్థి, యువజన, సాహిత్య, సాంస్కృతిక రంగాలలో విప్లవాచరణను సమన్వయించాడు.

తిరుపాల్‌ను నాలుగు సంవత్సరాలుగా మూత్ర పిండాల వ్యాధి పీడించింది. మొదటి శస్త్రచికిత్స జరిగిన కొన్నాళ్ళకే మళ్ళీ శస్త్రచికిత్స చేయవలసిన అవసరం వచ్చింది. కుటుంబ ఆర్థిక స్థితి దృష్ట్యా ప్రజలనుంచి సహాయం కావాలని ప్రకటిస్తే వేలాది రూపాయల ఆర్థిక సహాయం అందింది. "మనుషుల మధ్య విశ్వాసమూ ప్రేమా ఉద్దీప్తం అయిన సమయం"గా విరసం, చిత్తూరు జిల్లా యూనిట్ ఆ సమయాన్ని గుర్తించింది. తిరుపాల్ మృత్యు శయ్యపై ఉండగానే పోలీసులు ఆయనపై

ఒక అక్రమ కేసు బనాయించి అరెస్టు చేశారు. ఏప్రిల్ 87లో శస్త్ర చికిత్స జరిగిన తర్వాత ఆరునెలల్లోనే వ్యాధి మళ్ళీ తిరగబెట్టింది. పరిష్కారం గురించి ఆలోచిస్తుండగానే తిరుపాల్ 1990 ఫిబ్రవరి 8న చివరి ఊపిరి వదిలాడు. "మా గుండెలు సవ్వడి చేస్తున్నంతవరకు ఉద్యమమే ఊపిరిగా జీవిస్తాం" అని 1984లో రాసినట్టుగానే జీవించి మరణించాడు తిరుపాల్. భౌతికంగా మరణించినా 'మాట్లాడదాం' అని కవితా సంకలనం ద్వారా మాట్లాడుతూనే ఉన్నాడు.

టి.ఎల్. కాంతారావు

ప్రముఖ సాహిత్య విమర్శకుడు, విప్లవ సాహిత్యాభిమాని టి. ఎల్. కాంతారావు 1990 మార్చి 4న అనారోగ్యంతో మరణించారు విజయవాడ సిద్ధార్థ కళాశాలలో తెలుగు లెక్చరర్‌గా పనిచేస్తుండిన టి. ఎల్. కాంతారావు గత రెండు దశాబ్దాలకు పైగా అన్ని తెలుగు పత్రికలలోను విరివిగా సాహిత్య విమర్శ వ్యాసాలు రాశారు, పుస్తక సమీక్షలు చేశారు, కవులను, రచయితలను, పుస్తకాలను పరిచయం చేస్తూ వ్యాసాలు రాశారు. 'భారతి'లో సాహిత్య వ్యాసాలద్వారా, ఆంధ్ర సచిత్ర వార పత్రికలో 'కొత్తగొంతులు' శీర్షికద్వారా, ఆంధ్రప్రభ దినపత్రిక 'కలాలు - సంకలనాలు' శీర్షికద్వారా ఆయన సాహిత్య విమర్శలో తనదైన ఒరవడిని చూపారు. ప్రధానంగా ఇటువంటి పత్రికలలోనే రాస్తూ వచ్చిన కాంతారావు అరుణతార, సృజనలకు కూడ రచనలు చేశారు.

సాహిత్య విమర్శకుడుగా కాంతారావు ప్రజాసాహిత్య దృక్పథాన్ని ప్రచారం చేయడానికి ప్రయత్నించారు. దాదాపు విప్లవ సాహిత్యోద్యమంతోపాటుగానే సాగిన తన సాహిత్య జీవితంలో స్పష్టంగా సాహిత్యానికి ప్రజలపట్ల నిబద్ధత ఉండాలని ఆయన గుర్తించారు. ఈ విలువను స్థాపించేందుకు, ప్రచారం చేసేందుకు ఆయన తన శక్తినంతా వెచ్చించారు. ఇతరేతరంగా చాల స్నేహపూర్వకంగా ఉండే కాంతారావు ఈ విలువ విషయంలో నిర్మొహమాటంగా ఉండేవారు. అట్లాగే విప్లవ సాహిత్యోద్యమానికి బైట ఉన్న విమర్శకుడిగా ఆయన తెలుగు సాహిత్య చరిత్రలో విప్లవ సాహిత్యోద్యమ స్థానాన్ని గుర్తించడానికి, స్థిరపరచడానికి ప్రయత్నించారు ఈ ప్రయత్నంలో భాగంగా ఆయన సాహిత్యంలో అనిబద్ధతను నిర్ద్వంద్వంగా ఖండించారు. వ్యక్తివాద, కాల్పనికవాద ధోరణులను విమర్శించారు. టి. ఎల్. కాంతారావు మరణంతో విప్లవ సాహిత్యోద్యమం ఒక మిత్రుణ్ణి కోల్పోయింది.

ప్రతిస్పందన

జనవరి, ఫిబ్రవరి సృజనలు అందినయ్. ఆ రెండూ చూడగానే ఎంతో కాలం నుంచి ఎరిగిన 'సృజన' మూడక్షరాలు కళ్ళలో పడగానే ఆనందంతో తబ్బిబ్బయాను. 4 దీర్ఘ సంవత్సరాల తరవాత జయభేరి మోగించుకుంటూ సృజన వెలువడి రావటం ఎంత సంతోషమో....

ఈ నాలుగేళ్ళలో, మరీ ఎక్కువగా బెంగుళూరు వచ్చినాక యీ రెండేళ్ళలో సృజన చాలసార్లు కలల్లో కన్పించింది. ఎన్నో మాట్లాడుకున్నాము.

సృజన నిరంతరాయంగా వెలువడుతూనే ఉంటుందని, నేను బతికున్నంత కాలం నాకు అందుతూనే ఉంటుందని ఆశపడుతున్నాను.

సృజనకు నేను ఏమైనా రాయగలనని మీరు పనిచెప్తే సంతోషంతో చేస్తాను.

— ఎ. ఆర్.

బెంగుళూరు

సృజన రెండోసంచిక చూశాను. ఇదివరలో మనకి పాలక సంస్కృతికి మధ్య మెసేజ్‌లోనూ, మీడియంలోనూ స్పష్టమయిన సరిహద్దు రేఖ ఒకటి ఉండేది. ఇప్పుడది మెసేజ్‌లోనేగాని మీడియంలో అంత స్పష్టంగా కన్పడటంలేదు. బాల గోపాల్, వరవరరావు, సత్యమూర్తి, గద్దర్, ఉదయం, ఆంధ్రజ్యోతి, ఆంధ్రప్రభ, పత్రిక వగయిరాలలో కన్పిస్తే సృజనలో భూమి, ఉదయం 'సౌజన్యం' కన్పిస్తోంది. ఈ ఆప్టికల్ ఇల్యూజన్ మీద నాకింకా సరిఅయిన అవగాహన ఏర్పడలేదు. దూరంగా ఉండటంవల్ల కాబోలు అర్థం కాకపోయినా అలవాటుపడే అవకాశం కూడా లేకుండా పోయింది. ఏదో ఒకటయినా అయితే తప్ప సృజన్ ఇష్యూస్ గురించి కామెంట్ చేసే అర్హత నాకు కలుగుతుందని అనుకోను....

— సురా

ఢిల్లీ

సారీ !

ఫిబ్రవరి సృజన చివరి పేజీలో ఎం. ఎస్. ఆర్. రాసిన 'సాహిత్యవేత్త' గల్పికలో చివరి వాక్యం 'సార్' అని కాక 'సారీ!' అని చదువుకోవాలి.

రా, సృజనా, రా!

సృజనా వచ్చావమ్మా
మళ్ళీ ఎన్నాళ్ళకి
కాయలు కాసేయి కళ్ళు
నాలుగేళ్లు.
చినుగుపట్టి మూలబడ్డ
ఛత్రీలు బాగు చేసుకుందాం
పెరిగే కొత్తతరంతో పాటు
ఎదిగే భవిష్యత్తుకి
నిబద్దాం నిబ్బరంగా గొడుగుల్లా
పహారాలా చెకింగులా
పచ్చినెత్తుటి హత్యలా
ఎన్‌కౌంటర్లా ఎన్నయినాగానీ
ఆపలేవు అంతరంగాల జాలస్‌ని
సముద్రం పోటెత్తుతూంది.
విజయోత్సవాల్లో ఊరేగుదాం
రా, చెట్టపట్టా లేసుకుని
విరసం జెండా ఎగరేస్తూ
నువ్వు వీథుల్లో కొస్తే
ఊరు ఊరంతా కమ్మేసి
ఉత్సవం చేసుకున్నట్లుంది
ఉక్కిరి బిక్కిరవుతూంది
సంబరం
మౌనానికి చెల్లుపట్టి
మాటాడుకుందాంరా మనసారా
కలబోసు కుందాం కష్టాలు
తలబడదాం తవ్వితీసేందుకు
బంగారు భవిష్యత్తు
రా! గొంతు కలిపి పోరుదాం
అలుపులేని అడ్డులేని
మందిపాట
మనపోరాట పాట

శంకరయ్య

'భవిష్యత్తు చిత్రపటం'పై నిషేధం తొలగింపు

వరవరరావు కవితాసంకలనం 'భవిష్యత్తు చిత్రపటం' పై నిషేధాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకుంది. 1987 జనవరి 3 న ఒక ఉత్తర్వు ద్వారా ప్రభుత్వం ఈ నిషేధాన్ని ప్రకటించింది. నిషేధపు ఉత్తర్వులో పుస్తకంలో కొన్ని భాగాలు ప్రభుత్వం పట్ల ద్వేషాన్ని రెచ్చగొట్టేవిగా ఉన్నాయని, ప్రజల్ని హింసకు పురికొల్పి ప్రభుత్వాన్ని కూలదోసేవిగా ఉన్నాయని రాశారు. కాని ఆ భాగాలేవో వివరించలేదు. ఇట్లా వివరణ లేకుండా, నిషేధించిన భాగాల ఇంగ్లీషు అనువాదాలు లేకుండా నిషేధపు ఉత్తర్వులు రావడం అరుదు. మళ్ళీ ఇప్పుడు కూడ 1990 మార్చి 2న చేసిన ఒక ఉత్తర్వులో కేవలం ఒకే ఒక్క వాక్యంతో '1987 జనవరి 3న చేసిన ఉత్తర్వును ఉపసంహరించు కుంటున్నాము' అని మాత్రమే ప్రభుత్వం ఈ నిషేధాన్ని ఉపసంహరించుకుంది.

చెన్నారెడ్డి ప్రభుత్వం ప్రజాస్వామిక సాంప్రదాయాలను పునరుద్ధరిస్తున్నదనే క్రమంలో భాగంగానే ఈ నిషేధపు ఉపసంహరణ జరిగింది. నిజానికి ఇప్పటికీ ఇంకా ఏడు పుస్తకాల మీద, మూడు పత్రికలకు చెందిన 10 సంచికల మీద నిషేధం కొనసాగుతునే ఉంది. పైగా ఈ నిషేధాలన్నిటినీ గత కాంగ్రెస్ ప్రభుత్వాలే చేశాయి. భావ ప్రకటనా స్వేచ్ఛను అరికట్టే ఉద్దేశ్యం తనకు లేదని చెపుతున్న చెన్నారెడ్డి ప్రభుత్వం 1970 నుంచి అమలయిన అన్ని పుస్తక నిషేధాలను ఉపసంహరించుకోవాల్సే ఉంది.

Rs. 4/-